

# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు


## భవన నిర్మాణాలు, లే అవుట్ల అనుమతులకు నిబంధనలు సులభతరం

- సడలింపులతో జీవోలు జారీ
- రియల్ ఎస్టేట్ పుంజుకుంటుంది: మంత్రి నారాయణ

7

# బ్రాండ్ ఏపీ.. బిల్డ్ ఏపీ!!



- ❑ రాష్ట్ర పునర్నిర్మాణానికి పునరంకితం
- ❑ దెబ్బతిన్న నిర్మాణరంగాన్ని నిలబెడతాం
- ❑ అందుకోసమే ఉచిత ఇసుక పాలసీ
- ❑ రియల్ ఎస్టేట్ బాగున్నచోటే సంపద సృష్టి
- ❑ నిర్మాణరంగాన్ని గత ప్రభుత్వం కూల్చేసింది
- ❑ టీడీఆర్ బాండ్ల దోషుల్ని వదిలేది లేదు..
- ❑ నరెడ్కో ప్రాపర్టీ షోలో సీఎం చంద్రబాబు ఉద్ఘాటన

2

## గ్రామ, వార్డు సచివాలయాల్లో రేషనలైజేషన్



- ◆ మూడు కేటగిరీలుగా సచివాలయాల విభజన
- ◆ కనీసం 2500 మందికి ఒక గ్రామ, వార్డు సచివాలయం
- ◆ మల్టీపర్పస్ ఫంక్షనరీస్, టెక్నికల్ ఫంక్షనరీలుగా ఉద్యోగులు
- ◆ గ్రామాల్లో టెక్నాలజీ ప్రమోషన్‌కు ఆస్పిరేషనల్ సెక్రటరీలు
- ◆ కొత్త ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష
- ◆ తన ఫోటో లేకుండా సర్టిఫికెట్లు జారీ చేయాలని ఆదేశం

3

## స్కిల్ సెన్సస్‌కు.. ఇన్ఫోసిస్ సహకారం



- నైపుణ్యాల ప్రీ-వాలిడేషన్ కోసం ఇన్ఫోసిస్‌తో ఒప్పందం
- మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఎంఓయూ
- ఇన్ఫోసిస్ చొరవ అభినందనీయమన్న మంత్రి

4

## ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయం

- లక్ష్యసాధనకు అందరి సహకారం కావాలి
- అధికారులకు మంత్రుల ఉపసంఘం ఛైర్మన్ నారా లోకేష్ దిశానిర్దేశం
- ఉపసంఘం తొలి సమావేశం
- పాల్గొన్న వివిధ శాఖల ఉన్నతాధికారులు

4



## త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా నైపుణ్య గణన



- ● జీవితకాలం ఉపయోగపడేలా స్కిల్ సెన్సస్ డేటా ఉండాలి
- ● మంగళగిరి అనుభవాలతో మరింత అర్థవంతంగా సేకరణ
- ● అధికారులకు మంత్రి లోకేష్ ఆదేశాలు
- ● స్కిల్ డెవలప్‌మెంట్‌పై అధికారులతో మంత్రి సమీక్ష

5

### స్విమ్స్ నుంచి క్షతగాత్రుల డిశ్చార్జ్

- అనంతరం వారికి శ్రీవారి వైకుంఠ ద్వార దర్శన భాగ్యం
- ప్రత్యేక వాహనాల్లో సొంతూళ్లకు తరలింపు



- ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు
- ఏర్పాట్లను పర్యవేక్షించిన కలెక్టర్, కమిషనర్

9

### పరామర్శ పేరుతో జగన్ దుష్టచతుష్టయ యాత్ర

- సీఎం చంద్రబాబును తిట్టాలని డబ్బుల కవర్లు ఇచ్చి క్షతగాత్రులకు ప్రలోభాలు
- స్విమ్స్ సీసీ కెమెరాల్లో రికార్డయిన దృశ్యాలు
- తొక్కిసలాటపై పూర్తిస్థాయి విచారణకు మంత్రివర్గ ఉపసంఘం
- తిరుపతి తరహా ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు
- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

6

### శ్రీవారి భక్తులందరికీ.. బేషరతు క్షమాపణలు

- తిరుపతి తొక్కిసలాట దురదృష్టకరం
- టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు

3



### జగన్ గ్యాంగ్‌తో తిరుమల అపవిత్రం



- టీటీడీని ఏటీఎంలా మార్చుకుని దోచుకుతిన్నారు
- అవినీతి అనకొండ రోజా బాగోతం తెలియనిదెవరికి
- పరామర్శ పేరుతో డ్రామాలు
- శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ

8

### వైద్య, ఆరోగ్యశాఖలో ఏడెనిమిది వేల ఖాళీల భర్తీ

- మంత్రి సత్యకుమార్ యాదవ్

11

### భవిష్యత్‌లో 20 వేల గోకులాలు నిర్మిస్తాం

- ఉప ముఖ్యమంత్రి పవన్ వెల్లడి
- 12,500 మినీ గోకులాలకు లాంఛనంగా ప్రారంభోత్సవం
- అతి తక్కువ సమయంలో భారీ సంఖ్యలో నిర్మాణాలు

10

చైతన్యరథం

# బ్రాండ్ ఏపీ.. బిల్డ్ ఏపీ!!

- రాష్ట్ర పునర్నిర్మాణానికి పునరంకితం
- దెబ్బతిన్న నిర్మాణరంగాన్ని నిలబెడతాం
- అందుకోసమే ఉచిత ఇసుక పాలసీ
- రియల్ ఎస్టేట్ బాగున్నచోటే సంపద సృష్టి
- నిర్మాణరంగాన్ని గత ప్రభుత్వం కూల్చేసింది
- టీడీఆర్ బాండ్ల దోషుల్ని వదిలేది లేదు..
- నరెడ్కో ప్రాపర్టీ షోలో సీఎం చంద్రబాబు ఉద్ఘాటన



గుంటూరు (చైతన్య రథం): 'బిల్డ్ ఏపీ నినాదంతో ముందుకెళ్తున్నాం. ఐదేళ్ల విధ్వంస పాలనలో పడకేసిన నిర్మాణరంగాన్ని నిలబెట్టాలన్న ధ్యేయంతో ఉన్నాం. అందుకే నరెడ్కో ప్రాపర్టీ షో ప్రారంభ కార్యక్రమానికి వచ్చా. రాష్ట్రంలో నిర్మాణ రంగానికి మళ్లీ ఊపు రావాలని కోరుకుంటున్నాను. నిర్మాణం రంగాన్ని అభివృద్ధి చేయడానికి ముందుకొచ్చేవారికి ప్రభుత్వం అండగా ఉంటుంది. యుద్ధప్రాతిపదికన సమస్యలు పరిష్కారిస్తాం' అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హామీఇచ్చారు. గుంటూరులోని చేబ్రోలు హనుమయ్య మైదానంలో నిర్వహించిన నరెడ్కో ప్రాపర్టీ షోను సీఎం ప్రారంభించారు. అనంతరం బిల్డర్లను ఉద్దేశించి మాట్లాడారు.

## ఎటు చూసినా విధ్వంసం... అంధకారమే కనబడింది

'7 నెలల క్రితం వరకూ నిర్వీర్యమైన రాష్ట్రాన్ని చూశాం. అన్ని వ్యవస్థలు పతనమయ్యాయి. నిర్మాణ రంగమైతే గత ఐదేళ్లు అడ్రస్ లేకుండాపోయింది. అందుకే ఎన్నికల్లో మమ్మల్ని ఆశీర్వదిస్తే అన్ని రంగాల్లో రాష్ట్రాభివృద్ధి చేసే బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చాం. ప్రజలు మమ్మల్ని నమ్మి 93శాతం స్ట్రైక్ రేట్, 53శాతం ఓట్లు వేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్ర పునర్నిర్మాణం ప్రారంభించాం. గత ఐదేళ్లు ఎటు చూసినా అంధకారం... విధ్వసమే కనబడింది. ఇప్పటికీ సమస్యలు ఉన్నాయి. మొన్ననే రాష్ట్ర చరిత్రలో లేనివిధంగా ప్రధాని మోదీ రూ.2.08 లక్షల కోట్ల అభివృద్ధి పనులు, పెట్టుబడులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. బ్రాండ్ ఏపీ ఇమేజ్‌తో ఇప్పుడిప్పుడే రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయి' అని సీఎం చంద్రబాబు అన్నారు.

## వ్యవసాయం, పర్యాటకం ఊపందుకోవాలి

'రాష్ట్రానికి పరిశ్రమలు రావాలి. వ్యవసాయం లాభసాటి కావాలి. పర్యాటకం ఊపందుకోవాలి. సంపద పెరగాలి.. అప్పుడే రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధి చెందుతుంది. రాష్ట్రంలో 40లక్షల కుటుంబాలు నిర్మాణరంగంపై ఆధారపడ్డాయి. గత ఐదేళ్లు ఇసుక లభించక భవన నిర్మాణ రంగం కార్మికులకు సరైన ఉపాధి ఉండేది కాదు. మా ప్రభుత్వంలో ఉచిత ఇసుక విధానానికి శ్రీకారం చుట్టాం. ఇసుక కొరత లేకుండా చేశాం. ఎవరైనా ఇసుక లభ్యం కాకపోతే.. గట్టిగా అడిగే హక్కు ఈ ప్రభుత్వం ఇచ్చింది. నరెడ్కో సంస్థ అంచలంచెలుగా ఎదిగింది. రియల్ ఎస్టేట్ రంగం వాటా జీడీపీలో 7.3 శాతం ఉంది. 2047కు 20 శాతం పెరిగి, 5.8 ట్రిలియన్ డ్రాలర్లు ఆర్జిస్తుంది. అన్ని రంగాలు అభివృద్ధి చేస్తే ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయి. నాగరిక సమాజంలో నిర్మాణమనేది నిత్యం జరుగుతూనే ఉంటుంది. అమరావతి అభివృద్ధి జరిగివుంటే ఈ ప్రాంతం మరింత నిలదొక్కుకుని ఉండేది. కానీ ఐదేళ్లు నిర్వీర్యం చేసి రాష్ట్రంలో నిర్మాణ రంగాన్ని నిలదొక్కకోకుండా చేశారు. కూల్చివేతలతో భయభ్రాంతులకు గురి చేయడంతో నిర్మాణరంగం పూర్తిగా దెబ్బతింది. నిర్మాణ, అనుబంధ రంగాలకు ప్రాధాన్యమిచ్చాం. నా జీవితంలో ఎప్పుడూ చూడని విధంగా భూసమస్యలు వస్తున్నాయి. అధికారాన్ని అడ్డం పెట్టుకుని రికార్డులు తారుమారు చేసి భూకబ్జాలకు పాల్పడ్డారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తెచ్చి ఇష్టానుసారంగా చేయాలని చూశారు. అందుకే అధికారంలోకి వచ్చాక రద్దు చేసి, యాంటీ ల్యాడ్ గ్రాబింగ్ యాక్ట్ తెచ్చాం' అని చంద్రబాబు రాష్ట్ర పరిస్థితిని బిల్డర్లకు వివరించారు.

## టీడీఆర్ బాండ్ల దోషుల్ని వదిలిపెట్టం

'టీడీఆర్ బాండ్లలో డబ్బులు తీసుకుంది ఒకరు... నష్టపోయింది ఇంకొకరు. దీన్నికూడా గత పాలకులు అక్రమాలకు వాడుకున్నారు. అవినీతికి పాల్పడ్డవారిని వదలిపెట్టం. అమాయకుల్ని కాపాడతాం. 7 నెలల్లో రాష్ట్రంలో రూ.4 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చి పనులు ప్రారంభిస్తున్నాం. తద్వారా 4 లక్షలమంది యువతకు ఉద్యోగాలు వస్తాయి. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. అమరావతి పనులను రూ.50 వేల కోట్లతో ప్రారంభిస్తాం. ఇది స్వయం ఆధారిత ప్రాజెక్టు. రియల్ ఎస్టేట్ ఎక్కడ బాగుంటుందో అక్కడ సంపద సృష్టి జరుగుతుంది. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు కన్నా పెద్దగా అమరావతి చుట్టూ 183 కి.మీమేర రింగ్ రోడ్డుకు ప్లాన్ సిద్ధం చేశాం. అది పూర్తయితే గుంటూరు- అమరావతి పట్టణాలు కలిసిపోతాయి. రాష్ట్రంలో మౌలిక సదుపాయాలపై దృష్టిపెట్టాం. రాష్ట్రంలో పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఏపీని గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా మార్చుతాం' అని చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికలను వివరించారు.

## అవకాశాలు అందుకోవడంలో 'గుంటూరు' ముందు..

'ఐటీని అందిపుచ్చుకుని విదేశాలకు వెళ్లిన వారిలో గుంటూరువాసులు ఎక్కువ. అందరికంటే ముందుండి అవకాశాలను అందిపుచ్చుకుంటారు. ఇతర దేశాల్లో మాదిరి రాష్ట్రంలోనూ స్వచ్ఛమైన వాతావరణాన్ని సృష్టిస్తాం. వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌ను గతంలో గుంటూరులో ఏర్పాటు చేశాం. అది బ్రహ్మాండంగా పని చేస్తోంది. ఇక ప్రతి నెలా 3వ శనివారం స్వచ్ఛాంధ్రప్రదేశ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. అభివృద్ధి, సుపరిపాలన ప్రభుత్వం చేస్తుంది. వాటిని మీరు ముందుకు తీసుకెళ్లాలి. నిర్మాణరంగంలో మన రాష్ట్రాన్ని మించిన పాలసీ ఉండదు. వీలైనన్ని నిబంధనలు సరళతరం చేశాం. రాబోయే రెండు నెల్లలో డ్యాష్ బోర్డు తెస్తాం. మీరు తెచ్చిన వినతులను త్వరలోనే పరిష్కరిస్తాం. నిర్ణీత సమయానికే అనుమతులిస్తాం. ఆలస్యమైతే అధికారులపై చర్యలు తీసుకుంటాం. మీరు కూడా ఎక్కడా చట్టవ్యతిరేక పనులకు పాల్పడకుండా ఉండాలి. ఇప్పటిదాకా నిదానించిన నిర్మాణరంగాన్ని నిలబెడుతున్నాం.. ఇంకా మీరే నడవాలి... పరుగెత్తాలి. గతాన్ని మర్చిపోండి. నిర్మాణ రంగంలోనూ నూతన ఆవిష్కరణలు వచ్చాయి. వాటిని ఉపయోగించుకుంటే రూ.500 సంపాదించేవాళ్లు రూ.1,500 సంపాదించవచ్చు' అని చంద్రబాబు సూచించారు.

## దేశంలో అమరావతిలాంటి కొత్తనగరం రాదు

'దేశంలో అమరావతిలాంటి నగరం మరొకటి రాదు. కొత్త నగరాన్ని బెస్ట్ మోడల్ సిటీగా నిర్మిస్తాం. ఒక్క అమరావతినే కాదు విశాఖ, గుంటూరు, నెల్లూరు, కర్నూలు, తిరుపతిలాంటి పట్టణాలను అభివృద్ధి చేస్తాం.

భవిష్యత్తులో పట్టణాభివృద్ధి జరిగి మన నగరాలు కూడా అగ్రస్థానంలో ఉండాలి. అనధికారిక నిర్మాణాలు చేపట్టవద్దు. ఇసుకను ఉచితంగా ఇస్తాం. ఎక్కడా ఇసుక అక్రమ రవాణాను అనుమతించం. దీనిపై ఇప్పటికే కలెక్టర్ల, ఎస్పీలకు ఆదేశాలిచ్చాం. అధికారులు తప్పు చేసినా క్షమించను' అని సీఎం చంద్రబాబు హెచ్చరించారు.













# గ్రామ, వార్డు సచివాలయాల్లో రేషనలైజేషన్

- మూడు కేటగిరీలుగా సచివాలయాల విభజన
- కనీసం 2500 మందికి ఒక గ్రామ, వార్డు సచివాలయం
- మల్టీపర్పస్ ఫంక్షనరీస్, టెక్నికల్ ఫంక్షనరీలుగా ఉద్యోగులు
- గ్రామాల్లో టెక్నాలజీ ప్రమోషన్‌కు ఆస్పిరేషనల్ సెక్రటరీలు
- కొత్త ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష
- తన ఫోటో లేకుండా సర్టిఫికెట్లు జారీ చేయాలని ఆదేశం

అమరావతి (చైతన్య రథం): గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల రేషనలైజేషన్ ద్వారా వారి నుంచి మంచి సేవలు పొందేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. కొన్నిచోట్ల ఎక్కువగా, కొన్నిచోట్ల తక్కువగా గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ఉన్నారు. రేషనలైజేషన్ ద్వారా వీటిని సరిదిద్దేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. రాష్ట్రంలో ప్రస్తుతం 11,162 గ్రామ సచివాలయాలు, 3,842 వార్డు సచివాలయాలున్నాయి.వీటిలో 1,27,175 మంది పనిచేస్తున్నారు. ప్రతి సచివాలయంలో 10మంది ఉద్యోగులు ఉండేలా ఈ విభాగాన్ని డిజైన్ చేయగా... చాలా ప్రాంతాల్లో తక్కువమంది సిబ్బందితో కార్యకలాపాలు నడిపిస్తున్నారు. కొన్నిచోట్ల 4నుంచి ఆరుగురితో సచివాలయాలు పనిచేస్తున్నాయి. రేషనలైజేషన్‌లో భాగంగా మల్టీపర్పస్ ఫంక్షనరీస్, టెక్నికల్ ఫంక్షనరీస్‌గా వీరిని విభజించాలనేది ప్రతిపాదన. మల్టీపర్పస్ ఫంక్షనరీస్ విభాగంలోకి విలేజ్ సెక్రటేరియట్ పరిధిలోని పంచాయతీ సెక్రటరీ, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్, గ్రామ మహిళా పోలీస్ వస్తారు. అలాగే వార్డు సెక్రటేరియట్‌లో వార్డు అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీ, వార్డు ఎడ్యుకేషన్ అండ్ డాటా ప్రాసెసింగ్ సెక్రటరీ, వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ సెక్రటరీ, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శి వస్తారు.

టెక్నికల్ ఫంక్షనరీస్ విభాగంలోకి గ్రామ సచివాలయం పరిధిలో విలేజ్ రెవెన్యూ ఆఫీసర్, ఎఎన్ఎం, సర్వే అసిస్టెంట్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, అగ్రికల్చర్ సెక్రటరీ, వెటర్నరీ సెక్రటరీ, ఎనర్జీ అసిస్టెంట్ ఉంటారు. టెక్నికల్ ఫంక్షనరీస్ విభాగంలో వార్డు సచివాలయంలో వార్డు రెవెన్యూ సెక్రటరీ, వార్డు హెల్త్ సెక్రటరీ, వార్డు ప్లానింగ్ సెక్రటరీ, వార్డు ఎమినిటీస్ సెక్రటరీ, వార్డ్ శానిటేషన్ సెక్రటరీ, వార్డు ఎనర్జీ సెక్రటరీ వస్తారు. 2500 మంది లోపు జనాభాకు ఇద్దరు మల్టీపర్పస్ ఫంక్షనరీస్, నలుగురు టెక్నికల్ ఫంక్షనరీస్ కలిపి ఆరుగురు ఉంటారు. 2500 నుంచి 3500 మంది జనాభాకు ముగ్గురు మల్టీ పర్పస్ ఫంక్షనరీస్,నలుగురు టెక్నికల్ ఫంక్షనరీస్ కలిపి ఏడుగురు ఉంటారు. 3501 నుంచి ఆపై జనాభాకు నలుగురు మల్టీ పర్పస్ ఫంక్షనరీస్, నలుగురు టెక్నికల్ ఫంక్షనరీస్ కలిపి ఎనిమిది మంది ఉంటారు. ఈవిధంగా రేషనలైజేషన్ చేస్తే 2500లోపు జనాభా కలిగిన ప్రాంతంలో ఆరుగురు సిబ్బందితో 3,562 గ్రామ, వార్డు సచివాలయాలు ఉంటాయి. 2500నుంచి 3500 మంది జనాభా కలిగిన ప్రాంతంలో ఏడుగురు సిబ్బందితో 5,388 గ్రామ, వార్డు సచివాలయాలు ఉంటాయి. 3500 పైగా జనాభా కలిగిన ప్రాంతంలో 8మంది సిబ్బందితో 6054 గ్రామ, వార్డు సచివాలయాలు ఉంటాయి. మొత్తం 15,004 గ్రామ వార్డు సచివాలయాలు ఉంటాయి. ఈ అంశాలను సమీక్షలో అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

అనంతరం సీఎం మాట్లాడుతూ ఒకరిని ఆస్పిరేషనల్ సెక్రటరీగా నియమించాలని సూచించారు. వీరి ద్వారా ఏఐ, డ్రోన్‌వంటి కొత్త టెక్నాలజీని గ్రామాల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. ఈ సెక్రటరీ ద్వారా గ్రామాల్లో, వార్డుల్లో టెక్నాలజీ పరంగా సేవలు అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలని సీఎం అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ప్రతి ఇంటినీ జియో ట్యాగింగ్ చెయ్యాలని సూచించారు. కనీసం 2500 జనాభాకు లేదా 5 కి.మీ పరిధిలో ఒక సెక్రటేరియట్ ఉండాలని సీఎం సూచించారు. ఏజెన్సీలలో అవసరమైతే అదనంగా సచివాలయాలు పెంచాలని సూచించారు. గతంలో ప్రతిపాదించిన విధానం ప్రకారం మొత్తం 1,61,000 సచివాలయ ఉద్యోగులు ఉండాలి. కానీ ప్రస్తుతం 1,27,000 మంది మాత్రమే పనిచేస్తున్నారు. అయితే ప్రస్తుతం కొత్తవిధానం వల్ల తక్కువ సంఖ్యతో ఎక్కువ సేవలు పొందే అవకాశం ఉంది. ఉన్నవారిని సమర్థవంతంగా ఉపయోగించుకోవడం ద్వారా మెరుగైన సేవలు అందించనున్నారు. కొత్త విధానం అమలుపరిస్తే 15 వేలమంది సెక్రటేరియట్ స్టాఫ్ అదనంగా ఉంటారు. వీళ్లలో సాంకేతికంగా అవగాహన ఉన్న వారిని శిక్షణ ఇచ్చి యాస్పిరేషనల్ సెక్రటరీగా నియమించాలని సీఎం సూచించారు. అదేవిధంగా ప్రజల సమాచారం పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. సమాచారం లేని ప్రజలకు సంబంధించి పూర్తి వివరాలు తీసుకునే పక్రియను ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామ, వార్డు సచివాలయాలు రియల్‌టైమ్ గవర్నెన్స్ కార్యాలయాలుగా పనిచేయాలని సీఎం సూచించారు. సచివాలయాల పనితీరు అంచనావేసి వారికి తగిన విధంగా బహుమతి ఇవ్వాలన్నారు. పంచాయతీ కార్యదర్శి/ వార్డు పరిపాలనా కార్యదర్శి సచివాలయ విభాగానికి అధిపతిగా ఉంటారు. సచివాలయాలు నైపుణ్య అభివృద్ధి, పరిశ్రమ అభివృద్ధి, ప్రాసెసింగ్, మార్కెటింగ్, ఉపాధి, విలువ జోడింపువంటి వాటికి కేంద్రంగా ఉండాలన్నారు.

గూగుల్, మైక్రోసాఫ్ట్‌వంటి సంస్థల ద్వారా కార్యనిర్వాహకులకు సాంకేతిక శిక్షణ అందించాలన్నారు. జనవరి 20, 2025 నాటికి గృహాలన్నీ జియో-ట్యాగింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు. సచివాలయాల ద్వారా జారీ చేసే సర్టిఫికెట్లపై ముఖ్యమంత్రి ఫోటోలు ముద్రించవద్దని సీఎం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. సర్టిఫికెట్లపై ప్రభుత్వ లోగో మాత్రమే ఉండాలని సీఎం ఆదేశించారు. పిల్లలందరికీ ఆధార్ జారీ ప్రక్రియ ఫిబ్రవరి 15, 2025నాటికి పూర్తి చెయ్యాలన్నారు. రాష్ట్రంలో వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తున్న వ్యక్తుల గురించి సర్వే చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు.

## శ్రీవారి భక్తులందరికీ..

# బేషరతు క్షమాపణలు

- తిరుపతి తొక్కిసలాట దురదృష్టకరం
- టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు



తిరుమల (చైతన్యరథం): వైకుంఠ ఏకాదశి టోకెన్ల జారీ సందర్భంగా తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటనపై భక్తులందరికీ టీటీడీ పాలకమండలి తరఫున బేషరతుగా క్షమాపణలు చెబుతున్నట్లు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి బాధ్యులను ఉపేక్షించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. శుక్రవారం తిరుమల అన్నమయ్య భవన్‌లో తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సమావేశం జరిగింది. అనంతరం బీఆర్ నాయుడు మీడియాతో మాట్లాడుతూ సమావేశం వివరాలను వెల్లడించారు. తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటన దురదృష్టకరం. ఈ ఘటనలో ఆరుగురు మృతిచెందడం, పలువురికి గాయాలు కావడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో సీఎం చంద్రబాబుఎంతో బాధపడ్డారని తెలిపారు. కొన్ని పొరపాట్లు జరిగాయని మా దృష్టికి వచ్చింది. తిరుపతి తొక్కిసలాట ఘటన కొంతమంది అధికారుల తప్పిదం వల్లే జరిగింది. ఈ ఘటనలో బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఘటనపై ఇప్పటికే సీఎం చంద్రబాబు న్యాయవిచారణకు ఆదేశించారు. ఇలాంటి ఘటనలు భవిష్యత్‌లో పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకుంటాం. మృతుల కుటుంబాలకు పరిహారం చెక్కులు సిద్ధం చేశాం. శనివారం ఉదయం బాధితుల ఇళ్లకు వెళ్లి అందజేస్తాం. మృతుల కుటుంబ సభ్యుల్లో ఒకరికి కాంట్రాక్టు ఉద్యోగం ఇస్తాం. ఘటనలో మా తప్పిదం లేకపోయినా బోర్డు తరపున భక్తులందరికీ బేషరతుగా క్షమాపణలు చెబుతున్నాం. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూచనలు స్వీకరిస్తున్నాం. భవిష్యత్తులో అన్నీ అధికారులకు వదిలేయకుండా జాగ్రత్త పడతామని చెప్పారు. తప్పిదం ఎక్కడ జరిగింది.. ఎలా జరిగింది అనేది విచారణలో తేలుతుంది. విచారణ త్వరగా పూర్తి చేయాలని సీఎం చంద్రబాబును కోరతాం. ఆ తర్వాతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

చైతన్యరథం

# ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయం

- లక్ష్యసాధనకు అందరి సహకారం కావాలి
- అధికారులకు మంత్రుల ఉపసంఘం ఛైర్మన్ నారా లోకేష్ దిశానిర్దేశం
- మంత్రుల ఉపసంఘం తొలి సమావేశం
- పాల్గొన్న వివిధ శాఖల ఉన్నతాధికారులు



అమరావతి (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో రాష్ట్రంలో వచ్చే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయమని, సమన్వయ లోపం లేకుండా లక్ష్య సాధనకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. ఉండవల్లి నివాసంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనపై ఏర్పాటైన మంత్రుల ఉపసంఘం తొలి సమావేశం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులకు ఉపసంఘం ఛైర్మన్ నారా లోకేష్, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, సీఎస్ కే విజయానంద్ దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ కలిసికట్టుగా మేనిఫెస్టోను రూపొందించామని చెప్పారు. అందులో తొలి హామీ ఐదేళ్లలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో 20 లక్షల ఉద్యోగాల కల్పన. దేశ చరిత్రలో ఏ పార్టీ కూడా మేనిఫెస్టోలో ఒక నిర్దిష్టంగా ఒక సంఖ్య పెట్టి.. ఇన్ని ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పలేదు. మేం చెప్పాం. దానికి కారణం నేను యువగళం పాదయాత్రలో భాగంగా గంగాధర నెల్లూరుకు వెళ్లినప్పుడు ఓ తల్లితో మాట్లాడాను. ప్రభుత్వం నుంచి ఏం ఆశిస్తున్నారని ఆ మహిళను అడిగినప్పుడు.. ఆమె ఒక్కటే చెప్పింది. తాగుబోతు భర్త చనిపోయాడు, కష్టపడి తన ఇద్దరు బిడ్డలను చదివించానని, వారిద్దరికి ఉద్యోగాలు కల్పించాలని కోరింది. కూటమి మేనిఫెస్టో ఓ గదిలో కూర్చొని రూపొందించింది కాదు. క్షేత్రస్థాయి అనుభవాలతో రూపొందించింది. అందులో భాగంగానే 20 లక్షల ఉద్యోగాల కల్పన కోసం కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేశారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపం లేకుండా చూడాలి. ప్రతి 15 రోజులకోసారి కేబినెట్ సబ్ కమిటీ భేటీ జరుగుతుంది. నెలలో ఒకసారి ముఖ్యమంత్రితో సమావేశం జరుగుతుంది. పెట్టుబడులు, ఉద్యోగాల కల్పనను ఎప్పటికప్పుడు ట్రాక్ చేయాల్సిన అవసరం ఉందని మంత్రి లోకేష్ అన్నారు.

### ఉద్యోగాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలి

గడచిన ఐదేళ్లలో ఏం జరిగిందో అందరం చూశాం. చెప్పుకునే స్థాయిలో పెట్టుబడులు రాలేదు. తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక మనకంటే ముందు వరుసలో ఉన్నాయి. పెట్టుబడులు తీసుకురావడం అంత సులభం కాదు.. చాలా సమయం పడుతుంది. మళ్లీ జగన్‌రెడ్డి రాడనే గ్యారంటీని పారిశ్రామిక వేత్తలు అడుగుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో పీపీఏలను రద్దు చేశారు. పలు పరిశ్రమలను పొరుగు రాష్ట్రాలకు తరిమివేశారు.వారిని బతిమిలాడి రాష్ట్రానికి తీసుకువచ్చే పరిస్థితి ఉంది. 1995-2004తో పోల్చుకుంటే రాష్ట్రాల మధ్య పోటీ పెరిగింది. పెట్టుబడులు, ఉద్యోగాల కల్పనపై వివిధ ప్రభుత్వ శాఖలు ప్రత్యేక దృష్టి సారించాలి. పెట్టుబడిదారులకు అవసరమైన అనుమతులు, భూకేటాయింపులు త్వరితగతిన మంజూరయ్యేలా చూడాలి. కేంద్రం, ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఏపీ అభివృద్ధికి సహకరిస్తున్నారు. అందరం కలిసికట్టుగా పనిచేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలుపుదాం. సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో జరగాలి. భారీగా పెట్టుబడులు వచ్చి ఉద్యోగాలు కల్పిస్తేనే జీతాలు ఇచ్చే పరిస్థితి ఉంది. నెలకు రూ.4వేల కోట్ల లోటుతో రాష్ట్రం నడుస్తోంది. అందరం కలసి 20 లక్షల ఉద్యోగాల కల్పనకు కృషిచేద్దామని మంత్రి లోకేష్ అన్నారు.

### రాష్ట్రానికి మంచిరోజులు

కూటమి పాలనలో రాష్ట్రానికి మంచి రోజులు వచ్చాయి. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారు. సింగిల్ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ గా ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డు (ఈడీబీ) వ్యవహరిస్తుంది. లక్ష్య సాధనకు అందరి సహకారం కావాలి. ఒక్క పెట్టుబడి కూడా పొరుగు రాష్ట్రానికి వెళ్లడానికి వీలులేదు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్య శిక్షణ అందించాలి. మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు.

### ఉపాధి కల్పనపైనే దృష్టి: మంత్రి దుర్గేష్

మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉద్యోగ, ఉపాధి కల్పనపై ఎక్కువ దృష్టి పెట్టిందన్నారు. గత ఐదేళ్లు రాష్ట్రం ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదు. రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అహర్నిశలు కృషిచేస్తున్నారు. అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యత ఇస్తున్నారు. పర్యాటక రంగంలో విస్తృత అవకాశాలు ఉన్నాయి. లక్ష్యసాధనకు తమవంతు బాధ్యత వహించాలి. శాఖల మధ్య సమన్వయ లోపం లేకుండా చూడాలని మంత్రి దుర్గేష్ సూచించారు.

ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల ప్రణాళికలు, భవిష్యత్ లక్ష్యాలను అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

ఈ సమావేశంలో వ్యవసాయ, పరిశ్రమలు, ఆరోగ్యం, హెూమ్, మానవ వనరులు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఇన్వెస్ట్ మెంట్(ఐ అండ్ ఐ), జీఎస్‌డబ్ల్యూఎస్, ఇండస్ట్రీస్ అండ్ కామర్స్, ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, కార్మిక, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్, పంచాయతీ రాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్, సెర్ప్, పర్యాటకం, రవాణ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# స్కిల్ సెన్సస్‌కు.. ఇన్ఫోసిస్ సహకారం

- నైపుణ్యాల ప్రీ-వాలిడేషన్ కోసం ఇన్ఫోసిస్‌తో ఒప్పందం
- మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఎంఓయూ
- ఇన్ఫోసిస్ చొరవ అభినందనీయమన్న మంత్రి



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో యువతకు ఉపాధి అవకాశాలను మెరుగుపర్చేందుకు దేశంలోనే ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్కిల్ సెన్సస్ కార్యక్రమాన్ని మరింత ప్రయోజనకరంగా నిర్వహించేందుకు అవసరమైన సాంకేతిక సహకారం అందించడానికి ప్రముఖ సాఫ్ట్‌వేర్‌సంస్థ ఇన్ఫోసిస్ ముందుకువచ్చింది. ఎటువంటి ఆర్థికవనరులతో సంబంధం లేకుండానే స్కిల్ సెన్సస్‌లో భాగంగా జనరేటివ్ ఏఐని ఉపయోగించి అభ్యర్థుల నైపుణ్యాల ముందస్తు ధృవీకరణ కోసం డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ను అందించేందుకు ఇన్ఫోసిస్, ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) మధ్య రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సమక్షంలో అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద స్కిల్ సెన్సస్ డాటా ప్రీ వాలిడేషన్‌కు ఇన్ఫోసిస్ ముందుకు రావడం అభినందనీయమన్నారు.దీనిద్వారా రాష్ట్రంలో యువత ప్రస్తుత నైపుణ్యాలను అంచనావేసి, మార్కెట్ డిమాండ్‌కు తగ్గట్టుగా వారికి స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇవ్వడానికి మార్గం సులభ తరం అవుతుందని చెప్పారు. రాష్ట్రంలో రాబోయే ఐదేళ్లలో యువతకు 20లక్షల ఉద్యోగాల లక్ష్యసాధనలో భాగస్వామి కావడానికి ఇన్ఫోసిస్ ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఇన్ఫోసిస్ ప్రతినిధులు సంతోష్, తిరుమల,స్కిల్ డెవలప్‌మెంట్ కార్యదర్శి కోన శశిధర్, స్కిల్ డెవలప్‌మెంట్ ఉన్నతాధికారులు గణేష్‌కుమార్, దినేష్ కుమార్, రఘు పాల్గొన్నారు.

### యూజర్ ఫ్రెండ్లీ ఇంటర్‌ఫేస్‌లు

డిజిటల్ లెర్నింగ్‌లో భాగంగా ఇన్ఫోసిస్ సంస్థ లెర్నింగ్ పాత్‌వేస్‌కు విద్యార్థులను కనెక్ట్‌చేసే యూజర్ ఫ్రెండ్లీ ఇంటర్‌ఫేస్‌లను సృష్టించి,నిరంతర అభ్యాసాన్ని సులభతరం చేస్తుంది. పరిశ్రమల అవసరాలను తీర్చడానికి ఏపీఎస్ఎస్‌డీసీకి సహకరిస్తుంది. ఔత్సాహికులకు ఉచితంగా నేర్చుకునే అవకాశాలను కల్పించడం, సాంకేతికత అభివృద్ధి, డిజిటల్ ప్లాట్‌ఫారమ్ నిర్వహణ ఇన్ఫోసిస్ చేపడుతుంది. అభ్యర్థుల నైపుణ్యాలను సమర్థవంతంగా అంచనా వేయడానికి జనరేటివ్ ఇన్ఫోసిస్ డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ను అభివృద్ధి చేసి అందిస్తుంది. ఈ ప్లాట్‌ఫారమ్ వివిధ పరిశ్రమల్లో అవసరమైన నైపుణ్యాల సమగ్ర మూల్యాంకన చేస్తుంది.ఇందులోభాగంగా అభ్యర్థుల ప్రస్తుత నైపుణ్య స్థాయిలను అంచనా వేసి ముందస్తు ధ్రువీకరణకు చర్యలు చేపడతారు. ప్రాథమిక అంచనానుబట్టి అభ్యర్థుల ప్రస్తుత నైపుణ్యాలు, తదుపరి అభివృద్ధి కోసం సిఫార్సులు చేస్తారు.

### నిరంతర నైపుణ్యాభివృద్ధి కోసం..

ఇందులో భాగంగా ఇన్ఫోసిస్ స్ప్రింగ్‌బోర్డ్ ప్లాట్ ఫారమ్‌లో క్యూరేటెడ్ లెర్నింగ్ పాత్‌వేస్‌తో ఔత్సాహికులను కనెక్ట్ చేస్తుంది, ఉచిత ఆన్‌లైన్ కోర్సులు, వర్క్‌షాప్‌లు నిర్వహించి అంచనా వేసిన నైపుణ్యాలు, కెరీర్ ఆకాంక్షలకు అనుగుణంగా నిరంతర నైపుణ్యాభివృద్ధి కోసం సాంకేతిక సహకారాన్ని ఇన్ఫోసిస్ అందిస్తుంది. ఇన్ఫోసిస్ పారదర్శక, డేటా ఆధారిత ఫలితాలను నిర్ధారిస్తూ నైపుణ్య అంచనాల పురోగతి, ఫలితాలను ట్రాక్ చేయడానికి ఈ ఒప్పందం దోహద పడుతుంది. రాష్ట్రంలో 15-59 సంవత్సరాల నడుమ వయసు కలిగిన 3.59 కోట్లమందికి సంబంధించి నైపుణ్యాలను ఇన్ఫోసిస్ ప్రీ-వాలిడేషన్ చేసి అందిస్తుంది. దీనిద్వారా ప్రస్తుతం ఏపీ ప్రభుత్వం చేపడుతున్న స్కిల్ సెన్సస్ ఫ్రేమ్‌వర్క్, నైపుణ్యం అప్లికేషన్‌లో డిజిటల్ ప్లాట్‌ఫారమ్ ఏకీకరణ సులభతరం అవుతుంది. విద్యా సంస్థల్లో మూల్యాంకన సాధనాల అమలుకు అవసరమైన మద్దతు లభిస్తుంది.

# త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా నైపుణ్యగణన


- జీవితకాలం ఉపయోగపడేలా స్కిల్ సెన్సస్ డేటా ఉండాలి
- మంగళగిరి అనుభవాలతో మరింత అర్థవంతంగా సేకరణ
- అధికారులకు మంత్రి లోకేష్ ఆదేశాలు
- స్కిల్ డెవలప్‌మెంట్‌పై అధికారులతో మంత్రి సమీక్ష



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రవ్యాప్తంగా త్వరలోనే స్కిల్ సెన్సస్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలని అధికారులను విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. దేశంలోనే తొలిసారిగా చేపట్టనున్న స్కిల్ సెన్సస్ విధివిధానాలపై స్కిల్ డెవలప్‌మెంట్ శాఖ అధికారులతో మంత్రి లోకేష్ శుక్రవారం ఉండవల్లి నివాసంలో సమీక్షించారు. మంగళగిరిలో చేపట్టిన నైపుణ్యగణన అనుభవాలను పరిగణనలోకి తీసుకొని మరింత అర్థవంతంగా, సులభతరంగా రాష్ట్రవ్యాప్తంగా స్కిల్ సెన్సస్ చేపట్టాలని సూచించారు. స్కిల్ సెన్సస్ ద్వారా సేకరించిన డేటా యువతకు జీవితకాలం ఉపయోగపడేలా ఉండాలన్నారు. ఆర్గనైజ్డ్ సెక్టార్లతోపాటు అన్ ఆర్గనైజ్డ్ స్కిల్ డేటాను కూడా సేకరించాలన్నారు. స్కిల్డ్ వర్కర్లకు టీడీపీ కేంద్ర కార్యాలయంలో తాము సొంత నిధులతో శిక్షణ ఇస్తూ ఉద్యోగావకాశాలు సైతం కల్పిస్తున్నామని, ఆ మోడల్‌ను నమూనాగా తీసుకొని ఓం క్యాప్ ద్వారా యువతకు విదేశాల్లో ఉద్యోగాలు కల్పించేలా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కేవలం అరబ్ దేశాల్లో మాత్రమే కాకుండా యూరోపియన్, సౌత్ ఈస్ట్ ఏషియా దేశాల్లో స్కిల్డ్ వర్కర్లకు డిమాండ్ ఉందని, ఆయా దేశాల్లో అవసరాన్ని బట్టి స్థానికంగా శిక్షణా కార్యక్రమాలను నిర్వహించినట్లయితే సుమారు 2 లక్షల మంది వరకు విదేశాల్లో ఉద్యోగావకాశాలు కల్పించవచ్చని అన్నారు. ఇందుకోసం వివిధ ప్రభుత్వ కళాశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు జర్మన్, జపనీస్ వంటి భాషలను కూడా నేర్పించాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్, అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని అంతర్జాతీయస్థాయి డిమాండ్‌కు అనుగుణంగా యువతను తీర్చిదిద్దాలన్నారు. స్కిల్ సెన్సస్ పూర్తయ్యాక యువతను వారికి ఆసక్తి ఉన్న రంగాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ తీసుకునేలా చైతన్యపర్చాలని తెలిపారు. రాష్ట్రంలో ఐదేళ్లలో 20లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యాన్ని చేరుకోవడంతోపాటు పేద, మధ్యతరగతి కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయడమే స్కిల్ సెన్సస్ ప్రధాన లక్ష్యమని చెప్పారు. స్కిల్ సెన్సస్ డేటా సమీకృతం చేసే సమయంలో సీడాప్, ఏపీఎస్ఎస్‌డీసీ, నాప్ డేటా డబ్లింగ్ కాకుండా చూసుకోవాలని మంత్రి సూచించారు. సమావేశంలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్యదర్శి కోన శశిధర్, స్కిల్ డెవలప్‌మెంట్ ఎండీ గణేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ బాధితురాలికి
# మంత్రి లోకేష్ సాయం

- సీఎంఆర్ఎఫ్ ద్వారా చెక్కు అందజేత
- ఎక్స్‌లో వినతికి స్పందించిన మంత్రి
- బాధిత కుటుంబం కృతజ్ఞతలు




అమరావతి (చైతన్యరథం): క్యాన్సర్ వ్యాధితో పోరాడుతున్న మహిళకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సాయం అందించి అండగా నిలిచారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నానికి చెందిన 38 ఏళ్ల ఎం స్వర్ణ దుర్గ గత కొన్నేళ్లుగా క్యాన్సర్‌తో బాధపడుతోంది. వైద్యం కోసం ఆసుపత్రికి వెళితే.. చికిత్స నిమిత్తం సుమారు రూ.10 లక్షల వరకు ఖర్చు అయింది. ఆర్థికపరిస్థితి అంతంతమాత్రంగా ఉన్న తమకు సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం అందించి ఆదుకోవాలని ఆమె భర్త మాదల చంద్రశేఖర్ ఎక్స్ ద్వారా మంత్రి లోకేష్‌కు విజ్ఞప్తి చేశారు. వెంటనే స్పందించిన మంత్రి.. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.2,51,075 చెక్కును అందజేసి వారి కుటుంబానికి తోడ్పాటు అందించారు. సమస్యను సోషల్ మీడియా ద్వారా తెలియజేసిన వెంటనే స్పందించి ఆదుకున్న మంత్రి లోకేష్‌కు బాధిత కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది.

## అన్న క్యాంటీన్ల కోసం రూ.10 లక్షల విరాళం

**- మంత్రి లోకేష్‌కు చెక్ అందజేసిన మాదాల శ్రీరామ్ భాస్కర్**



అమరావతి (చైతన్యరథం): పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్ల కోసం విరాళాలు అందించేందుకు పలువురు దాతలు ముందుకు వస్తున్నారు. గుంటూరుకు చెందిన మాదాల శ్రీరామ్ భాస్కర్ ఉండవల్లిలోని నివాసంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌ను శుక్రవారం కలిసి అన్న క్యాంటీన్లకు రూ.10లక్షల విరాళం అందజేశారు. ఈ మేరకు చెక్‌ను మంత్రి లోకేష్‌కు అందించారు. పేదలకు అన్నం పెట్టే అన్న క్యాంటీన్లకు చేయూత అందించేందుకు ముందుకు వచ్చిన శ్రీరామ్ భాస్కర్‌ను ఈ సందర్భంగా మంత్రి అభినందించారు.

## రేపటి నుంచి
# మంగళగిరి ప్రీమియర్ లీగ్

- ప్రైడ్ ఆఫ్ మంగళగిరి పేరుతో రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు
- మంత్రి లోకేష్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని టోర్నీ నిర్వహణ
- నియోజకవర్గ చరిత్రలో లేని విధంగా నవులూరు క్రికెట్ స్టేడియంలో భారీస్థాయిలో పోటీలు
- విజేతలకు రూ.3, రూ.2, రూ లక్ష నగదు బహుమతులు ప్రదానం
- మ్యాన్ ఆఫ్ ది సిరీస్, బెస్ట్ బ్యాట్స్‌మెన్, బెస్ట్ బౌలర్, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌కు నగదు బహుమతులు
- మంత్రి లోకేష్ సహకారంతో ప్రతి ఏటా క్రికెట్ టోర్నమెంట్




మంగళగిరి (చైతన్యరథం): రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రైడ్ ఆఫ్ మంగళగిరి పేరుతో ఈ నెల 12వ తేదీ నుంచి 23 వరకు మంగళగిరిలో ప్రీమియర్ లీగ్, సీజన్-3 రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్ జరగనుంది. మంగళగిరి నియోజకవర్గంలో ప్రతి సంవత్సరం జనవరి నెలలో మంత్రి లోకేష్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన సహకారంతో క్రికెట్ టోర్నమెంట్ పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు. ఈ సారి నవులూరులోని అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ప్రీమియర్ లీగ్ పోటీలు జరగనున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఉమ్మడి జిల్లాల నుంచి 13 టీమ్‌లు, మంగళగిరి నియోజకవర్గం నుండి ఒక జట్టు ప్రీమియర్ లీగ్, సీజన్ -3 పోటీలలో పాల్గొంటున్నాయి. ఇప్పటికే టోర్నమెంట్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లను నిర్వాహకులు పూర్తి చేశారు. ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు మ్యాచ్‌లు నిర్వహిస్తున్నారు. మంగళగిరి నియోజకవర్గ యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసి వారిని రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహించేందుకు మంత్రి నారా లోకేష్ తన సొంత ఖర్చులతో వివిధ రకాల పోటీలు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గ క్రీడాకారుల కోసం ఇప్పటికే తాడేపల్లి, మంగళగిరిలో రెండు క్రీడా మైదానాలను కూడా ఆయన ఏర్పాటు చేశారు. ప్రీమియర్ లీగ్, సీజన్-3 పోటీలలో ప్రథమ బహుమతి కింద రూ. 3 లక్షలు, ద్వితీయ బహుమతి కింద రూ. 2 లక్షలు, తృతీయ బహుమతి కింద రూ. లక్ష నగదు బహుమతులు ప్రదానం చేయనున్నారు. అలాగే మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డు కింద రూ. 50 వేలు, బెస్ట్ బ్యాట్స్‌మెన్‌కు రూ. 25 వేలు, బెస్ట్ బౌలర్‌కు రూ. 25 వేలు, ప్రతి మ్యాచ్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు కింద రూ.10 వేల నగదు బహుమతులు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## తిరుపతి తరహా ఘటనలు పునరావృతం కాకుండా..

# ఉమ్మడి ప్రణాళికతో పటిష్ట చర్యలు

- మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి వెల్లడి
- తిరుపతి తొక్కిసలాటపై సీఎం చంద్రబాబు సత్వర చర్యలు
- బాధిత కుటుంబాలకు అన్ని విధాల అండగా నిలిచారు
- సీఎం ఆదేశాలతో క్షతగాత్రులందరికీ శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనం
- ఘటనకు బాధ్యులపై ఇప్పటికే చర్యలు
- పూర్తిస్థాయి విచారణకు మంత్రివర్గ ఉపసంఘం



నెల్లూరు (చైతన్యరథం): భవిష్యత్‌లో తిరుపతి తరహా ఘటనలు జరగకుండా టీటీడీ, దేవాదాయశాఖ, అధికార యంత్రాంగం ఉమ్మడి ప్రణాళికతో పటిష్ట చర్యలు తీసుకుంటామని రాష్ట్ర దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం నెల్లూరు నగరంలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ తిరుమలలో ముక్కోటి ద్వార దర్శన ఏర్పాట్లలో భాగంగా తిరుపతిలో టోకెన్ల కేటాయింపు క్యూలైన్ వద్ద తొక్కిసలాట జరిగి ఆరుగురు భక్తులు దుర్మరణం చెందడం దేశ ప్రధాని మొదలు అందరినీ కలచివేసిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ బాధిత కుటుంబాలను, క్షతగాత్రులను పరామర్శించి, ఓదార్చి ఆ కుటుంబాలకు అండగా నిలిచారని చెప్పారు. ముక్కోటి ద్వారదర్శన క్రమంలో ఈ దుర్ఘటన జరగడం చాలా బాధాకరమన్నారు. దుర్ఘటన విషయం తెలిసిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ బాధితులకు అండగా నిలిచేందుకు తనను, హోంమంత్రి అనిత, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను ప్రత్యేకంగా పంపించి, పరిస్థితులు చక్కదిద్దామని ఆదేశించారన్నారు. అనంతరం సంఘటనా స్థలాన్ని పరిశీలించిన సీఎం కారణాలను ఆరాతీసి బాధ్యులైన ఐఎఎస్, ఐపిఎస్ స్థాయి అధికారులను బదిలీ చేసి, డీఎస్పీ, టీటీడీ డైరెక్టర్ స్థాయి అధికారిని సస్పెండ్ చేసినట్లు చెప్పారు. బాధితులను ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రులు పరామర్శించి ఆ కుటుంబాలకు ధైర్యం చెప్పారని, క్షతగాత్రులను పరిశీలించి వారు సత్వరం కోలుకునేలా మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులను ఆదేశించినట్లు చెప్పారు. తొక్కిసలాటలో 35మంది గాయపడగా, సుమారు ఒకటిన్నర గంట పాటు సీఎం చంద్రబాబు క్షతగాత్రులను పరిశీలించి వారి ఆరోగ్యపరిస్థితి, యోగక్షేమాలు తెలుసుకుని పరామర్శించినట్లు చెప్పారు. దుర్మరణం చెందిన ఆరుగురు కుటుంబ సభ్యులకు ఒక్కొక్క కుటుంబానికి రూ.25 లక్షలు, తీవ్రగాయాలైన వారికి రూ.5 లక్షలు, స్వల్పగాయాలైన వారికి రూ.2 లక్షల చొప్పున ప్రభుత్వ సాయంగా అందించినట్లు చెప్పారు. ఆరు మృతదేహాలకు పోస్టుమార్టం జరిపించి వారి స్వస్థలాలకు పంపినట్లు చెప్పారు. వీరిలో నలుగురు మన రాష్ట్రానికి చెందినవారు కాగా ఒకర కేరళ, మరొకరు తమిళనాడు రాష్ట్రానికి చెందినవారుగా మంత్రి చెప్పారు. తిరుపతి విష్ణునివాసం వద్ద ఏర్పాటు చేసిన క్యూలైన్ వద్ద షుగర్ లెవల్స్ తగ్గి ఓ మహిళ కళ్లు తిరిగి పడిపోవడంతో ఆమెను బయటకు తీసుకువెళ్లే క్రమంలో గేటు తెరవడంతో టోకెన్లు ఇస్తున్నారని భావించిన భక్తులు తోసుకోవడంతో తొక్కిసలాట జరిగిందన్నారు. ఆ మహిళను బయటకు తీసుకెళ్లే క్రమంలో ఒకవైపు తెరవాల్సిన గేటు..మరోవైపునకు తెరవడంతో ఈ తొక్కిసలాట జరిగిందన్నారు. తిరుపతిలో తొమ్మిది కేంద్రాల్లో 90 కౌంటర్లు ద్వారదర్శన టోకెన్ల కేటాయింపు కోసం ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

### విచారణకు ఉపసంఘం

తిరుపతి ఘటనపై సంపూర్ణ విచారణకు మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమిస్తూ సీఎం చంద్రబాబు ఆదేశాలిచ్చారని చెప్పారు. విచారణ పూర్తయిన వెంటనే ఇందుకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికార యంత్రాంగం, టీటీడీతో సమీక్షలు నిర్వహించి పటిష్ట చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక కార్యాచరణతో పనిచేస్తామని మంత్రి చెప్పారు.

### క్షతగాత్రులకు వైకుంఠ ద్వారదర్శనం

తిరుపతి తొక్కిసలాట ఘటనలో క్షతగాత్రులకు ప్రత్యేక వైకుంఠ ద్వార దర్శనం కల్పించినట్లు మంత్రి చెప్పారు. క్షతగాత్రులందరూ తమకు తిరుమలలో వైకుంఠ ద్వార దర్శనం చేయించాలని సీఎం చంద్రబాబును కోరారన్నారు. దీనిపై స్పందించిన సీఎం క్షతగాత్రులందరికీ ప్రత్యేక ఏర్పాట్లు చేసి వైకుంఠ ద్వారం ద్వారా ఉత్తర ద్వార దర్శనం చేయించినట్లు చెప్పారు. మొత్తం 52 మందికి దర్శనం చేయించినట్లు చెప్పారు. తమకు మెరుగైన వైద్యం అందించి, వైకుంఠ ద్వార దర్శనం కల్పించిన సీఎం చంద్రబాబుకు బాధితులు కృతజ్ఞతలు తెలిపి సంతృప్తి వ్యక్తం చేసినట్లు మంత్రి చెప్పారు.

### హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నాం

రాష్ట్రంలో తమ ప్రభుత్వం ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తుందన్న మంత్రి, దేవాదాయశాఖలో అనేక హామీలు నెరవేర్చినట్లు చెప్పారు. ప్రధానంగా గతంలో ధూపదీప నైవేద్యాలకు రూ.5వేలు ఇస్తుండగా 5,400 ఆలయాల్లో ఒక్కొక్క ఆలయానికి ప్రస్తుతం రూ.10వేలు ఇస్తున్నామని, అర్చకులకు గతంలో రూ.10వేలు వేతనం ఇస్తుండగా తమ ప్రభుత్వం రూ.15వేలు ఇస్తోందని, వేద విద్యార్థులకు రూ.3వేలు సంభావన అందించి వేదవిద్యను ప్రోత్సహిస్తున్నట్లు మంత్రి చెప్పారు. ఆలయాల్లో ఖాళీగా ఉన్న వేదపండితుల పోస్టులను వేదం చదువుకున్న విద్యార్థులతో భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని 1,492 ఆలయాలకు త్వరలోనే పాలక మండళ్లను నియమిస్తామని, ఇందులో నాయీ బ్రాహ్మణ, బ్రాహ్మణ వర్గాల నుంచి ఒక్కొక్కరికి స్థానం కల్పించనున్నట్లు చెప్పారు. వేదాలు, ఆగమ శాస్త్రాలను తూచా తప్పకుండా పాటిస్తూ సనాతన హిందూ ధర్మ పరిరక్షణకు, భక్తులకు భగవదానుగ్రహం కల్పించేందుకు తమ ప్రభుత్వం దృఢ సంకల్పంతో పనిచేస్తుందని మంత్రి చెప్పారు.

# పరామర్శ పేరుతో జగన్ దుష్టచతుష్టయ యాత్ర

- చంద్రబాబును తిట్టాలని క్షతగాత్రులపై ఒత్తిడి
- ముందుగానే ఆసుపత్రిలో డబ్బుల కవర్లు ఇచ్చారు
- స్విమ్స్ సీసీ కెమెరాల్లో దృశ్యాలు రికార్డు
- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

నెల్లూరు (చైతన్యరథం): పరామర్శ పేరుతో జగన్ దుష్టచతుష్టయ యాత్ర సాగించాడని దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి విమర్శించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తిరుమల దేవస్థానాన్ని భ్రష్టుపట్టించిన ఆ నలుగురే జగన్‌తో ఉన్నారు.. జగన్ అసుపత్రికి వెళ్లేసరికి ఆసుపత్రిలో 18 మంది వరకు ఉన్నారు. జగన్ వెంట ఉన్న దుష్ట చతుష్టయంలోని ఒకరు జగన్ కంటే ముందు ఆసుపత్రి లోపలికి వెళ్లారు..ఆసుపత్రిలో క్షతగాత్రులకు డబ్బుల కవర్లు ఇచ్చి చంద్రబాబుకు వ్యతిరేకంగా జగన్ దగ్గర మాట్లాడమని చెప్పారు. టీడీపీకి, చంద్రబాబుకు వ్యతిరేకంగా చెప్పాలంటూ క్షతగాత్రులకు డబ్బుల కవర్లు ఇచ్చారు..అలా చేయడం వైసీపీ నేతలకు సిగ్గు అనిపించడం లేదా అని మంత్రి దుమ్మెత్తి పోశారు. ఐదేళ్లు పాలన చేసిన మీరు పరామర్శకు వెళ్లి ప్రభుత్వంపై, సీఎంపై ఆరోపణలు చేయమని డబ్బుల కవర్లు ఇచ్చి వస్తారా? మీ దుష్ట చతుష్టయంలో ఒక సభ్యుడు ఈ పని చేశాడు.. ఇంకా ఆ దుష్ట చతుష్టయాన్ని పెట్టుకుని జగన్ ఊరేగుతున్నాడు..ఆసుపత్రిలో ఉన్న సీసీ కెమెరాల్లో వైసీపీ నేతలు ఇచ్చిన తెల్ల కవర్ల దృశ్యాలు రికార్డు అయ్యాయి..కవర్లు ఇచ్చి ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా మాట్లాడమని చెప్పిన విషయాన్ని అక్కడ ఉన్న డాక్టర్లు, సిబ్బంది కూడా గుర్తించారు. ఏం జీవితాలు అయ్యా మీవి.. ఈ మానవ సమాజంలో ఉండదగిన వాళ్లా మీరు.. అని మంత్రి ఆనం ధ్వజమెత్తారు. మృగాల మధ్య ఉండాల్సిన మీరు ఇవాళ రాష్ట్ర ప్రజల కర్మగాలి సమాజంలో తిరుగుతున్నారు. ఓ పక్క చనిపోయిన వాళ్లు..మరో పక్క క్షతగాత్రులు ఉంటే ఆ శవాల మధ్య పేలాలు ఏరుకుంటున్నారని మండిపడ్డారు. పరామర్శకు వెళ్లిన జగన్ తిరుమల నెయ్యి గురించి మాట్లాడారు..గత ఐదేళ్ల పాలనలో అన్ని దేవాలయాల్లో తక్కువ నాణ్యతతో నాసిరకం సరుకులు వాడి ప్రసాదాలను అపవిత్రం చేశారు.. నెయ్యి కల్తీ విషయాన్ని బయటపెట్టిందే మా ప్రభుత్వం.. దీనిపై జగన్ ఏం మాట్లాడుతాడు? ప్రసాదాలు, అన్న ప్రసాదాలు నాణ్యత ఎంత మెరుగుపరిచామో భక్తులను అడిగి జగన్ తెలుసుకోవాలని హితవు పలికారు. భక్తుల మనోభావాలు కాపాడతాం..వారికి తిరుమల శ్రీవారిని చేరువ చేస్తామని మంత్రి ఆనం తెలిపారు.



# నౌకా నిర్మాణ కేంద్రంగా ఆంధ్రప్రదేశ్

- పరిశ్రమ అభివృద్ధికి అవకాశాలపై కీలక సమావేశం
- కేంద్ర విజన్ 2047కు అనుగుణంగా సాగిన చర్చలు
- దేశాన్ని మొదటి ఐదు స్థానాల్లో నిలపడమే లక్ష్యం
- పాల్గొన్న గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్స్ సంస్థ ప్రతినిధులు
- అవసరమైన సౌకర్యాలకు ఏపీ మారిటైమ్ బోర్డు హామీ
- రాష్ట్రాన్ని గ్లోబల్ షిప్ బిల్డింగ్ హబ్‌గా మార్చేలా అడుగులు



అమరావతి(చైతన్యరథం): ఏపీని నౌకానిర్మాణంలో అగ్రగామిగా నిలబెట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కట్టుబడి ఉన్నారు. 1053 కి.మీ తీరప్రాంతం, అభివృద్ధి చెందిన ఓడరేవు నెట్‌వర్క్, వ్యూహాత్మక స్థానాలతో రాష్ట్రం ప్రపంచ నౌకానిర్మాణ గమ్య స్థానంగా మారడానికి అపారమైన సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఇందులో భాగంగా రాష్ట్రంలో అత్యాధునిక నౌకా నిర్మాణ పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు ఉన్న అవకాశాలపై చర్చించేందుకు మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల కార్యదర్శి ఎస్‌సురేష్‌కుమార్ అమ రావతి సచివాలయంలో శు క్రవారం కీలక సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ మారిటైమ్ విజన్ 2047కి అనుగుణంగా సమావేశంలో చర్చలు జరిగాయి. ప్రపంచంలోని మొదటి ఐదు నౌకా నిర్మాణ దేశాలలో భారతదేశాన్ని ఉంచాలని లక్ష్యంగా పెట్టు కుంది. ఈ దార్శనికతను వేగవంతం చేయడానికి ఏపీ మారిటైమ్ బోర్డ్ ఇటీవల రాష్ట్రం లో నౌకానిర్మాణ పెట్టుబడుల కోసం ఆసక్తి వ్యక్తీకరణ (ఈవోఐ) ద్వారా ప్రతిపాదనలను ఆహ్వానించింది. మారిటైమ్ బోర్డ్ బృందం ఈ ఆసక్తి వ్యక్తీకరణ ద్వారా ప్రపంచంలోని ప్రముఖ షిప్ బిల్డర్‌లను సంప్రదించింది. ఆ మార్కెట్‌లో చాలామంది దృష్టిని ఆకర్షిం చింది. హ్యుందాయ్ హెవీ ఇండస్ట్రీస్, కొరియన్ షిప్ బిల్డర్లు గతంలో ఏపీ మారిటైమ్ బోర్డుతో నిమగ్నమై ఉండటమే కాకుండా రాష్ట్రంలో అవకాశాలు, ఉన్న వనరులు, సామ ర్థ్యంపై బలమైన ఆసక్తిని కనబరిచారు. వారి సైట్ సందర్శ నలు, చర్చలు షిప్ యార్డ్ అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్‌ను మంచి గమ్యస్థానంగా హైలైట్ చేశాయి. అంతే కాకుండా దేశంలో ప్రముఖ నౌకానిర్మాణ సంస్థ గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్స్ ఇంజనీర్స్‌తో సహకార అవకాశాలను అన్వేషించడంపై సమావేశం దృష్టి సారించింది. ఆ సంస్థ ప్రతినిధులు ఏపీ మారిటైమ్ బోర్డుతో ఉత్పాదక చర్చలు జరపడమే కాకుండా నౌకా నిర్మాణానికి కావాల్సిన సౌకర్యాలు కల్పించడా నికి సంభావ్య సైట్‌లను కూడా సందర్శించారు.

### సమావేశంలో ముఖ్యాంశాలు

గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్స్ ప్రతినిధులు రాష్ట్రంలో మౌలిక సదుపాయాలు, తీరప్రాంత వనరులపై సంతృప్తి వ్యక్తం చేశారు. నౌకానిర్మాణం, సముద్ర అనుబంధ పరిశ్రమల సమూహాన్ని అభివృద్ధి చేయడం ద్వారా భారతదేశం యొక్క మారిటైమ్ విజన్ 2047ను సాధించడానికి రాష్ట్రం ఎలా దోహదపడుతుంది అన్న దానిపై చర్చలు జరిగాయి. పెట్టు బడులను ప్రోత్సహించడానికి ప్రోత్సాహకాలు, క్రమబద్ధీకరించిన ఆమోదాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధితో సహా పూర్తి సహకారానికి ఏపీఎంబీ వారికి హామీ ఇచ్చింది.

### తదుపరి లక్ష్యం ఏమిటి?

ఈ విజన్‌ను రూపొందించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉంది. జీఆర్ఎస్ఈతో ఈ సమావేశం హ్యుందాయ్, కొరియన్ షిప్ బిల్డర్లు సృష్టించిన సానుకూ ల వేగాన్ని జోడించి మరో అడుగు ముందుకు వేస్తుంది. ఏపీఎంబీ పరిశ్రమ ప్రతినిధుల తో పరస్పర చర్చ కొనసాగిస్తుంది. అంతేకాకుండా బలమైన నౌకానిర్మాణ పర్యావరణ వ్యవస్థను అభివృద్ధి చేయడానికి ప్రణాళికలను ఖరారు చేస్తుంది. ఏపీ ప్రపంచ నౌకా నిర్మాణ కేంద్రంగా మారడానికి అనుగుణంగా సిద్ధం చేస్తుంది. ఉద్యోగాలను సృష్టించ డం, ఆర్థిక వృద్ధిని పెంచడం ద్వారా భారతదేశ సముద్ర భవిష్యత్తుకు దోహదపడేలా చర్య లు తీసుకుంటుంది.

---

భవన నిర్మాణాలు, లే అవుట్ల అనుమతులకు

## నిబంధనలు సులభతరం



- సడలింపులతో జీవోలు జారీ
- రియల్ ఎస్టేట్ పుంజుకుంటుంది: మంత్రి నారాయణ

అమరావతి (చైతన్యరథం): భవన నిర్మాణాలు, లేఅవుట్ల అనుమతులకు సంబంధించి నిబంధనలను సులభతరం చేస్తూ ఏపీ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ బిల్డింగ్ రూల్స్ -2017, ఏపీ ల్యాండ్ డెవలప్‌మెంట్ రూల్స్ – 2017లో సవరణలు చేస్తూ వేర్వేరుగా ప్రభుత్వం జీవోలు జారీ చేసింది. ఇందుకు సంబంధించి మంత్రి నారాయణ కీలక ప్రకటన చేశారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా భవన, లే అవుట్ల అనుమతుల్లో మార్పులు తీసుకువచ్చామని అన్నారు. ఏపీలో రియల్ ఎస్టేట్ రంగం ఊపందుకునేలా కీలక సంస్కరణలతో ఉత్తర్వులు జారీ చేశామని మంత్రి నారాయణ తెలిపారు.

సంక్రాంతి కానుకగా బిల్డర్లు, డెవలపర్లు, ప్రజలకు అనుకూలంగా ఉండేలా నిబంధనల్లో మార్పులు చేస్తూ జీవోలు జారీ చేశామన్నారు. లే అవుట్లలో రోడ్లకు గతంలో ఉన్న 12 మీటర్లకు బదులు 9 మీటర్లకు కుదిస్తూ సవరణ చేశామని చెప్పారు. 500 చ.మీ. పైబడిన స్థలాలు, నిర్మాణాల్లో సెల్లార్‌కు అనుమతి ఇస్తూ నిర్ణయం తీసుకున్నామని అన్నారు. టీడీఆర్ బాండ్ల జారీ కమిటీలో రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్‌లను తొలగిస్తూ జీవో జారీ చేశామని తెలిపారు. రాష్ట్ర, జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న స్థలాలు డెవలప్ చేసేందుకు 12 మీటర్ల సర్వీస్ రోడ్డు ఏర్పాటు నిబంధన తొలగించినట్లు చెప్పారు.

బహుళ అంతస్తుల భవనాల సెట్ బ్యాక్ నిబంధనల్లో కూడా మార్పులు చేశామన్నారు. వీటితో పాటు మరిన్ని నిబంధనలు సులభతరం చేస్తూ ఉత్తర్వులు జారీ చేశామని తెలిపారు. రియల్ ఎస్టేట్ అసోసియేషన్ల ప్రతినిధులతో చర్చించి తుది నిబంధనలు జారీ చేసినట్లు వివరించారు.

తాజా ఉత్తర్వులతో రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం వేగం పుంజుకోనుందని మంత్రి నారాయణ ఆశాభావం వ్యక్తం చేశారు.

---

## శవరాజకీయాలు జగన్‌కు అలవాటే

- మంత్రి సవిత మండిపాటు



కర్నూలు (చైతన్యరథం): గడిచిన ఐదేళ్లలో రాష్ట్రంలో జరిగిన ఎన్నో హింసాత్మక ఘటనల్లో జగనే మొదటి ముద్దాయి అని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత అన్నారు. శుక్రవారం కర్నూలుకు వచ్చిన మంత్రి స్థానిక స్టేట్ గెస్ట్‌హౌస్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎంపీ నాగరాజుతో కలిసి మాట్లాడారు. తిరుపతిలో చోటుచేసుకున్న తొక్కిసలాట ఘటన చాలా దురదృష్టకరమన్నారు. ప్రమాదం విషయం తెలుసుకున్న వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, అనిత, అనగాని సత్యప్రసాద్‌తో పాటు పలువురు మంత్రులు ఘటనా స్థలానికి వెళ్లారన్నారు. బాధిత కుటుంబాలతో మాట్లాడి, అండగా నిలిచారన్నారు. ఇప్పటికే తొక్కిసలాటకు బాధ్యులుగా గుర్తించిన కొందరు అధికారులపై తమ ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున్న నష్టపరిహారంతో పాటు కుటుంబంలో ఒకరికి కాంట్రాక్టు ఉద్యోగం కూడా ఇవ్వనున్నామన్నారు. తీవ్రంగా గాయపడినవారికి రూ.5 లక్షలు, స్వల్పగాయాలైన వారికి రూ.2 లక్షలు అందించడంతో పాటు మొత్తం వైద్యం ప్రభుత్వమే భరిస్తుందని మంత్రి తెలిపారు. ప్రజల్లో కష్టాల్లో ఉన్నప్పుడు వారి వెంటే ఉంటూ, అన్ని విధాలా అండగా నిలుస్తూ.. సీఎం చంద్రబాబునాయుడు భరోసా ఇస్తుంటారన్నారు. విజయవాడలో కృష్ణానదికి వరదలు వచ్చిన సమయంలో బాధితులు కోలుకునే వరకు అక్కడి కలెక్టర్ కార్యాలయంలో ఓ బస్సులో పది రోజులపైగా సీఎం చంద్రబాబు బస చేసిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు.

దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా..

తిరుపతిలో జరిగిన ఘటనపై రాష్ట్ర ప్రజలంతా తల్లడిల్లుతుంటే జగన్ మాత్రం శవ రాజకీయాలకు పాల్పడుతున్నారని మంత్రి సవిత మండిపడ్డారు. జగన్ అసమర్థ పాలనలో అన్నమయ్య డ్యామ్ కొట్టుకుపోయిన సందర్భంలో 30 మందికి పైగా అమాయకులు బలయ్యారన్నారు. వందల ఎకరాలు పంట నీటి మునిగాయన్నారు. గొర్రెలు, మేకలు, పశువులు వరదలో కొట్టుకుపోయి, రైతులకు ఎంతో నష్టాన్ని మిగిల్చాయన్నారు. ఆ దుర్ఘటన సమయంలో బాధితులను జగన్ కనీసం పరామర్శించలేదని, బాధిత కుటుంబాలను పట్టించుకోలేదని మండిపడ్డారు. దెయ్యాలు వేదాలు వల్లించినట్లు తిరుపతి ఘటనపై జగన్ మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. బాబాయ్‌కి గొడ్డలి పోటు, కోడికత్తి, గులకరాయి ఘటనలతో రాజకీయాలు జగన్ అలవాటైందన్నారు. సీఎం చంద్రబాబు గురించి మాట్లాడే అర్హత జగన్‌కు లేదని మంత్రి స్పష్టం చేశారు. గడిచిన ఐదేళ్లలో ఎన్నో హింసాత్మక ఘటనలు రాష్ట్రంలో చోటుచేసుకున్నాయని, వాటన్నింటికీ జగనే మొదటి ముద్దాయి అని అన్నారు. జగన్, ఆయన పార్టీ నేతలు శవ రాజకీయాలు పక్కనబెట్టి, బాధితులకు సాయం చేయాలని హితవు పలికారు.

### అభివృద్ధిని చూసి ఓర్వలేకే...

రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధిని సీఎం చంద్రబాబునాయుడు పరుగులు పెట్టిస్తున్నారని మంత్రి సవిత తెలిపారు. రాజధాని అమరావతి, పోలవరం నిర్మాణ పనులకు పున:ప్రారంభమయ్యాయన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని తెలిపారు. ఇది ఓర్వలేకే సీఎం చంద్రబాబుపైనా, తమ ప్రభుత్వంపైనా వైసీపీ నాయకులు, జగన్ అవాకులు చవాకులు పేలుతున్నారన్నారు. 6 నెలలో కాలంలో తిరుమల తిరుపతి దేవస్థానంలో ఎన్నో మార్పులు చేపట్టామన్నారు. రాష్ట్ర మంతటా అన్ని ప్రాంతాల్లోనూ పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాజధాని సహా అన్ని ప్రాంతాలను అభివద్ధి చేయనున్నామన్నారు. కర్నూలులో మూతపడిన రెండు బీసీ హాస్టళ్ల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామని మంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కురుబ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప సహా పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వివిధ సమస్యలపై తరలివచ్చిన అర్జీదారులు

## - వినతులు స్వీకరించిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల

అమరావతి (చైతన్యరథం): వివిధ సమస్యలపై వచ్చిన అర్జీదారులతో మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం కిటకిటలాడింది. శుక్రవారం నిర్వహించిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణలు అర్జీ దారుల నుండి వినతులు స్వీకరించి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. పలువురు నిరుద్యోగులు ఉద్యోగాలు కల్పించాలంటూ అర్జీలు ఇచ్చి అభ్యర్థించగా... ఆరోగ్య సమస్యలపై ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలంటూ మరికొందరు వేడుకున్నారు. అలాగే భూ సమస్యలపై బాధితులు అర్జీలు ఇచ్చి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.



తన మామ మరణించడంతో ఆ ఇంటిని మరొకరు ఆక్రమించుకొని అనుభవిస్తున్నారని.. ఇల్లు ఆక్రమించుకున్న చిల్కా ఆదాము, జయపాల్ ను ఇళ్లు ఖాళీ చేయించి తనకు ఇల్లు దక్కేలా చూడాలని గుంటూరు జిల్లా వట్టి చెరుకూరు మండలం కొర్నెపాడుకు చెందిన చిల్కా సత్యప్రేమ లీల విజ్ఞప్తి చేశారు.

అన్నమయ్య జిల్లా కేవీపల్లి మండలం గ్యారంపల్లికస్పా గ్రామానికి చెందిన ఎమ్. శ్రీనివాసులు విజ్ఞప్తి చేస్తూ.. తన తండ్రి వీఆర్‌ఏగా పనిచేస్తూ మరణించడంతో ఆ ఉద్యోగం తన చెల్లికి ఇచ్చారని.. తమ కుటుంబం టీడీపీ వైపు ఉందనే కారణంతో.. తన చెల్లి వీఆర్‌ఏ ఉద్యోగాన్ని గత ప్రభుత్వంలో తొలగించారని ఆవేదన వ్యక్తం చేశాడు. అంతే కాకుండా తిరుమలలో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న తన ఉద్యోగం కూడా తొలగించి ఇబ్బంది పెట్టారని.. తమ కుటుంబం ఇబ్బందుల్లో ఉందని దయ చేసి తన చెల్లికి తొలగించిన వీఆర్‌ఏ ఉద్యోగాన్ని తిరిగి పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశాడు.

కర్నూలు జిల్లా కౌతాళం మండలం హల్వి గ్రామానికి చెందిన ముదుకప్ప విజ్ఞప్తి చేస్తూ.. తాత ముత్తాతల నుండి తమస్వాధీనంలో ఉన్న భూమిని అధికారులు ఆన్ లైన్ చేయమంటే చేయకుండా ఇబ్బంది పెడుతున్నారని.. దయ చేసి తమ భూమిని ఆన్‌లైన్ చేసి తమ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

గత నాలుగేళ్లుగా పాఠశాల విద్యలో ఉపాధ్యాయుల అంతరజిల్లా బదిలీలు కాకపోవడంతో సంవత్సరాల తరబడి కుటుంబాలకు దూరంగా ఉండాల్సి వస్తోందని.. దయ చేసి సొంత జిల్లాలకు బదిలీ చేసి కుటుంబాలకు దగ్గర ఉండేలా ప్రభుత్వం అవకాశం కల్పించాలని పలువురు ఉపాధ్యాయులు గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేశారు.

కడప జిల్లా డీఈఓ మీనాక్షి అసంబద్ధ, అనుచిత వైఖరితో ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని.. ఆమె వైఖరిపై విచారించి చర్యలు తీసుకోవాలని కడప జిల్లా ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక సభ్యులు గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేశారు.

తనకు తన తాత నుండి వారసత్వంగా వచ్చిన భూమిని పక్కన ఉండే చావలి శివ, రామరాజులు ఆక్రమించుకోవాలని చూస్తూ, తనను ఇబ్బంది పెడుతున్నారని.. సర్వేయర్‌తో తన భూమిని సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేసి ఇబ్బంది లేకుండా చూడాలని ఎన్టీఆర్ జిల్లా కె.వి కండ్రికకు చెందిన కందుల శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశాడు.

తన ఇంటి స్థలంలో ఉన్న కంరెట్ స్తంభాన్ని తొలగించి నిరుపేదైన తనకు ఇల్లు కట్టుకోవడానికి అవకాశం కల్పించాలని కడప జిల్లా చక్రాయపేట మండలం కె.రాజుపల్లె గ్రామానికి చెందిన బొమ్మేపల్లి కృష్ణయ్య విజ్ఞప్తి చేశాడు.







# జగన్ గ్యాంగ్‌తో తిరుమల అపవిత్రం

- టీటీడీని ఏటీఎంలా మార్చుకుని దోచుకు తిన్నారు
- అవినీతి అనకొండ రోజా నీ బాగోతం ఎరుకే
- పరామర్శ పేరుతో మీ డ్రామాలు ప్రజలకు తెలుసు
- శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ

మంగళగిరి(చైతన్యరథం): తిరుమలను ఆదాయ వనరుగా మార్చుకుని, కలియుగ దైవాన్ని కూడా దోచేసిన వైసీపీ నటి, అవినీతి అనకొండ రోజారెడ్డి కూడా తిరుమల పవిత్రత గురించి మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉందని ఎమ్మెల్సీ, శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ ధ్వజమెత్తారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఉత్తరాంధ్ర అభివృద్ధికి కూట మి ప్రభుత్వం తెచ్చిన రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులకు ప్రధానితో శంకుస్థాపన సమయంలోనే అధికారుల నిర్లక్ష్యంతో తిరుపతిలో దురదృష్టకర సంఘటన జరగటం బాధాకరమన్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించి ఘటనకు బాధ్యులైన ఇద్దరు అధికారులను సస్పెండ్ చేసి ముగ్గురు అధికారులపై బదిలీ వేటు వేయటం జరిగిందన్నారు. చనిపోయిన వారికి రూ.25 లక్షల ఎక్సగ్రేషియా, గాయపడిన వారికి రూ.5 లక్షల పరిహారం ప్రకటించారని తెలిపారు. 31 క్రిమినల్ కేసులతో 16 నెలలు జైల్లో చిప్ప కూడు తిన్న జగన్ ఉత్తరాంధ్రకు ఏం చేశాడో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ప్రజాధనం వృథా చేసి రూ.500 కోట్లతో ప్యాలెస్ కట్టుకున్న జగన్ అండ్ కో కబ్జాల బాగోతం ఉత్తరాంధ్ర ప్రజలందరికీ తెలుసునని దుయ్యబట్టారు. జగన్, ఆయన అనుచ రులు ముఖ్యంగా రోజా డ్రామాలు ఆడేందుకు పరామర్శ నెపంతో ప్రజలను ఇబ్బంది పెట్టడానికి వెళ్లారా? అని ప్రశ్నించారు. ఉహించని ఘటనపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడు తున్న వైసీపీ నేతలకు, వారి హయాంలో జరిగిన గోదావరి బోటు ప్రమాదం, అన్నమయ్య డ్యామ్ గేటు కొట్టుకుపోవడం, రుయా ఆసుపత్రిలో ఆక్సిజన్ కొరత వంటి నిర్లక్ష్యంతో జరిగిన మరణాలు గుర్తు లేవా? అని ప్రశ్నించారు. ప్రమాదవశాత్తు జరిగిన సంఘటనపై ఇష్టం వచ్చినట్టుగా మాట్లాడుతున్న వైసీపీ నేతలని అసలు మనుషులంటారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ రెడ్డి అండ్ కో చేసినట్టు కూటమి ప్రభుత్వంలో ఎవరు కూడా పవిత్ర తిరుమల ప్రసాదాన్ని రాజకీయ అవసరాలకు వాడలేదు... టికెట్లు అమ్ము కోలేదు.. తిరుమలలో రాజకీయాలు మాట్లాడడం వంటివి చేయలేదని గుర్తుచేశారు. తిరుమల పవిత్రతను అపవిత్రం చేసిన వైసీపీ నేతలు తిరుమల, వేంకటేశ్వర స్వామి, భక్తుల గురించి మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. డిక్లరేషన్ ఇవ్వకుండా తిరుమలలో అహంభావంతో తిరిగిన జగన్‌కు నిజంగా స్వామి మీద భక్తి ఉందా? అని ప్రశ్నించారు. టీటీడీని వైసీపీ నేతలు ఏటీఎం మిషన్‌గా మార్చేశారని విమర్శించారు. వైసీపీ పాలనలో అవినీతిపరులు, నేరచరిత్ర ఉన్న వారితో టీటీడీ బోర్డు నింపారని మండిపడ్డారు. కనకదుర్గమ్మ గుడిలో సింహాలు మాయమైనప్పుడు, అంతర్వేది లో రథం తగలబడినప్పుడు, తిరుమల టికెట్లపై అన్యమత ప్రచారం జరిగినప్పుడు నాడు ముఖ్యమంత్రిగా ఉన్న జగన్ ఒక్క మాట కూడా మాట్లాడలేదని విమర్శించారు. తన అవినీతికి తిరుమలను అడ్డాగా మార్చి టికెట్లను అమ్ముకుని లక్షల్లో సంపాదించారని, వివిధ నగరాల్లో కోట్లలో గెస్ట్ హౌస్‌లు, భూకబ్జాలు, బెల్ట్ షాపుల ద్వారా వందల కోట్లు దోచుకున్నారంటూ రోజా మీద ధ్వజమెత్తారు. గ్రావెల్ దోపిడీ, టూరిజం, విజయపురం కొండ తవ్వకం వంటి దోపిడీతో ప్రజల సొమ్ము దోచుకున్న వైసీపీ నటి రోజారెడ్డి అలి యాస్ శ్రీలతరెడ్డికి చంద్రబాబు గురించి మాట్లాడే అర్హత ఉందా? అని ప్రశ్నించారు. వైసీపీ నేతలు టీటీడీ చైర్మన్‌పై మాట్లాడే ముందు ఆయన గురించి తెలుసుకుని మాట్లా డాలని హితవుపలికారు. బి.ఆర్.నాయుడు తన కుటుంబసభ్యుల గెస్ట్‌హౌస్ ఖర్చులు తనే చెల్లించి ప్రోటోకాల్ వాహనాలు వాడకుండా..కాఫీ, టీ ఖర్చులు సైతం స్వయంగా భరిస్తున్నారన్నారు. కరుణాకర్‌రెడ్డి, వై.వి.సుబ్బారెడ్డి లాగా తిరుమలని దోచుకోవడం లేదని వ్యాఖ్యానించారు. పరామర్శ నెపంతో వెళ్లిన జగన్‌రెడ్డికి ఊహించిన డ్రామా కనిపించక పోవడంతో అసహనంతో డాక్టర్లను తిట్టడం, రోగులను ఇబ్బంది పెట్టడం చేశారంటూ విమర్శించారు. ఇదేనా పరామర్శ అని ప్రశ్నిస్తూ ప్రజలు జగన్ డ్రామాలు గమనిస్తున్నా రని హితవుపలికారు.



# గిరిజన మైనింగ్ ప్రాంతాల్లో వైద్యసేవలకు ఆరోగ్య రథాలు

- కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ స్కీమ్ కింద పేదలకు మెరుగైన వైద్యం
- కోటి రూపాయలతో రెండు వాహనాలు ప్రారంభించిన మంత్రి కొల్లు రవీంద్ర




అమరావతి (చైతన్యరథం): మైనింగ్ అధికంగా జరిగే అరకు, పాడేరు ప్రాంతాల్లోని ప్రజలకు వైద్య సేవలందించడం చాలా సంతోషంగా ఉందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ) ఆధ్వర్యంలో తాడిగడపలోని ఆ సంస్థ కార్యాలయం వద్ద ఆరోగ్య రథం వాహనాలను మంత్రి కొల్లు రవీంద్ర శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ స్కీమ్ కింద పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ఈ వాహనాలు ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. 2017లో ఏపీఎండీసీ ఆధ్వర్యంలో రూ. 17 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు.

మైనింగ్ జరిగే ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సౌకర్యాలు అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలకు అనుగుణంగా ఆరోగ్య రథాలను తీసుకువచ్చామన్నారు. ఇప్పటికే ఏపీఎండీసీ ద్వారా ఆరోగ్య సేవలు, విద్యాలయాలు, ఇతర వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ఇప్పుడు కోటి రూపాయల వ్యయంతో పూర్తి సాంకేతికత కలిగిన రెండు వాహనాలను ప్రజల ముందుకు తీసుకొచ్చామన్నారు.

వీటి ద్వారా ఆరోగ్య సేవలతో పాటు హెల్త్ చెకప్, కార్డియో, రక్త పరీక్షలు, ఈసీజీ, తదితర సేవలు అందిస్తారన్నారు. 2019-24 మధ్య కాలంలో రాష్ట్రంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ స్కీమ్‌ను నాశనం చేసారన్నారు. రాష్ట్రంలోని ఖనిజ వనరులను దోచుకోవడంపై పెట్టిన శ్రద్ధలో కనీసం ఒక వంతైనా ప్రజల ఆరోగ్య పరిరక్షణపై పెట్టిన దాఖలాలు లేవన్నారు. భవిష్యత్తులో ఎక్కడ అవసరం ఉన్నా ఈ సేవలను కొనసాగిస్తామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

తొలుత ఏపీఎండీసీ ఎండీ ప్రవీణ్ కుమార్‌తో కలిసి రెండు ఆరోగ్య రథం వాహనాలను జెండా ఊపి మంత్రి ప్రారంభించారు. అనంతరం బస్సులో కల్పించిన సదుపాయాలను పరిశీలించారు. అందుబాటులో ఉన్న వైద్య సేవల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ వాహనంలో ఒక డాక్టర్, స్టాఫ్ నర్స్, ల్యాబ్ టెక్నీషియన్, డీఈవో, డ్రైవర్, ఫార్మసిస్ట్ ఉంటారు, వీరు ఉదయం నుంచి సాయంత్రం వరకు నెలలో 24 రోజుల పాటు ఆయా గ్రామాల్లో ఆరోగ్య సేవలు ప్రజలకు అందిస్తారు..

# అధికారుల నిర్లక్ష్యం.. ప్రభుత్వానికి అప్రతిష్ట

అధికారుల పనితీరు ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేలా ఉండాలి తప్ప ప్రభుత్వానికి అప్రతిష్ట తెచ్చేలా ఉండకూడదు. ప్రభుత్వాలు వస్తుంటాయి. పోతుంటాయి. నాయకులూ మారుతుంటారు. దశాబ్దాలుగా కీలక శాఖల్లో పనిచేసే అధికారులకు కనీస బాధ్యత ఉంటుంది. తిరుమలకు వైకుంఠ ఏకాదశి నాడు భక్తులు పోటెత్తడం ఆనవాయితీగా వస్తున్నదే. క్యూలైన్లలో కానీ, తిరుమల కొండపైనకానీ, తొక్కిసలాట సంఘటన జరిగిన దాఖలాలు లేవు. క్రౌడ్ మేనేజ్‌మెంట్ విషయంలో టీటీడీ ఉద్యోగులకు అపారమైన అనుభవమున్నది. ఈసారి ఈ పరిస్థితి ఎందుకు తలెత్తింది? ఎవరూ దుర్ఘటన జరగాలను కోరు. కానీ ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవటం, సమన్వయం లేకపోవడం, నిర్లక్ష్యంగా, బాధ్యత లేకుండా వ్యవహరించడం వల్లనే తిరుపతిలో ఆరుగురు భక్తులు మృతిచెందారు. ఇది మాటలకందని విషాదం.

ఈ సంఘటన విని తిరుమలేశుని భక్తులు యావన్మందీ దుఖ సాగరంలో మునిగారు. నిజానికి ఈ దుర్ఘటనకు ఇటు టీటీడీ, అటు పోలీసులూ ఇద్దరూ బాధ్యులే. వైకుంఠ ఏకాదశి ఉత్తర ద్వార దర్శన కౌంటర్లలో అరకొర ఏర్పాట్లతో టీటీడీ అలక్ష్యం ప్రదర్శించగా, డీఎస్పీ దగ్గరుండి భక్తులను సినిమా టిక్కెట్ల కోసం విడిచిపెట్టినట్టు ఒక్కసారిగా కౌంటర్‌లోకి వదిలేయడం తొక్కిసలాటకు దారితీసినట్లు సమాచారం. ఏ పాపం తెలియని అమాయకులైన తిరుమలేశుని భక్తులు వందలు, వేల మైళ్ళ దూరంనుంచి స్వామివారిని దర్శించుకోవాలన్న కాంక్షతో వచ్చి ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరం. వైకుంఠ ఏకాదశినాడు లక్షల సంఖ్యలో జనం తిరుమలకు వస్తారన్న అంచనాలు ఉన్నప్పటికీ దానికై చేపట్టాల్సిన ఏర్పాట్లపై టీటీడీ విఫలమైంది. పెరుగుతున్న సంఖ్యను దృష్టిలో పెట్టుకొని పోలీసు యంత్రాంగం తగిన జాగ్రత్తలు తీసుకొనివుంటే ఈ ఘటన జరిగేది కాదు. భక్తులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్ని ఏర్పాట్లు చేపట్టామని, 3,000మంది పోలీసులు, 1500మంది విజిలెన్స్ సిబ్బందితో ప్రశాంతమైన వాతావరణంలో దర్శన ఏర్పాట్లు చేశామని ఉన్నతాధికారులు, బోర్డు చైర్మన్ ప్రకటించినా కౌంటర్లు దగ్గర భక్తులను నియంత్రించడానికి, క్రమబద్ధీకరించడానికి పోలీసులు పరిమిత సంఖ్యలో ఉండటం ఈ దుస్థితికి కారణం అంటున్నారు.

ఇది ఊహించని పరిణామమేకావచ్చు. కానీ అంచనా వేయలేని పరిస్థితి కాదన్నది అందరూ చెబుతున్నమాట. ఇది ముమ్మాటికీ నివారించదగినదే. అయినా పరిస్థితిని అంచనావేసి నివారించలేక పోయారు. కనీసం, సహాయక చర్యల్లోనైనా నిబద్ధత చూపించక పోవడం ముమ్మాటికీ అధికారుల నిర్లక్ష్యమే. క్షణాల్లో సమాచారం అందించే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అరచేతిలో కనిపిస్తుంటే, అధికారులు కనీసం పోలీసులను అప్రమత్తం చేయలేదు.

కళ్లముందే ఇంతటి దారుణం జరగడానికి అధికారుల నిర్లక్ష్యమే కారణం. భక్తుల అంచనా విషయంలో వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. పోనీ, సహాయక చర్యల్లో భక్తులకు అందుబాటులో లేరని సమాచారం. ఎక్కడెక్కడ జాగ్రత్తలు పాటించాలి? అనే అంశాలు టీటీడీ అధికారులకు క్లియర్‌గా ఉంటాయి. ముఖ్యంగా సంబంధిత శాఖలు మరింత అప్రమత్తంగా ఉండాలి. మరి ఏం జరిగింది? వీళ్ళలో ఎందుకు సమన్వయం లోపించింది? తిరుమలేశుని దర్శనం కోసం గంటల తరబడి భక్తులు వేచి ఉండటం నిత్యకృత్యం. రోజుకు 50నుండి 60 వేలమంది వరకు, పర్వదినాల్లో లెక్కకు మించి భక్తులు దర్శనానికి వస్తుండటంతో వారందరికీ సాఫీగా దర్శనమయ్యేట్టు పాలకమండలి చేస్తున్న ఏర్పాట్లలో ఏవో చిన్న లోపాలు ఉన్నప్పటికీ, అందరికీ దర్శనం దొరుకుతూనే వున్నది. కానీ ఇప్పుడు ఇలా ఎందుకు జరిగింది? జనం విపరీతంగా పెరుగుతున్నా పోలీసుల సంఖ్యను పెంచాలని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్న ఆలోచన టీటీడీ యంత్రాంగానికి రాకపోవడం, తొక్కిసలాట తర్వాత అంబులెన్స్ కోసం అరగంటకు పైగా నిరీక్షించాల్సి వచ్చిందంటే నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో అర్ధమవుతుంది. అదే సందర్భంలో భక్తుల్లో కూడా స్వీయ క్రమశిక్షణ, సంయమనం, ఓర్పు, సహనం ఉండటం అత్యంత అవసరం. ముక్కోటి ఏకాదశి పర్వదినం రోజునే శ్రీవారి దర్శనం చేసుకోవాలన్న సెంటిమెంట్ వల్ల కూడా జనం ప్రవాహంలా వచ్చినట్టు సమాచారం. భవిష్యత్తులో ఇంకెప్పుడూ ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత ముఖ్యంగా అధికారులపై, భక్తులుపై వుంది. ప్రభుత్వం ఎంత సమర్ధవంతంగా, బాధ్యతగా పనిచేసినా, అప్రమత్తంగావున్నా కొందరు అధికారుల నిర్లక్ష్యం కారణంగా, బాధ్యతగా వ్యవహరించని కారణంగా కూటమి ప్రభుత్వం అప్రతిష్ట పాలు కావాల్సిన పరిష్టితి ఏర్పడింది. రాష్ట్ర ప్రభుత్వం దుర్ఘటనకు బాధ్యులపట్ల కఠినంగా వ్యవహరించింది. భవిష్యత్తులో ఇటువంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా వ్యవహరిస్తామని హామీ ఇవ్వడం హర్షణీయం.

తిరుపతిలో తొక్కిసలాట ఘటన టీటీడీ పరువు ప్రతిష్ఠలను దిగజార్చిందని, ఇందుకు చంద్రబాబు ప్రభుత్వమే ప్రధాన కారణమని మాజీ సీఎం జగన్ ఆరోపించడం ఆయన శవరాజకీయాలకు నిదర్శనం. అతను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అనేక సంఘటనలు జరిగి అనేకమంది చనిపోయారు. మరి అప్పుడు జగన్ ఏనాడైనా పరామర్శకు వెళ్లారా? ఆయన సీఎంగా ఉండగా తిరుపతి రుయా ఆస్పత్రిలో ఆక్సిజన్ అందక 21మంది చనిపోతే చూడటానికి వెళ్లారా? అన్నమయ్య ప్రాజెక్టు గేటు కొట్టుకుపోయి 33మంది చనిపోతే పరామర్శకు వెళ్లారా? గోదావరిలో కచ్చులూరు వద్ద బోటు ప్రమాదంలో 39మంది చనిపోతే కన్నెత్తి చూశారా? అధికారంలో ఉన్నప్పుడు ఆ ఘటనలు కనిపించలేదా? ఆరోజు వారివి ప్రాణాలు కావా? ఇప్పుడు శవాలు కనపడగానే పరుగెత్తుకొచ్చి శవరాజకీయాలు చేస్తున్నారు. కలియుగ వైకుంఠం-తిరుమలను పక్కా వ్యాపార కేంద్రంగా, స్వార్ధ రాజకీయాలకు కూడలిగా మార్చింది జగన్ ప్రభుత్వమే. పదవిలో ఉన్నన్నాళ్లూ స్వప్రయోజనాలకోసం వెంపర్లాడి ఆంధ్రప్రదేశ్‌ను ఛిద్రంచేసిన జగన్‌రెడ్డి పెడపాలనలో-తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతిష్ఠ సైతం పూర్తిగా మసకబారింది. తిరుమల పవిత్రధామాన్ని కాసులవేటకు వేదికగా మార్చారు. మందీ మార్బలాన్ని వెంటేసుకుని ఎప్పుడంటే అప్పుడు దర్శనానికి వెళ్తూ సామాన్య భక్తులకేమో నరకం చూపించారు.

వ్యాపార, ఆర్థిక, రాజకీయ అవసరాలను తీర్చుకునేందుకు తిరుమలను వాడుకున్న జగన్ క్షమార్హంకాని ఘోరాపరాధాలు ఎన్నింటికో పాల్పడ్డారు. శ్రీనివాసుడి పట్ల తరగని భక్తి ప్రపత్తులతో ఆబాలగోపాలం సమర్పించిన కానుకల సొమ్మును జగన్ వందిమాగదులు విచ్చలవిడిగా ఖర్చుపెట్టారు. జగన్ ఏలుబడిలో అపవిత్రమైన తిరుమలకు మళ్ళీ పూర్వవైభవం కల్పించేలా టీటీడీని సంపూర్ణంగా ప్రక్షాళించాల్సి వుంది. ఆంధ్రప్రదేశ్‌లో వైకాపా అధికారంలోకి వచ్చాక సింహాచలం అప్పన్న కోవెలనుంచి శ్రీశైలం మల్లన్న గుడివరకు అన్నిచోట్లా ఎన్నో దారుణాలు చోటుచేసుకున్నాయి. తిరుమలకూ దుష్ట రాజకీయ మరకలు అంటించారు. పిల్లి కళ్లు మూసుకుని పాలు తాగుతూ తనను ఎవరూ చూడటం లేదనుకుందట. అట్లాగే జగన్ తన ఆరాచకాలు ఎవరికీ తెలియవని అనుకొంటున్నారు. శ్రీవేంకటేశ్వరుడి లడ్డూ ప్రసాదం అపవిత్రం కావడానికి కారకులైన పాపాత్ములకు తిరుమలలో జరిగిన సంఘటనకు సీఎం చంద్రబాబుని విమర్శించే అర్హత ఉన్నదా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

**- నీరుకొండ ప్రసాద్**

# స్విమ్స్ నుంచి క్షతగాత్రుల డిశ్చార్జ్

- అనంతరం వారికి శ్రీవారి దర్శన భాగ్యం
- ప్రత్యేక వాహనాల్లో సొంతూళ్లకు తరలింపు
- ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు
- ఏర్పాట్లను పర్యవేక్షించిన కలెక్టర్, కమిషనర్

తిరుపతి(చైతన్యరథం): తొక్కిసలాట ఘటనలో క్షతగాత్రులను గురువారం పరామర్శించిన సీఎం చంద్రబాబు వారికి శ్రీవారి దర్శన భాగ్యం కల్పిస్తామని హామీ ఇచ్చిన విష యం తెలిసిందే. శుక్రవారం స్విమ్స్ ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన వారికి చెప్పిన విధంగానే శ్రీవారి దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం తిరుపతి నుంచి వారి సొంత ప్రాంతాలైన విశాఖపట్నం విజయనగరం, హైదరాబాద్ కడప, తిరుపూర్, కోయంబత్తూ ర్‌లకు ప్రత్యేక వాహనాలలో పంపించారు. దాంతో వారందరూ సంతోషం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు మనసారా కృతజ్ఞతలు తెలిపారు. అలాగే సీఎం ఆదేశాలతో దగ్గరుండి వైద్యం, వాహన, భోజన ఏర్పాట్లు చేసి స్వగ్రామాలకు ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసి పంపించిన కలెక్టర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్విమ్స్ ఆస్పత్రి నుంచి 32 మంది డిశ్చార్జ్ అయ్యారని, ప్రస్తుతం ఐదుగురు ఇంకా చికిత్స పొందుతున్నారని తెలిపారు. వారి ఆరోగ్యం మెరుగ్గా ఉందని సాయంత్రం వారిని వైద్యులు డిశ్చార్జ్ చేయనున్నారని తెలిపారు. అంతకుముందు శ్రీవారి దర్శనం అనంతరం మునిసిపల్ కమిషనర్ నారపురెడ్డి మౌర్యతో కలిసి కలెక్టర్ స్వయం గా వాహనాల దగ్గరకు వచ్చి వారి బాగోగులను తెలుసుకున్నారు. వారి కుటుంబసభ్యుల తో మాట్లాడి ధైర్యం చెప్పారు. అవసరమైన వైద్యసేవలను ప్రభుత్వమే చూసుకుంటుందని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. వారిని తరలించేందుకు ఒక బస్సు, మరో నాలుగు వాహనాలను ఏర్పాటు చేయించి ఒక్కో వాహనంలో ఒక రెవెన్యూ అధికారిని తోడుగా పంపించారు.

# భవిష్యత్‌లో 20 వేల గోకులాలు నిర్మిస్తాం

ఉప ముఖ్యమంత్రి పవన్ వెల్లడి | 12,500 మినీ గోకులాలకు లాంఛనంగా ప్రారంభోత్సవం | అతి తక్కువ సమయంలో భారీ సంఖ్యలో నిర్మాణాలు

పిఠాపురం (చైతన్యరథం): గోవు బాగుంటే రైతు బాగుంటాడని.. రైతు బాగుంటే దేశం బాగుంటుందని ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో 268 గోకులం షెడ్లు నిర్మిస్తే.. తాము ఆరు నెలల్లోనే 12,500 నిర్మించామని చెప్పారు. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం కుమారపురంలో గోకులం షెడ్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పవన్ మాట్లాడారు. గోకులాల ద్వారా చిన్న, కౌలు రైతులు, ఇతర వర్గాలు బాగుపడతాయి. భవిష్యత్తులో 20 వేల గోకులాలు ఏర్పాటు చేస్తాం. గత ప్రభుత్వం పాడి పరిశ్రమను నిర్వీర్యం చేసింది. కుంభకోణాల్లో రికార్డు సృష్టించింది. మా ప్రభుత్వం పల్లె పండుగ, గోకులాలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోంది. సకాలంలో జీతాలు, పింఛన్లు పంపిణీ చేస్తున్నాం. శ్రమ ఉన్న చోటే పెట్టుబడులు వస్తాయి. రైతుల ఆదాయం రెట్టింపయ్యేలా ఆలోచనలు చేస్తున్నాం. ఎన్డీయే, చంద్రబాబు నాయకత్వాన్ని నమ్మి మీరంతా ఓట్లు వేశారు. ఎక్కడ తప్పు జరిగినా స్పందించే గుణం ఉండాలి. తప్పు జరిగితే అది మా అందరి సమష్టి బాధ్యత. అందుకే తిరుపతి తొక్కిసలాట ఘటనపై స్పందించాను... మనస్ఫూర్తిగా క్షమాపణ కోరానని పవన్ కళ్యాణ్ చెప్పారు.

***ఈవ్ టీజర్ల భరతం పడతాం***

అమ్మాయిలను వేధిస్తే ఈవ్ టీజర్ల భరతం పడతామని హెచ్చరించారు. నిస్సహాయ స్థితిలో ఉన్న ఆడపిల్లల్ని వేధించడం గొప్పతనం కాదు. ఆడపిల్లల్ని వేధించి అదో గొప్ప విషయమనుకుంటే తొక్కి నారతీస్తా. ప్రతి ఇంట్లోనూ ఆడపిల్లలు ఉన్నారు. తల్లి లేకుండా సృష్టిలో మనుగడ లేదు. పోలీసు శాఖకు కూడా చాలా స్పష్టంగా చెబుతున్నా.. పిఠాపురంలో ఈవ్ టీజింగ్ అనేది కనిపించకూడదు. నా నియోజక వర్గాన్ని నేను బాగు చేసుకోలేనప్పుడు.. ఉపముఖ్య మంత్రి పదవి ఎందుకు? ఇంతమంది అధికారులు ఎందుకు? క్రిమినల్స్‌కి, ప్రజాప్రతినిధులకు కులం లేదు. తప్పులు చేసి కులాల వెనుక దాక్కుందామను కుంటూ కుదరదు. ఈ విషయంలో తాను చాలా స్పష్టంగా ఉన్నానని పవన్ కళ్యాణ్ హెచ్చరించారు.

***అతి తక్కువ సమయంలో..భారీ సంఖ్యలో***

కుమారపురంలో నిర్మించిన మినీ గోకులాన్ని శుక్రవారం పవన్ కళ్యాణ్ ప్రారంభించి రైతు యాతం నాగేశ్వరరావుకి అందజేశారు. నాలుగు గోవులను కూడా రైతుకి అందజేశారు. ఇదే వేదిక నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిర్మించిన 12,500 మినీ గోకులం షెడ్లను కూడా లాంఛనంగా ప్రారంభించారు. అతి



తక్కువ సమయంలో భారీ సంఖ్యలో గోకులాల నిర్మాణం పూర్తి చేసి రికార్డు సృష్టించారు. కొబ్బరికాయ కొట్టి శాస్త్రోక్తంగా కుమారపురం మినీ గోకులాన్ని ప్రారంభించిన పవన్ కళ్యాణ్..గోమాతను పూజించి, పశుగ్రాసాన్ని అందించారు. అనంతరం గోకులం నిర్మాణ తీరును పరిశీలించారు. గోకులం షెడ్లలో ఏర్పాటు చేస్తున్న మౌలిక వసతులను పశుసంవర్ధక శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పాడి రైతులకు అందిస్తున్న సదుపాయాలపై ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. పశువులకు అందిస్తున్న దాణా, అందుబాటులో ఉన్న పశుగ్రాసం వంగడాలు, పశుగణాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను ఈ చిత్ర ప్రదర్శన ద్వారా అధ్యయనం చేశారు. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ, ఇతర ప్రభుత్వ శాఖల సమన్వయంతో పిఠాపురం నియోజకవర్గం పరిధిలో ఇప్పటి వరకు పూర్తి చేసిన అభివృద్ధి పనుల వివరాలతో కూడిన పోస్టర్‌ను పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో పార్లమెంటు సభ్యులు తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, కమిషనర్ కృష్ణ తేజ, జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి, ఎస్పీ విక్రాంత్ పాటిల్, పౌరసరఫరాల కార్పోరేషన్ ఛైర్మన్ తోట సుధీర్, ఏపీ టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ కుమార్, కౌడా ఛైర్మన్ తుమ్మల రామస్వామి, పిఠాపురం నియోజకవర్గం జనసేన, టీడీపీ, బీజేపీ ఇంఛార్జులు మర్రెడ్డి శ్రీనివాస్, ఎస్వీఎస్ఎన్ వర్మ, కృష్ణంరాజు, ఇతర ఉన్నతాధికారులు, నాయకులు పాల్గొన్నారు.

***ప్రగతి పథం..***

***ప్రభుత్వ ప్రణాళికల అమలుపై అధ్యయనం***

ప్రభుత్వ పథకాల అమలు తీరుపై అధ్యయనం చేస్తూ.. ప్రభుత్వ శాఖల సమన్వయంతో వివిధ వర్గాల ప్రజలకు అందుతున్న సేవలపై పరిశీలన చేస్తూ.. అధికారులను అడిగి సందేహాల నివృత్తి చేసుకుంటూ ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ పిఠాపురం నియోజకర్గ కేంద్రంలో పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల్లో పాల్గొన్నారు. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో వివిధ శాఖల సమన్వయంతో నిర్వహించిన ముందస్తు సంక్రాంతి సంబరాల్లో పాలుపంచుకున్నారు. హరిదాసు కీర్తనలు ఆస్వాదించారు. పిట్టల దొరల కోతలు, జంగమ దేవరల జోస్యాన్ని ఆసక్తిగా ఆలకించారు. సంక్రాంతి పండుగ వేళ హరిదాసుకు బియ్యం వేసి మన సంస్కృతి, సంప్రదాయాలపై తనకున్న మక్కువను చాటుకున్నారు. సంక్రాంతి సంబరాలలో భాగంగా వ్యవసాయశాఖ, పశుసంవర్ధకశాఖ, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ, మత్స్య, జౌళి, గ్రంథాలయ, ఉద్యానవన, మహిళాశిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ప్రజలకు అందిస్తున్న సేవలపై ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆసక్తిగా తిలకించారు.

***ఆకట్టుకున్న మిల్లెట్ స్టాళ్లు***

వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లలో పవన్ కళ్యాణ్.. డ్రోన్ల పని తీరు, సమీకృత వ్యవసాయ వల్ల లాభాలు, మిల్లెట్ సాగు విధానం, నిత్యం ఆదాయం ఇచ్చే ఏటీఎం మోడల్ వ్యవసాయం పొలంబడి, సేంద్రియ ఎరువుల తయారీ, వినియోగం, తదితర అంశాలపై అధ్యయనం చేశారు. సహజ సిద్ధంగా పండించిన చిరుధాన్యాలు ఈ స్టాల్‌లో ఆకర్షణగా నిలిచాయి.

***పుంగనూరు ఆవు ప్రత్యేక ఆకర్షణ***

పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌లో రాయితీతో పాడి రైతులకు అందిస్తున్న మేత కటింగ్ యంత్రం వివరాలు పవన్ కళ్యాణ్ అడిగి తెలుసుకున్నారు. ఈ స్టాల్లో పందెం పుంజు, మేకలతోపాటు పుంగనూరు ఆవు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పశుగ్రాసం, వివిధ రకాల దాణాలను ఈ స్టాల్‌లో ప్రదర్శించారు. పట్టు పరిశ్రమ శాఖ స్టాల్లో సెరీ కల్చర్, పట్టు గూళ్ల పెంపకం తదితర అంశాలపై ఉప ముఖ్యమంత్రివర్యులు అధ్యయనం చేశారు.

***ఆలివ్ రిడ్లీ తాబేళ్ల మరణాలపై ఆరా***

మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్లో సముద్రంలో లభించే వివిధ రకాల మత్స్య సంపదను ప్రదర్శించారు. పండుగొప్ప, టూనా, వంజరం లాంటి చేపలను పవన్ కళ్యాణ్ ఆసక్తిగా తిలకించారు. మంద పీతలు, రొయ్యలలోని వివిధ రకాల వివరాలను ఆ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అటవీ శాఖ స్టాల్లో ఆలివ్ రిడ్లీ తాబేలుతో పాటు వివిధ రకాల పక్షుల నమూనాలను తిలకించారు.తీరంలో ఇటీవల ఆలివ్ రిడ్లీ తాబేళ్ల మరణాలకు కారణాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. కోరంగి అభయారణ్యంలో వన్య ప్రాణుల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలపైనా ఆరా తీశారు. ఉద్యాన శాఖ స్టాల్లో వివిధ రకాల పండ్లు, కూరగాయలతో పాటు సూక్ష్మ సేద్యం, బిందు, తుంపర సేద్యం, ఆయిల్ పామ్ విస్తరణ వివరాలు తెలుసుకున్నారు. సమగ్ర ఉద్యాన అభివృద్ధి మిషన్ కింద తుంపర సేద్యం పరికరాల మంజూరు పత్రాలను పిఠాపురం నియోజకవర్గానికి చెందిన ముగ్గురు రైతులకు అందజేశారు. సత్తి నరేష్, కిమిడి షర్మిళ, బత్తుల నారాయణమ్మలకు వీటిని అందించారు.

***గర్భిణులకు సీమంతం వేడుక***

గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్వయం సహాయక గ్రూపులు తయారు చేసిన తినుబండారాల స్టాళ్లు, రాష్ట్రానికే తలమానికంగా నిలిచే కొయ్య బొమ్మల కొలువులు ఆకట్టుకున్నాయి. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఇద్దరు గర్భిణులకు సీమంతం వేడుక నిర్వహించారు. కె. వరలక్ష్మి, ఎ. రమ్యలకు ఆశీస్సులు పవన్ కళ్యాణ్ అందించారు. స్థానిక రథాలపేట అంగన్వాడీ కేంద్రం చిన్నారులకు భోగి పళ్ల ఉత్సవం నిర్వహించారు. తల్లిపిల్లలకు ఆ శాఖ అందిస్తున్న పౌష్టికాహారం వివరాలు, ఉప్పాడ, జాందానీ చీరల ధరల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను తిలకించారు









## పల్నాడులో తాగునీటి సమస్యను తీర్చే

# 'వాటార్ గ్రిడ్' ఏర్పాటులో మరో ముందడుగు

- **రూ. 1200 కోట్లతో ప్రాజెక్టు నిర్మాణానికి ఆన్‌లైన్ విధానంలో టెండర్లకు ఆహ్వానం**
- **ఫలిస్తున్న టీడీపీపీ నేత, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కృషి**
- **సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు లావు కృతజ్ఞతలు**

అమరావతి (చైతన్యరథం): పల్నాడు ప్రాంతంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా నిర్మించబోయే వాటర్ గ్రిడ్ పథకంలో మరో ముందడుగు పడింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త నిధులతో నిర్మించే ఈ జల ప్రాజెక్టుకు రూ.1200 కోట్లతో ఆన్ లైన్ విధానం (ఈ - ప్రొక్యూర్మెంట్) లో టెండర్లను ఆహ్వానిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 10 వ తారీకు నుండి 24 వ తారీకు మధ్యాహ్నం 3 గంటల లోపు..*www.tender.apeprocurement.govt.in* ద్వారా టెండర్లు వేసేందుకు ప్రభుత్వం వీలు కల్పించింది. ఈ ప్రాజెక్టులో.. నాగార్జున సాగర్ నుండి నీటిని సేకరించి దగ్గరలో శుద్ధ జల కేంద్రాన్ని నిర్మించి, నీటిని ఫిల్టర్ చేస్తారు, పైప్ లైన్ల నిర్మాణం ద్వారా ఈ నీటిని గ్రామాలకు, పట్టణాలకు తరలించి.. ఓవర్ హెడ్ ట్యాంక్‌ల్లో నింపుతారు. ఈ నీటిని ఓవర్ హెడ్ ట్యాంకల నుండి ప్రతి ఇంటికీ సరఫరా చేస్తారు. ప్రస్తుతం జలజీవన్ మిషన్, అమృతధార ద్వారా ప్రతి ఇంటికి కుళాయి ఏర్పాటు చేసి నీరు అందించే లక్ష్యంతో ఉన్నప్పటికీ.. బోర్లు వేసినా నీరు పడక కొన్ని ప్రాంతాల్లో ఈ ప్రాజెక్టు అంతగా ముందుకు సాగటం లేదు,, కానీ వాటర్ గ్రిడ్ పథకం ద్వారా పరిపూర్ణంగా నీటిని అందజేయవచ్చు, అలాగే ఫ్లోరైడ్ సమస్యకు కూడా పరిష్కారం లభిస్తుంది. దీని నిర్మాణం కోసం 2019 నుంచి నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అవిరామంగా కృషి చేస్తూనే ఉన్నారు. కేంద్ర రాష్ట్రాల ప్రభుత్వాల వద్ద ఈ ప్రాజెక్టు గురించి విజ్ఞప్తి చేస్తూనే ఉన్నారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టులో మరో ముందడుగు పడి టెండర్లు ఆహ్వానించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కి, సంబంధిత అధికారులకు ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు ధన్యవాదాలు తెలియజేశారు.

చైతన్యరథం

# వైద్య, ఆరోగ్య శాఖలో ఏడెనిమిది వేల ఖాళీల భర్తీ



- కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి
- అధికారులకు మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశం
- మంజూరైన పోస్టులు, ఖాళీలపై మంత్రి సమీక్ష
- ప్రజలకు మెరుగైన సేవలకు డాక్టర్లు, పేరా మెడికల్ సిబ్బంది నియామకం అవసరమన్న మంత్రి
- వైద్య సిబ్బంది పనితీరు మెరుగుపర్చుకోవాలని స్పష్టీకరణ
- ప్రతి పథకం అమలుపై నెల వారీ నివేదికలకు ఆదేశం

అమరావతి (చైతన్యరథం): ప్రజారోగ్య పరిరక్షణ కోసం రాష్ట్రంలో అమలవుతున్న పలు పథకాల నిర్వహణ తీరు, వైద్య సిబ్బంది కొరత, సిబ్బంది దృక్పథం, జవాబుదారీతనం అంశాలకు సంబంధించి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ శుక్రవారం మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులతో సుదీర్ఘమైన సమీక్ష నిర్వహించి పలు ఆదేశాలు జారీ చేశారు. పలు కేటగిరీల్లో మంజూరైన పోస్టులు, సిబ్బంది లభ్యతను సమీక్షించి, ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు 7 నుంచి 8 వేల సిబ్బంది నియామకానికి అవకాశాలున్నందున ఆమేరకు ప్రాధాన్యతల ఆధారంగా తక్షణమే కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని మంత్రి ఆదేశించారు.

గత ఏడు నెలలుగా వివిధ స్థాయిల్లో వైద్య సిబ్బంది పనితీరును వివరించి 'కథ నడిస్తే చాలు' అన్న వైఖరిని విడనాడి కొత్త ఆలోచనలతో వివిధ పథకాల కింద ప్రజలకందించే వైద్య సేవల నాణ్యతను పెంచి జవాబుదారీతనంతో పనిచేయాలని మంత్రి సూచించారు. ప్రతి నూతన ప్రభుత్వానికీ లభించే ఆరేడు నెలల హనీమూన్ కాలం ముగిసిందని, ఇకనుండి వైద్య సిబ్బంది పనితీరు, ఫలితాలకు సంబంధించి క్రమానుగతంగా సమీక్షించి ప్రశ్నించాల్సిన సమయం ఆసన్నమయ్యిందన్నా రు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం, సంబంధిత మంత్రులు, సిబ్బంది ప్రజలకు జవాబుదారీగా ఉండాలని, ఈ సమష్టి బాధ్యతను వైద్య సిబ్బంది గుర్తించాలని స్పష్టం చేశారు. వివిధ పథకాల అమలు, ఫలితాల్ని సమీక్షించడానికి వీలుగా నెలవారీ నివేదికల్ని సమర్పించాలని ఆదేశించారు. ఆయా పథకాల అమలుకు సంబంధించి నిరంతరం ప్రజలకు సమాచారాన్ని అందించే బాధ్యత సంబంధిత శాఖాధిపతులదని మంత్రి స్పష్టం చేశారు.

### గత పాలకులది డొల్ల ప్రచారం

సిబ్బంది లభ్యత గురించి మాట్లాడుతూ...వైద్య, ఆరోగ్య శాఖ కింద ప్రధాన విభాగాల్లో మొత్తం 1,01,125 పోస్టులు మంజూరై ఉండగా, ప్రస్తుతం వివిధ కేటగిరీల్లో 26,263 ఖాళీలున్నాయని మంత్రి వెల్లడించారు. ఈ మేరకు మొత్తం మంజూరైన సిబ్బందిలో 25.97 శాతం కొరత ఉందన్నారు. ఈ వివరాలు....జీరో వేకెన్సీ కింద ఆరోగ్య శాఖలో ఎటువంటి ఖాళీలు లేకుండా సిబ్బందిని నియమించామని గత ప్రభుత్వాధినేతలు చేసుకుంటున్న ప్రచారంలో డొల్లతనాన్ని స్పష్టంగా వెల్లడిస్తున్నాయని మంత్రి సత్యకుమార్ వ్యాఖ్యానించారు. డాక్టర్ల కొరత 21.41 శాతం ఉందని, ఇతర పేరా మెడికల్, సహాయక సిబ్బంది కొరత 26.78 శాతముందని మంత్రి వివరించారు.

### ప్రాధానత్యల ఆధారంగా..

ప్రభుత్వ బోధానాసుపత్రుల్లో సిబ్బంది కొరత 37.04 శాతం ఉండగా, ప్రాథమిక వైద్య సేవలందించే ఆసుపత్రుల్లో ఇది 28.96 శాతం ఉందని, ప్రాంతీయ, జిల్లా ఆసుపత్రుల్లో 14.51 శాతం కొరత ఉందని, ఆయుర్వేద, హోమియోపతి, యునాని ఆసుపత్రుల్లో సిబ్బంది కొరత అత్యధికంగా 63.40 శాతముందని మంత్రి వెల్లడించారు. గత ప్రభుత్వం హోమియోపతి, ఆయుర్వేద, యునాని వైద్యాల్ని పూర్తిగా నిర్లక్ష్యం చేయడం పట్ల మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు స్పందిస్తూ.. ఖాళీగా చూపిన మొత్తం పోస్టుల్లో కొన్నింటిని రద్దుచేసి సమకాలీన అవసరాల కోసం కొత్త పోస్టుల్ని కల్పించారని, మరికొన్ని పోస్టుల్ని పదోన్నతుల ఆధారంగా భర్తీ చేయాల్సి ఉంటుందని వివరించారు. సిబ్బంది కొరతను సమగ్రంగా సమీక్షించి ప్రాధాన్యతల ఆధారంగా ఏడెనిమిది వేల పోస్టుల భర్తీకి ప్రణాళిక రూపొందించాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు.

### ప్రజల్లో చైతన్యానికి విస్తృత ప్రచారం

తరచుగా కలుషిత తాగునీటి కారణంగా వస్తున్న వ్యాధులు, కీటక జనిత వ్యాధులు ప్రబలడం, ప్రస్తుత జీవన అలవాట్ల కారణంగా భారీ స్థాయిలో మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్ వంటి అసంక్రమిక( నాన్ కమ్యునకబుల్) వ్యాధులు విస్తరిస్తున్న నేపథ్యంలో శుభ్రత, సరైన జీవన విధానం, ఆహారం విషయాల్లో వివిధ ప్రచార మాధ్యమాల ద్వారా ప్రజల్లో చైతన్యాన్ని కల్పించడానికి ప్రభావంతమైన ప్రచార కార్యక్రమాన్ని తక్షణమే రూపొందించాలని అధికారులను మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు. ఇందుకోసం సమాజంలో ప్రతిష్టాత్మకమైన వ్యక్తులు, సంస్థల సేవల్ని వినియోగించుకోవాలని మంత్రి సూచించారు.

ఏపీ సచివాలయంలో జరిగిన ఈ సమీక్షా సమావేశంలో వైద్య,ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, నేషనల్ హెల్త్ మిషన్ డైరెక్టర్ వాకాటి కరుణ వర్చువల్‌గా పాల్గొనగా... సెకండరీ హెల్త్ డైరెక్టర్, ఏపీఎంఎస్ ఐడీసీ ఎండీ డాక్టర్ ఏ సిరి, ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి, వైద్య విద్య సంచాలకులు డాక్టర్ నరసింహం, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ శాఖలకు ఆర్టీజీఎస్ సాంకేతిక సహకారం

- తద్వారా వాటి పనితీరు మెరుగుపరుద్దాం
- సీఎం ఆశయాలకనుగుణంగా పనిచేయాలి
- త్వరలో అందుబాటులోకి వాట్సాప్ గవర్నెన్స్
- అధికారులతో సీఎస్ కే విజయానంద్



అమరావతి (చైతన్యరథం): ప్రభుత్వంలో వివిధ శాఖలు తమ పనితీరు మెరుగుపరచుకోవడానికి వీలుగా రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) సాంకేతిక సహకారాన్ని అందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కే విజయానంద్ సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయాలకు అనుగుణంగా ఈ సంస్థ పనిచేసి మెరుగైన ఫలితాలను సాధించాలన్నారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. ఆర్టీజీ శాఖ కార్యదర్శి సురేష్‌కుమార్, ఆర్టీజీఎస్ సీఈఓ కే దినేష్ కుమార్‌లు సీఎస్ కు స్వాగతం పలికి ఆర్టీజీఎస్ చేపడుతున్న కార్యకలాపాల గురించి వివరించారు. ఈ సందర్భంగా సీఎస్ విజయానంద్ మాట్లాడుతూ సాంకేతిక యుగంలో, ప్రభుత్వశాఖల్లో మెరగైన ఫలితాలు రాబట్టడానికి అపార అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వంలో సాంకేతికపరంగా ఒక కటింగ్ ఎడ్జ్‌గా ఆర్టీఈఎస్ ఉండాలనేది ముఖ్యమంత్రి ఆశయమన్నారు. తానుకూడా ఇకపైన ఆర్టీజీఎస్ కార్యకాలాలను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తానని చెప్పారు.

### *త్వరలో వాట్సాప్ గవర్నెన్స్*

పౌరులకు ప్రభుత్వ సేవలను, పాలనను మరింత చేరువ చేయాలనే సదాశయంతో ముఖ్యమంత్రి చంద్రబాబు వాట్సాప్ గవర్నెన్స్‌ను తీసుకురావాలని సంకల్పించారని విజయానంద్ తెలిపారు. వాట్సాప్ గవర్నెన్స్‌ను సంబంధించి పనులు ఎంతమేరకు వచ్చాయని ఆయన ఆర్టీజీఎస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. దీనిపై ఆర్టీజీఎస్ సీఈఓ దినేష్ కుమార్ మాట్లాడుతూ వాట్సాప్ గవర్నెన్స్‌కు సంబంధించి అన్ని అన్ని పనులు దాదాపుగా పూర్తి చేశామని చెప్పారు. దానికి సంబంధించిన డెమోను సీఎస్‌కు చూపించారు. 150 రకాల సేవలను ప్రజలకు దీని ద్వారా అందించడాని సిద్ధంగా ఉన్నామన్నారు. దాంతో పాటు ప్రజలు తమ ఫిర్యాదులు కూడా వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా చేసే వీలు కల్పిస్తున్నామని చెప్పారు. దీనిపై సీఎస్ స్పందిస్తూ వాట్సాప్ గవర్నెన్స్ ప్రజలందరికీ సులభంగా అర్ధమయ్యేలా ఇంగ్లీషు, తెలుగు రెండు భాషల్లో ఉండేలా చూడాలని సూచించారు.

### *ప్రతి శాఖతో సమన్వయం చేసుకోండి*

ప్రభుత్వంలోని ప్రతి శాఖతోనూ ఆర్టీజీఎస్ సమన్వయం చేసుకోవాలని సీఎస్ విజయానంద్ సూచించారు. ఆర్టీజీఎస్ వద్ద ఉన్న ఇన్నోవేషన్ టెక్నాలజీలను ఆయా శాఖలకు పంపి, ఆర్టీజీఎస్ నుంచి ఇంకా ఏం కావాలని కోరుకుంటున్నారో వారితో నేరుగా చర్చించి, ఆయా శాఖల అవసరాలకు అనుగుణంగా సాధ్యమైనంతమేర సాంకేతిక సహకారం అందివ్వాలని సూచించారు. ప్రభుత్వ శాఖల్లో లోపాలను ఎత్తి చూపడం కాకుండా, వాటి పనితీరు మరింత మెరుగవ్వడానికి ఆర్టీజీఎస్ దోహదపడేలా సాంకేతిక సదుపాయాలను అందించాలన్నారు. ఆర్టీజీఎస్ నుంచి ప్రతి శాఖకు ఒక ప్రతినిధిని పంపి, అక్కడి శాఖాధిపతి, అధికారులతో చర్చించి పౌరులకు అందిస్తున్న సేవలకు సంబంధించి ఆ శాఖ ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటికి సాంకేతిక పరిష్కారాలు కనుగొని ఆయా శాఖల పనితీరు మెరుగవ్వడానికి దోహదపడాలన్నారు. ఈ సమావేశంలో ఆర్టీజీఎస్ డిప్యూటీ సీఈఓ ఎం. మాధురి, అధికారులు పాల్గొన్నారు.

# చెవిరెడ్డికి హైకోర్టులో చుక్కెదురు

**క్వాష్ పిటిషన్ కొట్టేసిన హైకోర్టు**



అమరావతి: వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి హైకోర్టులో చుక్కెదురయింది. తనపై నమోదైన పోక్సో కేసును కొట్టేయాలంటూ చెవిరెడ్డి దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు శుక్రవారం కొట్టివేసింది. గతంలో బాలికపై అత్యాచారం జరిగిందంటూ అసత్య ప్రచారం చేశారని ఆయనపై ఫిర్యాదులు వచ్చాయి. ఈ మేరకు తిరుపతి పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టివేయాలని ఆయన ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు చెవిరెడ్డి పిటిషన్‌ను కొట్టివేసింది.

తిరుపతి జిల్లా యర్రావారిపాలెం మండలానికి చెందిన బాలిక (14)పై అత్యాచారం జరిగిందని వ్యాఖ్యానించడంతో పాటు సామాజిక మాధ్యమాల్లో ప్రసారం చేశారన్న ఆరోపణలతో చెవిరెడ్డిపై కేసు నమోదైంది. వాస్తవాలు నిర్ధారించుకోకుండా అసత్య ప్రచారం చేయడాన్ని పోలీసులు తీవ్రంగా పరిగణించారు. దీంతో బాలిక తండ్రి ఫిర్యాదు ఆధారంగా పోక్సో కేసు పెట్టారు. యర్రావారిపాలెం మండలానికి చెందిన బాలిక.. పాఠశాల నుంచి ఇంటికి వస్తుండగా ముసుగు వేసుకున్న దుండగులు తనపై దాడిచేసి మత్తు మందు తాగించారని తల్లిదండ్రులను నమ్మించింది. ఘటన పూర్వాపరాలు తెలుసుకోకుండా, వాస్తవాలు నిర్ధారించుకోకుండానే బాలిక చదివే పాఠశాలకు వెళ్లిన మాజీ చెవిరెడ్డి బాస్కర్‌రెడ్డి ఆమెపై అత్యాచారం జరిగిందని, ఆమెకు అండగా ఉంటామని వ్యాఖ్యానించినట్లు పోలీసులు గుర్తించారు. బాలికకు వైద్యపరీక్షలు చేసి అత్యాచారం జరగలేదని పోలీసులు తెలిపినా, సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేసినట్లు తేల్చారు. ఈ కేసులో బాధితురాలు మైనర్ బాలిక కావడం వల్ల.. ఆమెతోపాటు కుటుంబసభ్యుల గుర్తింపు ప్రచారం చేయడం పోక్సో చట్టం ప్రకారం ఉల్లంఘన అవుతుంది. అసత్య ప్రచారం చేసి తమను మనోవేదనకు గురిచేశారంటూ బాలిక తండ్రి ఆయనపై ఫిర్యాదు చేశారు.

# పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర వినతులను పరిష్కరించండి

- కేంద్ర మంత్రులను కోరిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్



భువనేశ్వర్ (చైతన్యరథం): రాష్టానికి వలస వనరుల కేంద్రం, ఎంఎస్ఎంఈ పథకాలను మంజూరు చేయాలని కేంద్ర మంత్రులకు ఏపీ ఎంఎస్ఎంఈ, సెర్ప్, ప్రవాసాంధ్రుల సాధికారత, సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. ఒడిశా రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లో రెండు రోజుల నిర్వహించిన ప్రవాస భారతీయ దివస్ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రికొండపల్లి శ్రీనివాస్.. కేంద్ర మంత్రులు జైశంకర్, శోభకరండ్లాజేని కలిసి కేంద్ర ప్రభుత్వ స్థాయిలో పెండింగ్‌లో ఉన్న విజ్ఞప్తులను పరిష్కరించాలని కోరారు

విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్ జైశంకర్ ఆహ్వానం మేరకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రవాస భారతీయ దివస్ కార్యక్రమంలో పాల్గొన్నారు. రెండు రోజులు పాటు జరిగిన ప్రవాస భారతీయ దివస్ కార్యక్రమాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం ప్రారంభించారు. ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాలలో నివసించే భారతీయ మూలాలున్న వారందరినీ ఏకం చేయడంతో పాటు ఆయా దేశాల్లో భారతీయ సంతతి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ సమావేశంలో సమగ్రమైన చర్చ జరిగింది.

ఈ సందర్భంగా మంత్రి జైశంకర్‌తో భువనేశ్వర్‌లోని ఆయన విడిది కార్యాలయంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున పెండింగ్‌లో ఉన్న సమస్యలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో వలస వనరుల కేంద్రం మంజూరు కోసం విజ్ఞాపన చేశారని గుర్తుచేశారు. సత్వరమే రాష్ట్రానికి వలస వనరుల కేంద్రం, విదేశీ భవన్ మంజూరు చేయాలని మంత్రి శ్రీనివాస్ అభ్యర్థించారు. దీనిపై స్పందించిన కేంద్ర మంత్రి జైశంకర్ త్వరలోనే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

అనంతరం కేంద్ర సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమలు, కార్మిక ఉపాధి కల్పన శాఖ సహాయ మంత్రి శోభాకరండ్లాజెతో మంత్రి శ్రీనివాస్ సమావేశమయ్యారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహ పరిశ్రమల శాఖకు సంబంధించి రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వ పథకాలను అత్యధికంగా మంజూరు చేసి రాష్ట అభివృద్ధికి తగిన సహాయ సహకారాలు అందించాలని అభ్యర్థించారు. మంత్రి శ్రీనివాస్ విజ్ఞప్తిపై స్పందించిన మంత్రి శోభాకరండ్లాజె రాష్ట్ర ప్రభుత్వానికి అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

# ఓర్వలేకే తప్పుడు ఆరోపణలు

పార్వతీపురం మన్యం (చైతన్యరథం): మండలంలోని నారన్నాయుడువలస గ్రామంలో ఏడుగురు అర్హత కలిగినవారి పింఛన్లను సర్పంచి తొలగించారంటూ జడ్పీటీసీసభ్యులు రవికుమార్ జిల్లా పరిషత్తు సర్వసభ్య సమావేశంలో గురువారం ఆరోపించడం రాజకీయ లబ్ధికోసమేనని టీడీపీ అరకు పార్లమెంట్ బీసీ సెల్ అధ్యక్షులు బూరాడ రామ్మోహనరావు, నారన్నాయుడు వలస సర్పంచి సోము వెంకటరమణలు అన్నారు. బలిజిపేటలో శుక్రవారం సాయంత్రం వారు విలేకరులతో మాట్లాడారు. ఎంతోమంది అర్హులకు టీడీపీ పింఛన్లు మంజూరు చేసిన ఘనత ఆయనకు తెలియదా అన్నారు. ఈ ప్రభుత్వ పాలనలో అనర్హులకు పింఛన్లు అందజేయడం జరగదని, పారదర్శక పాలన చేపడుతున్న టీడీపీ నాయకులపై ఆయన చౌకబారు ప్రకటనలు చేయడం ఆశ్చర్యంగా ఉందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎంతోమంది అనర్హులకు ఆ పాలకులు దొంగ పింఛన్లు మంజూరు చేశారని, వాటిని ఈ ప్రభుత్వ హయాంలో కొనసాగించే ప్రసక్తిలేదన్నారు. టీడీపీ సానుభూతిపరులైన సర్పంచులు గతంలో చేసిన అభివృద్ధి పనులకు ఎం.బుక్ చేయకుండా నిలిపివేసిన ఘనత వైసీపీదేనన్నారు. నారన్నాయుడు వలస గ్రామసర్పంచి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నారని, వాటిని ఓర్వలేకే ఈ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు.

# పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్న పోలీసులు



శ్రీకాకుళం(చైతన్యరథం): బలిజిపేట మండలంలోని జనార్ధనవలస కూడలి వద్ద విజయనగరం జిల్లా వంగర మండలం నుంచి ఒడిశాకు అక్రమంగా తరలిస్తున్న రెండు మెట్రిక్ టన్నుల 300 కేజీల (2,300 కేజీలు) పీడీఎస్ బియ్యాన్ని శ్రీకాకుళం జిల్లా విజిలెన్సు అధికారులు, బలిజిపేట పౌరసరఫరాలశాఖ అధికారులు శుక్రవారం పట్టుకొన్నారు. శ్రీకాకుళం విజిలెన్సు ఎస్పీ బర్ల ప్రసాదరావుకు వచ్చిన సమాచారం మేరకు విజిలెన్సు ఎస్సై రామారావు, బలిజిపేట సీఎస్‌ఓటీ రమేష్, సిబ్బంది మాటు వేసి బొలేరో వాహనంపై తరలిస్తున్న కోటా బియ్యాన్ని స్వాధీనం చేసుకొన్నారు.

# పశువుల అక్రమ రవాణా బట్టబయలు



విశాఖపట్నం (చైతన్యరథం): పెందుర్తి పోలీసులు అక్రమ పశువుల రవాణాను బట్టబయలు చేశారు. రోజులాగే పెదగాడి జంక్షన్ వద్ద పోలీసులు తనిఖీలు చేస్తుండగా.. కంట్రోల్ రూమ్ ఇచ్చిన పక్కా సమాచారంతో వాహనాలను ముమ్మరంగా చెక్ చేశారు. ఇక అటుగా వచ్చిన రెండు భారీ కంటైనర్లు కొంచెం అనుమానాస్పదంగా కనిపించడంతో.. వాటిని చెక్ చేయగా.. గుట్టుచప్పుడు యవ్వారం కాస్తా బయటపడింది. అక్రమంగా కంటైనర్లలో రాష్ట్ర సరిహద్దులను దాటిస్తున్న పశువులను స్వాధీనం చేసుకుని.. నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఆ కంటైనర్లు మానాపురం నుంచి కర్ణాటకకు తరలిస్తున్నట్లుగా గుర్తించారు. అలాగే ఆ రెండు కంటైనర్లలో 31 ఆవులు, 7 దున్నలు ఉన్నట్లుగా తెలుస్తోంది. కాగా, ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు పెందుర్తి పోలీసులు.

# అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శిరీష శ్రీకారం



రంపచోడవరం (చైతన్యరథం): రాజవొమ్మంగి మండలంలో రోడ్ల నిర్మాణానికి భూమి పూజలు మరియు గోకులాల అభివృద్ధి పనులకు నియోజకవర్గ ఎమ్మెల్యే శిరీష విజయభాస్కర్ దంపతులు శుక్రవారం శంకుస్థాపన చేశారు. రాజవొమ్మంగి మండలంలో వట్టిగెడ్డ గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో జనుమూరి రమణమ్మ గోకులాల షెడ్డును ఎమ్మెల్యే శిరీష ప్రారంభించారు. రాజవొమ్మంగి మండలంలో కిమిలి గెడ్డ గ్రామం నుంచి ముర్లవారి వీధి వరకు కొత్తగా తారు రోడ్డు పనులు చేయుటకు తెలుగుయువత అధ్యక్షులు మఠం విజయభాస్కర్‌తో కలిసి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో రాజవొమ్మంగి మండల ప్రజలు, తెలుగుదేశంపార్టీ మండల అధ్యక్షులు జి.పెద్దిరాజు, పార్వతి, రమణి, జి. తాతారావు తదితరులు పాల్గొన్నారు.

# పండుగ వేళ దక్షిణ మధ్య రైల్వే తీపి కబురు

**• రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర ప్రాంతాలకు 366 ప్రేత్యేక రైళ్ల సర్వీసులు**



విశాఖపట్నం (చైతన్యరథం): రికార్డు సంఖ్యలో సంక్రాంతి ప్రత్యేక రైళ్లను నడుపుతోంది దక్షిణ మధ్య రైల్వే. ప్రయాణీకులను తమ సొంతూళ్లకు చేర్చేందుకు వివిధ గమ్యస్థానాల మధ్య జనవరి నెలలో సంక్రాంతి ప్రత్యేక రైళ్లను ప్రకటించింది. ఇప్పటివరకు జోన్ సంక్రాంతి సీజన్‌లో 188 ప్రత్యేక రైళ్లను ప్రకటించింది.

మరో 178 ప్రత్యేక రైళ్లు జోన్ గుండా వెళుతున్నాయి. దీనితో మొత్తం 366 ప్రత్యేక రైళ్ల సర్వీసులు ఉన్నాయి. ఈ రైళ్లలో ఎక్కువ భాగం రద్దీగా ఉండే సెలవుదినాలలో నడుపుతున్నారు. ఈ రైళ్లు రెండు తెలుగు రాష్ట్రాల మధ్య మాత్రమే కాకుండా ఇతర ప్రసిద్ధ గమ్యస్థానాలకు కూడా నడుస్తున్నాయి. చర్లపల్లి స్టేషన్ నుంచి నర్సాపూర్, కాకినాడ, శ్రీకాకుళం మొదలైన స్టేషన్‌ల వైపు 59 ప్రత్యేక రైళ్లను నడుపుతున్నారు. ఇందులో 16 జనసాధరణ రైళ్లు చర్లపల్లి–విశాఖపట్నం–చర్లపల్లి మధ్య సాధారణ కోచ్‌లతో ప్రత్యేకంగా నడుస్తాయి. అందుబాటు ధరలు, సౌకర్యవంతమైన ప్రయాణంతో మధ్యతరగతి ప్రజలకు ఇవి సౌకర్యంగా ఉండబోతున్నాయి. సాధారణ రైళ్ల రద్దీని దృష్టిలో పెట్టుకుని అదనంగా 15 ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనపు కోచ్‌లను జోడించారు. అలాగే రైలు నెంబర్ 20833/20834 సికింద్రాబాద్–విశాఖపట్నం– సికింద్రాబాద్ వందే భారత్ రైలుకు జనవరి 11, 2025 నుంచి శాశ్వత ప్రాతిపదికన 4 అదనపు చైర్ కార్ కోచ్‌లను పెంచుతున్నారు.నర్సాపూర్, కాకినాడ, విశాఖపట్నం, శ్రీకాకుళం, మచిలీపట్నం, తిరుపతి, బెర్హంపూర్, జైపూర్, గోరఖ్‌పూర్, కటక్, మధురై, అర్సికెరె మొదలైన ప్రముఖ ప్రాంతాలకు ఈ ప్రత్యేక రైళ్లు నడుస్తాయి. వీటితోపాటు జోన్ నుంచి నెల్లూరు, విజయవాడ, రాజమండ్రి, వరంగల్ స్టేషన్ల గుండా చెన్నై, బెంగళూరు, మధురై జోన్‌ల నుంచి వచ్చే షాలిమార్, సంబల్పూర్, బరౌని, విశాఖపట్నం మొదలైన స్టేషన్లకు మరికొన్ని ప్రత్యేక రైళ్లు పరుగులు పెట్టనున్నాయి.

# సేంద్రీయ ఉత్పత్తులు... ఆహారధాన్యాలు ఆరోగ్యానికి మంచివి

విజయనగరం (చైతన్యరథం): సేంద్రీయ ఉత్పత్తులు.. ఆహార ధాన్యాలు ఆరోగ్యానికి మంచి చేస్తాయని కలెక్టర్ డా.బి.ఆర్. అంబేడ్కర్ చెప్పారు. శుక్రవారం కలెక్టరేట్ లో ప్రకృతి సహజ సిద్ధంగా రైతులు పండించిన ఆర్గానిక్ ఉత్పత్తులను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనను కలెక్టర్, జేసీ సేతు మాధవన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులతో కలెక్టర్ మాట్లాడి ఎన్ని ఎకరాల్లో సాగు చేస్తున్నారు ఎంత పెట్టుబడి పెడుతున్నారు. ఎంత లాభం వస్తోంది, అందులో సమస్యలేమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సాగును పెంచడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి తారక రామ రావు, ఇతర వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.



# పండగకి మీ ఇంటికి దొంగలు వస్తారు జాగ్రత్త!

శ్రీకాకుళం (చైతన్యరథం): సంక్రాంతి పండుగ సందర్భంగా మీ ఇంటికి దొంగలొస్తారు.. జాగ్రత్త అంటూ రెండో పట్టణ పోలీసులు వినూత్నంగా ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఈ నెల 9వ తేది నుంచి 16 వరకు స్కూల్స్, కళాశాలకు ప్ర భుత్వం సెలవులు ప్రకటించడంతో కుటుంబాలతో సొంత గ్రామాలకు వెళ్లేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాని టూటౌన్ సీఐ పి.ఈశ్వరరావు కోరారు. ఈ మేరకు ప్రజలను అప్రమత్తం చేసేందుకు ఆటోపై 'పండగకి మీ ఇంటికి దొంగలు వస్తారు జాగ్రత్త' అనే బ్యానర్‌రు పెట్టి మైక్‌పై అప్రమత్తం చేస్తున్నారు. ఊరెళ్లే వారు సమాచారం అందిస్తే గస్తీ నిర్వహిస్తా మని, ఎల్‌హెచ్‌ఎంఎస్ సౌకర్యాన్ని కల్పిస్తామని స్పష్టం చేశారు. దీని ద్వారా ఇంట్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఎటువంటి దొంగతనాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని సీఐ వివరించారు.




# సింహాచలం అప్పన్నను దర్శించుకున్న టీడీపీ నేతలు

విశాఖపట్నం (చైతన్యరథం): సింహాచలం లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయానికి కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, గంటా శ్రీనివాసు, గణబాబులు ఉత్తరద్వార గుండా స్వామివారిని దర్శించుకున్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయ అధికారులు పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు.





# గోకులం షెడ్లను ప్రారంభించిన డిప్యూటీ సీఎం



పిఠాపురం (చైతన్యరథం): రాష్ట్రవ్యాప్తంగా 12,500 గోకులం షెడ్లు ఏర్పాటు చేశామని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెల్లడించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పిఠాపురం మండలం కుమారపురంలో గోకులం షెడ్లను శుక్రవారం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రారంభించారు. అనంతరం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. ఈ ఏడాది సంక్రాంతి వేడుకలను అద్భుతంగా జరుపుకుందామని అనుకున్నామన్నారు.

కానీ తిరుపతిలో తొక్కిసలాట ఘటన తనను తీవ్రంగా బాధించిందన్నారు. ఈ నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని మాములుగా నిర్వహిస్తున్నామని వివరించారు.

కూటమి విజయం అంటే.. ప్రజలు, రాష్ట్రం ఉమ్మడి గెలుపు అని ఈ సందర్భంగా సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. మీరు ఇచ్చిన విజయంతో రాష్ట్రానికి రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని తెలిపారు.

దేశం రుణం తీర్చుకోవాలని ఈ సందర్భంగా యువతకు ఆయన పిలుపు నిచ్చారు. పల్లె రుణం తీర్చుకోవాలన్నది తన కోరిక అని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. అయితే గ్రామాల్లో విధులు నిర్వహించే క్రమంలో మరింత బాధ్యతగా ఉండాలని ఈ సందర్భంగా ఉన్నతాధికారులకు ఆయన సూచించారు. తాము అండగా ఉంటామని అధికారులకు పవన్ కల్యాణ్ భరోసా ఇచ్చారు.

# కోడి పందేలను అడ్డుకోండి

- హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు... జూదాలకు లేని అనుమతి



ఏలూరు (చైతన్యరథం): సంక్రాంతి పండుగ వేళ.. ఈసారి ఎట్టి పరిస్థితుల్లోనూ కోడి పందేలు జరగకుండా చూడాలని ఉన్నత న్యాయస్థానం ఉత్తర్వులు ఇచ్చిన నేపథ్యంలో అధికారుల సైతం అందుకు తగ్గట్టుగా చర్యలు చేపడుతున్నారు. రాష్ట్రంలో సంక్రాంతి సంబరాల పేరిట కోడి పందేలు, జంతు హింస జరగకుండా చూడాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్.చక్రవర్తి మధ్యంతర ఉత్తర్వులిచ్చారు. ఈ క్రమంలోనే ఏలూరు జిల్లా కలెక్టర్ జిల్లా వేట్రీ సెల్వి అధికారులు ఆదేశించారు. సంక్రాంతి సంబరాల పేరిట జంతుహింస జరుగకుండా నియంత్రణ చర్యలు చేపట్టాలని హైకోర్టు ఉత్తర్వులు మేరకు జిల్లాలో రెవిన్యూ, పోలీస్ యంత్రాంగం, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులతో కూడిన జాయింట్ యాక్షన్ కమిటీలను నియమిస్తూ జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ఉత్తర్వులు జారీచేశారు. సంక్రాంతి సంబరాల పేరిట కోడిపందేలు, జూదాలు జరుగకుండా చూసేందుకు జిల్లాలో అన్ని మండలాల్లో 28 సంయుక్త తనిఖీ బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందాలు ఎప్పటికప్పుడు గట్టినిఘాతో తనిఖీలు ముమ్మరం చేయాలని కలెక్టర్ సూచించారు.

# సంక్రాంతి సందడి ఎందుకంటే ?



నెలకు ఒక రాశి చొప్పున సూర్యభగవానుడు ఏడాది మొత్తం కలిపి 12 రాశుల్లో సంచరిస్తాడు. రాశిమారిన ప్రతిసారీ సంక్రమణం అంటారు. కానీ ధనుస్సు రాశి నుంచి మకర రాశిలోకి సూర్యుడు సంచరించేటప్పుడు పెద్ద పండుగను జరుపుకుంటారు. అదే సంక్రాంతి పండుగ. ఈ పండుగను మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా జరుపుకుంటారు. సంక్రాంతి పండుగ విశిష్టత ఏంటి. ప్రపంచ వ్యాప్తంగా సంక్రాంతి పండుగను పెద్ద పండుగగ ఎలా జరుపుకుంటున్నారో..పూర్తి వివరాలు తెలుసుకుందాం.

దక్షిణదిక్కు వైపు ప్రయాణించిన సూర్యుడు తన దిశను మార్చుకుని పుష్యమాసంలో ఉత్తరదిక్కులో సంచరిస్తుంటాడు. అందుకే దీన్ని ఉత్తరాయణ పుణ్యకాలం అని పిలుస్తారు. సూర్యుడి గమనం మారడం వల్ల అప్పటి వరకు ఉన్న వాతావరణంలో పూర్తిగా మార్పులు వస్తాయి. సంక్రాంతి సౌరమానం ప్రకారం చేసుకుంటారు. కాబట్టి ఈ పండుగ తేదీల్లో మార్పులు ఉండటం చాలా అరుదు.

### సంక్రాంతి పెద్ద పండుగ ఎందుకు అయ్యింది?

సంక్రాంతి పండుగ సమయానికి పొలాల నుంచి వచ్చే ధాన్యం ఇంటికి చేరుకుంటుంది. చేతికి వచ్చిన పంటను చూసి రైతులు ఆనందంతో చిరునవ్వులు చిందిస్తారు. ఇంటికి చేరిన కొత్త ధాన్యంతో అన్నం వండుకుని తినరు. ఎందుకంటే కొత్త బియ్యం తొందరగా అరగదు. అందుకే ఆ బియ్యానికి బెల్లం జోడించి పరమాన్నం, అప్పాలు, అరిసెలు, చక్కిలాలు తయారు చేస్తారు. ఇలా చేస్తే పిండివంటలు చేసుకున్నట్లు కూడా ఉంటుంది. జీర్ణ సమస్యలు కూడా రావు. తమిళనాడులో కొత్త బియ్యంతో పొంగలి చేసి నైవేద్యం పెడతారు. అందుకే అక్కడ పొంగల్ అని పిలుస్తారు. పంట చేతికందించిన దేవుడికి ధన్యవాదాలు తెలుపుతూ అన్నీ చేసి నైవేద్యం సమర్పిస్తారు. అంతేకాదు ప్రక్రుతిని పూజించడంతోపాటు పశువులను కూడా పూజిస్తుంటారు.

### నువ్వుల ప్రత్యేకత గురించి?

సంక్రాంతి పండగ రోజు చేసే పిండివంటన్నింటిలోనూ నువ్వులు ఉపయోగిస్తారు. చాలా రాష్ట్రాల్లో నువ్వులతోనే పిండి వంటలు చేస్తుంటారు. కొందరు నువ్వులను శనిదేవునికి రూపంగా భావిస్తారు. చాలా ప్రాంతాల్లో సంక్రాంతి సమయాల్లో నువ్వులను తప్పనిసరిగా వినియోగిస్తారు. నువ్వుల వాడకం వెనక ఆరోగ్య రహస్యాలు చాలా ఉన్నాయి. నువ్వుల్లో ఉండే అధిక పోషకాల వల్ల ఒంటికి వేడి చేస్తుంది. అందుకే ఆహారంలో నువ్వులు పెద్దగా వినియోగించరు. కానీ సంక్రాంతి సమయంలో సూర్యుని దిశ మారడంతో ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఈ సమయంలో నువ్వులను తినడం వల్ల మారుతున్న వాతావరణానికి శరీరాన్ని అలవాటు చేసినట్లవుతుంది.

### ముగ్గులు:

సంక్రాంతికి రకరకాల ముగ్గులు లోగిళ్ల ముందు దర్శనమిస్తాయి. రంగు రంగుల రంగవల్లికలు మనస్సును ప్రశాంతంగా ఉంచుతాయి. గాలిపటాలు, గొబ్బిల్లు, ఇలా సంక్రాంతికి ఎన్నో పాటిస్తుంటారు. ఆ మూడు రోజులు ఎక్కడ చూసిన వాకిళ్లలో ముగ్గులు దర్శనమిస్తుంటాయి. హరిదాసులు, బుడబుక్కలవారు, గంగిరెద్దులు, ఇలా వీధుల్లో సందడి చేస్తుంటారు. వీళ్లందరికీ తోచినంత సాయం చేస్తే ఆ భగవంతుడికే సాయం చేసినట్లుగా భావిస్తారు.

### సంక్రాంతి పితృదేవతల పండుగ కూడా

సంక్రాంతి రోజు పెద్దలకు తర్పణం విడవటం తరతరాలుగా ఆచారంగా వస్తోంది. మోక్షాన్ని ప్రసాదించే ఉత్తరాయణ పుణ్యకాలంలో పెద్దలకు సద్గతులు కలగాలని కోరుకుంటూ తర్పణాలను విడుస్తారు. అందుకే సంక్రాంతి పెద్ద పండుగగా మాత్రమే కాదు పెద్దల పండుగ కూడా. ఎప్పుడూ నేనే అనే భావన కన్నా.. నలుగురిలో మనం అనే భావన అంతులేని ఆనందాన్నిస్తుంది. సంక్రాంతి పరమార్థం కూడా అదే. మన దగ్గర ఉన్నదాన్ని నలుగురితో పంచుకోవడమే అసలైన పండుగ. పంటలు పండి ధాన్యం ఇళ్లకి చేరుకునే సంక్రాంతి సమయంలో దానం చేయడం చాలా మంచిదని చెబుతారు. హరిదాసులు, బుడబుక్కలవారు, గంగిరెద్దులనాడించేవారు.. ఇలా పండుగ శోభను పెంచేవారెందరో. వీళ్లందరికీ తోచిన సహాయం చేసి ఆ భగవంతుడికే సహాయం చేసినట్టు భావిస్తారు.

# సాగునీటి కష్టాల తొలగింపు

ఆలుమూరు (చైతన్యరథం): పంట భూములకు సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో మూసుకుపోయిన పంటకాలువను ఎక్స్‌కవేటర్‌తో తొలగించి సాగునీటి ఇబ్బందులు పరిష్కరించారు. జొన్నాడ మెయిన్ కాలువ నుంచి ఆలమూరు వచ్చే పంట కాలువ ఇటీవల పూర్తిగా మూసుకుపోయింది. దీంతో దిగువ ప్రాంతాల భూములకు సాగునీరు చేరక రైతులు ఇబ్బం దులు పడుతున్నారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన చింతలూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాస్‌కు తెలపడంతో ఆయన స్పందించారు. గురు వారం పంట కాలువను ఎక్స్‌కవేటర్‌తో శుభ్రం చేసే చర్యలు చేపట్టారు. సాగునీరు సక్రమంగా చేరేలా చర్యలు చేపట్టిన సాగునీటి సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌ను రైతులు అభినందించారు.



# నూతన ఆర్టీసీ సర్వీసులు ప్రారంభించిన ఎమ్మెల్యే



రావులపాలెం బస్ డిపోకు నూతనంగా వచ్చిన రెండు బస్సులను రావులపాలెం నుండి హైదరాబాదు రూటు నడిపేందుకు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జనసేన ఇన్‌ఛార్జ్ బండారు శ్రీనివాస్‌లు శుక్రవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గుత్తుల రాంబాబు, చిలువూరి సతీష్‌రాజు, జక్కంపూడి వెంకటస్వామి, మైగపుల గురవయ్యనాయుడు, పెచ్చేటి చిన్నారావు, అంబటి కిషోర్ మరియు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# నందిగామ మున్సిపాలిటీకి మహర్దశ

**●పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన తంగిరాల సౌమ్య**



నందిగామ (చైతన్యరథం): మున్సిపాలిటీకి మహర్దశ పట్టనుందని, ఇందుకు సంబంధించి కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలను చేపట్టిందని నియోజకవర్గ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య వ్యాఖ్యానించారు. ఈ ఆర్థిక సంవత్సరం నుంచి మున్సిపాలిటీల నిధులను సొంత ఖర్చులకే వినియోగించుకునే వెసులుబాటును కూటమి ప్రభుత్వం కల్పించిందన్నారు. ఇకపై మున్సిపాలిటీల్లో పూర్తిస్థాయిలో వసతుల కల్పనపై దృష్టి సారించనున్నామని తెలిపారు. నందిగామ పట్టణంలోని అన్ని వార్డులను అభివృద్ధి చేసేందుకు ఆరునెలల కాలంలోనే ఒక కోటి 70 లక్షలు మంచినీటి సరఫరాకు, ఒక కోటి 30 లక్షలు రోడ్లకు, కోటి రూపాయలు పారిశుధ్య పనులకు నిధులు కేటాయించడం జరిగిందని తంగిరాల సౌమ్య తెలిపారు.

శుక్రవారం పలు వార్డుల్లో బీటీ, సీసీ రోడ్లు మరియు ఆర్‌సీసీ డ్రైన్లు, మంచినీటి సరఫరాకు వాల్స్, పైప్ లైన్ల పునరుద్ధరణ వంటి సుమారు పది అభివృద్ధి పనులను జనరల్ మరియు 15వ ఆర్థిక సంఘం నిధులతో శంకుస్థాపన కార్యక్రమాలను కూటమి నేతలు, అధికారులతో కలసి చేపట్టారు.

అనంతరం ఆమె మాట్లాడుతూ... నందిగామ పట్టణంలోని అన్ని వార్డుల్లో మౌళిక వసతులు కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. తాగునీరు, డ్రైనేజీలు, సీసీరోడ్ల నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని తంగిరాల సౌమ్య మునిసిపల్ అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనులు నాణ్యతతో చేపట్టాలని ఆదేశించారు. ఏ మున్సిపాలిటీ నిధులను ఆ ప్రాంతంలోనే అభివృద్ధి పనులకు వినియోగించుకునేలా కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని, దీంతో నందిగామ మున్సిపాలిటీ మరింతగా ఆర్థిక పరిపుష్టి సాధించే అవకాశం ఉందన్నారు.

# అధినేతకు స్వాగతం పలికిన దేగల

గుంటూరు నగరంలోని చేబ్రోలు హనుమయ్య కంపెనీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నారెడ్కో ప్రోపర్టీ షోలో పాల్గొనేందుకు విచ్చేసిన నవ్యాంధ్ర రూపకర్త, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని హెలిపాడ్ వద్ద మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికిన ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దేగల ప్రభాకర్.



# గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసమే పల్లె పండుగ

**● వెల్లడించిన జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య**



జగ్గయ్యపేట (చైతన్యరథం): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసమే పల్లె పండుగ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుందని శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య వ్యాఖ్యానించారు. పల్లెలే దేశానికి పట్టుకొమ్మలు అనే నినాదంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జగ్గయ్యపేట మండలంలోని షేర్ మహమ్మద్ పేట గ్రామంలో రూ. 2,30,000 ఉమ్మడి వెంకటేశ్వర్లుకి చెందిన గోకులంన, షేర్ మహమ్మద్ పేట క్రాస్ రోడ్డు మారుతి నగర్‌లో రూ. 25లక్షలతో నిర్మించిన డ్రైనేజీ, సీసీ రోడ్డును కూటమి నాయకులతో కలిసి శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నారని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలకు కేటాయించిన నిధులను దారి మళ్లించారని ఆరోపించారు. నేడు ఆ పరిస్థితి లేదన్నారు. అభివృద్ధి ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు మరియు అధికారులు పాల్గొన్నారు.

# పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి : గద్దె రామమోహన్

**● 100 మంది పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రాలు అందజేత**



విజయవాడ (చైతన్యరథం): నగర పాలక సంస్థలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటుగా కార్పొరేషన్‌కు అవార్డులు తీసుకురావడంలో పారిశుధ్య కార్మికుల పాత్ర కీలకమని అన్నారు. శుక్రవారం ఉదయం తూర్పు నియోజకవర్గ పరిధిలోని 3వ డివిజన్‌లో గాలి వెంకట రవికుమార్ కుమార్తె గాలి లక్ష్మీ అలేఖ్య 28వ జయంతి సందర్భంగా 3వ డివిజన్‌లో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులు 100 మందికి నూతన వస్త్రాలు అందచేసే కార్యక్రమం జరిగింది. తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ అతిధిగా హాజరై పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రాలను అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ... కరోనా సమయంలో పారిశుధ్య కార్మికులు చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. పారిశుధ్య కార్మికులతో పాటుగా అధికారులు కూడా కరోనా సమయంలో రోడ్లపై తిరుగుతూ సేవలు అందించారని చెప్పారు. వైద్యులు, పోలీసులుతో పాటుగా కొన్ని విభాగాలకు చెందిన సిబ్బంది, అధికారులు మాత్రమే కరోనా సమయంలో ధైర్యంగా విధులు నిర్వహించారని అన్నారు. కరోనా సమయంలో కూడా పారిశుధ్య కార్మికులు ఇంటింటికి తిరుగుతూ చెత్తను వ్యర్థాలను సేకరిస్తూ ధైర్యంగా విధులు నిర్వహించారని అన్నారు.

**సీఎంఆర్‌ఎఫ్ చెక్‌లు అందజేత**

రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ ఆరోగ్యంతో పాటుగా ప్రతి కుటుంబం సంతోషంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు లక్ష్యమని గద్దె రామమోహన్ చెప్పారు. శుక్రవారం ఉదయం 6వ డివిజన్‌కు చెందిన వంకల లోవరాజుకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ.1,27,076 ఎల్‌వోసిని అందజేశారు. 11వ డివిజన్‌కు చెందిన నారాయణపురం సూరిబాబుకు రూ.7,500 విలువ చేసే ఇస్త్రీ పెట్టెను గద్దె రామమోహన్ తన సొంత నిధులతో కొనుగోలు చేసి సూరిబాబుకు ఉచితంగా అందజేశారు.

# స్వచ్ఛ నగరాల జాబితాలో గుంటూరు చేరాలి : ఎమ్మెల్యే గళ్లామాధవి

**●రూ. 6.60 కోట్లతో గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన**



గుంటూరు (చైతన్యరథం): స్వచ్ఛ నగరాల జాబితాలో గుంటూరు చేరటమే లక్ష్యంగా తాము పని చేస్తున్నామని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. శుక్రవారం గుంటూరు ఏటుకూరు రోడ్డు కంపోస్ట్ యార్డ్ నందు గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్‌కు ఎమ్మెల్యే గళ్ళా మాధవి, కమిషనర్ పులి శ్రీనివాసులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ.... ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర లక్ష్యంగా ముందుకు వెళు తుందన్నారు. ఎక్కడ కూడా చెత్త పేరుకుపోకుండా ఉండటానికి దీనిని ఏర్పాటు చేయటం జరిగిందని, ఇంటినుండి నేరుగా సేకరించిన తడిచెత్త, పొడిచెత్తను ఇక్కడే వేరుచేసి జిందాల్, మీదేన్ గ్యాస్ ప్లాంట్‌కు 120 మెట్రిక్ టన్నుల చెత్తను తరలించడం జరుగుతుందన్నారు. హైదరాబాద్, వైజాగ్, తిరుపతి తదితర మహానగరాల్లో ఈ ప్రక్రియ జరుగుతుందని, స్వచ్ఛ నగరాలలో మన గుంటూరు చేరాలంటే గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్ ప్రక్రియ ద్వారానే సాధ్యమన్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి రెండు గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్‌లు రాబోతున్నాయని, తొలిస్టేషన్‌కు శుక్రవారం శంకుస్థాపన చేయటం జరిగిందన్నారు. చెత్త రహిత నగరంగా గుంటూరు తయారు కావాలనే లక్ష్యంతో, ఈ స్టేషన్‌ను రూ. 6కోట్ల 60 లక్షలతో 15వ స్థాయి సంఘ నిధులతో నిర్మించబోతున్నామని తెలిపారు. వచ్చే నాలుగు నెలల కాలంలో ఈ స్టేషన్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రాబోతున్నామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు.

# రియల్ ఎస్టేట్ అభివృద్ధి చెందితేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

**● విజయవాడ క్రెడాయ్ ప్రాపర్టీ షోలో స్టాల్స్‌ను ప్రారంభించిన ఎంపీ కేశినేని శివనాథ్**



విజయవాడ (చైతన్యరథం): హైదరాబాద్, బెంగుళూర్‌లతో పాటు మెట్రోపాలిటన్ నగరాల్లో రియల్ ఎస్టేట్ రంగం వల్లే అభివృద్ది చెందాయని, రాష్ట్రంలో గత ఐదారేళ్లుగా రియల్ ఎస్టేట్ రంగం కుదేలైపోయిందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ వ్యాఖ్యానించారు. భవన నిర్మాణ రంగం అభివృద్ది చెందితేనే రాష్ట్రం ప్రగతి పథంలో పయనిస్తుందన్నారు. అందుకే రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం వేగం పుంజుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణాలు, లే అవుట్ల అనుమతులను సులభతరం చేస్తూ జీవోలు జారీ చేసిందని విజయవాడ ఎంపీ శివనాథ్ తెలిపారు. విజయవాడ ఎస్.కన్వెన్షన్‌లో మూడు రోజుల పాటు నిర్వహించే క్రెడాయ్ ప్రాపర్టీ షో ప్రారంభోత్సవ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ క్రెడాయ్ ప్రాపర్టీ షో ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ, మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు బోడే ప్రసాద్, బొండా ఉమామహేశ్వరరావు, గద్దె రామ్మోహన్‌లతో కలిసి ఎంపి కేశినేని శివనాథ్ పాల్గొన్నారు. మంత్రి నారాయణ, ఎమ్మెల్యే బోడే ప్రసాద్‌తో కలిసి పి.వి.ఆర్ గ్రూప్ బ్రోచర్ ఆవిష్కరించారు. అనంతరం ఎంపి కేశినేని శివనాథ్ ప్రాపర్టీ షోలో ఏర్పాటు చేసిన అన్ని స్టాల్స్‌ను ప్రారభించారు. అనంతరం ఎంపి కేశినేని శివనాథ్ మాట్లాడుతూ... మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో వుండే విధంగా ఈ ప్రాపర్టీ షోను ఏర్పాటు చేసిన క్రెడాయ్ వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ అభివృద్ధి చెందటానికి ముఖ్యకారణం ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు చేసిన కృషే కారణమన్నారు. 1995కి ముందు హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగం ఏ విధంగా వుండేదో అందరికీ తెలుసునని, ఆనాడు హైదరాబాద్‌లో ఐటీ, ఫార్మా ఇండస్ట్రీ అభివృద్ధి చేయటం వల్లే రియల్ ఎస్టేట్ రంగం వృద్ది చెందిందని గుర్తు చేశారు. హైదరాబాద్‌లో మౌలిక సదుపాయాలు కల్పించటం వల్లే వ్యాపార రంగంతో పాటు నిర్మాణ రంగం వృద్ది చెందిందన్నారు. రాష్ట్ర విభజన తర్వాత చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా రాష్ట్రాభివృద్ధికి పునాదులు వేయగా... గత ప్రభుత్వం నిర్మాణ రంగాన్ని నాశనం చేసిందన్నారు. దీంతో గత ఐదేళ్లుగా ఏపీలో రియల్ ఎస్టేట్ రంగం కుదేలు అయిపోయిందని, భవన నిర్మాణ రంగంలో పనులు లేక కార్మికులు ఎన్నో ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్ని చర్యలు తీసుకుంటున్నారన్నారు. వభవన నిర్మాణ కార్మికుల కోసం రాష్ట్రంలో ఎన్.ఎ.సి (నేషనల్ అకాడమీ ఆఫ్ కనస్ట్రక్షన్) ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావుతో కలిసి సీఎం చంద్రబాబును కోరినట్లు తెలిపారు.

జోన్-4
(ఒంగోలు, నెల్లూరు, రాజంపేట, తిరుపతి, చిత్తూరు)
చైతన్యరథం

# నరసింహకొండపై మంత్రి నారాయణ దంపతులు

**వేదమంత్రాలతో పూర్ణకుంభ స్వాగతం - రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని మంత్రి ఆకాంక్ష**





నెల్లూరు, (చైతన్యరథం): ప్రముఖ పుణ్యక్షేత్రం నరసింహకొండపై వెలసిన శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహస్వామి వారిని శుక్రవారం రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ, ఆయన సతీమణి రమాదేవి దర్శించుకున్నారు. శుక్రవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్వామివారిని మంత్రి నారాయణ దంపతులు ఉత్తర ద్వార నుండి దర్శనం చేసుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి గోపి శర్మ, అధికారులు, అర్చక స్వాములు వేదమంత్రాలు మంగళ వాయిద్యాలు నడుమ నారాయణ దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారి సన్నిధిలో మంత్రి నారాయణ ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు, వేదపండితులు స్వామివారి తీర్థ ప్రసాద వినియోగాలను అందించి వేద ఆశీర్వచనాలు అందించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ 1979 నుండి ప్రతి ఏడాది ముక్కోటి ఏకాదశి రోజున తన కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారికి ఉభయం సమర్పించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. ఆలయంలో పలు మరమ్మత్తులకు పెయింట్లకు సంబంధించిన వివరాలను ఈవో గోపి శర్మ, అర్చక స్వాములు మంత్రి దృష్టికి తీసుకురాగా అందుకు సంబంధించిన ఎస్టిమేషన్లను సిద్ధం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఓఎస్డీ వెంకటేశ్వర్లు, మాజీ జడ్పీటీసీ విజేత, వీర బ్రహ్మ గుప్తా, కళ్యాణి గుప్తా, మంత్రి కుటుంబ సభ్యులు వెన్నెల తదితరులు పాల్గొన్నారు.

### గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో

# కన్నీళ్ళు పెట్టిన పల్లెలు

**అభివృద్ధికి నోచుకోని గ్రామాలు - మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి**




మార్కాపురం, (చైతన్యరథం) : ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగస్తులు రైలు పట్టాలు లాంటి వారని ఒకరికి ఒకరు సహకరించుకోవాలని, తద్వారా నియోజకవర్గంలో అభివృద్ధి సాధించవచ్చునని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం జరిగిన మార్కాపురం మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. మొదటిగా వివిధ శాఖల అధికారులు తమ శాఖల అభివృద్ధి నివేదికను చదివి వినిపించారు. అనంతరం మార్కాపురం ఎమ్మెల్యే కందుల మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో ఒకటో తేదీన ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేదని కానీ ఇప్పటి ప్రభుత్వం ఒకటో తేదీనే అంది అని ఇది గమనించాలి అని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ బాబు సర్పంచులకు తగిన గౌరవం ఇవ్వాలని సూచించారన్నారు. గత ప్రభుత్వంలో సర్పంచులను పూచిక పుల్లగా తీసివేసి ఒక్క రూపాయి కూడా సర్పంచులకు ఇవ్వలేదన్నారు. కానీ ఇప్పటి ప్రభుత్వం సర్పంచులకు తగిన నిధులు విడుదల చేసింది అన్నారు. సర్పంచులు కూడా ఆ నిధులను మొదటిగా త్రాగునీరు, శానిటేషన్, జంగల్ క్లియరెన్స్‌లకు వాడాలని మిగిలిన నిధులను గ్రామ అభివృద్ధికి ఖర్చు చేయాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు కష్టపడి పని చేసి ఈ ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని కోరారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు, గ్రామ సర్పంచ్ లు, ఎంపీటీసీలు, ఎంపీపీ, జడ్పీటీసీలు పాల్గొన్నారు.

### వైకుంఠ ఏకాదశి సందర్భంగా

# గోపాలనగర్‌లో ఘనంగా గోపూజ

**కళకళలాడిన పుట్టచెట్టు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం - పాల్గొన్న ఏపీ పర్యాటకాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ**





ఒంగోలు, (చైతన్యరథం) : వైకుంఠ ఏకాదశి సందర్భంగా ప్రకాశం జిల్లా గోపాల నగర్‌లో శుక్రవారం గోపూజ ఘనంగా నిర్వహించారు. గుమ్మపూడి హనుమంతరావు, ఆలయ ధర్మకర్త ఎద్దేటి వెంకట సుబ్బారావు సహా ప్రముఖులంతా కలిసి ప్రతి సంవత్సరం ఈ గోపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పర్యాటకాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ పాల్గొన్నారు. ముక్కోటి పర్వదినం హిందువులకు చాలా ప్రతిష్ఠాత్మకమైన రోజు కావడంతో గ్రామాల్లోని దేవాలయాలలో, ఇళ్ళలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకుంటారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో కూడా ఈ ముక్కోటి పండుగను వైభవంగా నిర్వహిస్తారు. గత 10 సంవత్సరాలుగా గోపాల్ నగర్‌లో ఈ గోపూజ కార్యక్రమాన్ని ఆనవాయితీగా, శాస్త్రోక్తంగా క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారని ఇది చాలా గొప్ప విషయం అని నూకసాని కొనియాడారు. 1972లో మొదటిసారిగా చిన్నతనంలో గోపాల్ నగరానికి తిరుణాల సందర్భంగా వచ్చినప్పటి నుండి ఇక్కడితో సన్నిహిత సంబంధాలు ఏర్పడ్డాయని చిన్ననాటి స్మృతులను నూకసాని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు నూకసాని బాలాజీ చేతుల మీదుగా వచ్చిన మహిళా భక్తులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాకులు తుమ్మపూడి హనుమంతరావు, ఆలయ ధర్మకర్త ఏద్దేటి సుబ్బారావు, గోపాల్ నగర్ వాసులు, ప్రత్యేకించి మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



**ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా తిరుమలలో శ్రీ వెంకటేశ్వర స్వామిని సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి శనివారం వైకుంఠ ద్వారం నుంచి దర్శించుకున్నారు. శ్రీవారి ఆశీస్సులతో ప్రజలందరూ సంతోషంగా ఉండాలని సోమిరెడ్డి ఆకాంక్షించారు.**





# మాట నిలబెట్టుకున్న చంద్రబాబు

**తొక్కిసలాట బాధితులకు వైకుంఠ ద్వార దర్శనం**

తిరుపతి, (చైతన్యరథం): తిరుపతి పట్టణంలో జరిగిన తొక్కిసలాటలో గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందిస్తున్నారు. అంతేచకాకుండా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట ప్రకారం వారికి వైకుంఠ ఏకాదశి నాడు తిరుమల శ్రీవారి ఉత్తర ద్వార దర్శన భాగ్యం కల్పించారు.

# 12న సీఎం తిరుపతి పర్యటన

**- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్**



తిరుపతి, (చైతన్యరథం) : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల 12వ తేదీన తిరుపతి జిల్లాలో పర్యటిస్తారు. ఈ సందర్భంగా పట్టణంలో పలు కార్యక్రమాల్లో పాల్గొననున్న నేపథ్యంలో సీఎం కార్యక్రమాల సమన్వయకర్త పెందుర్తి వెంకటేశ్వర్ రావు, జేసీ బన్సల్, మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ మౌర్య సంబంధిత అధికారులతో కలిసి సీఎం పర్యటించే ప్రదేశాలను శుక్రవారం కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. అంతకు మునుపు స్థానిక కలెక్టరేట్ మిని సమావేశ మందిరంలో కలెక్టర్ అధికారులతో సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేస్తూ అధికారులు అందరూ సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు, ఆర్డీవో తిరుపతి రామ్మోహన్, జిల్లా పంచాయతీ అధికారిణి సుశీల దేవి, జిల్లా సివిల్ సప్లై అధికారులు రాజు, ఎస్‌ఈ మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ తదితరులు పాల్గొన్నారు.

### ఇది కూటమి ప్రభుత్వం

# పనులు సక్రమంగా జరగాలి

**- గత వైసీపీ సర్కారు మాదిరి కాదు**

**- ఉద్యోగులను హెచ్చరించిన ఎమ్మెల్యే దామచర్ల**



ఒంగోలు, (చైతన్యరథం) : ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు శుక్రవారం కొత్తపట్నం గ్రామంలో పర్యటించారు. నూతనంగా నిర్మించిన గోకులం షెడ్స్‌ను ప్రారంభించారు. పక్కన ప్రకృతి వ్యవసాయం చేస్తున్న విధానాలను స్థానిక అధికారులును అడిగి తెలుసుకున్నారు. తదుపరి మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ తాను ఈ సమావేశంలో మొదటిసారిగా పాల్గొన్నానన్నారు. అధికారులు అంతా చాలా వరకు కొత్త వారు వచ్చారని గత ప్రభుత్వం మాదిరి కాకుండా ప్రజల సమస్యలు పరిష్కరించే విధంగా అంతా పని చేయాలనీ అధికారులకు సూచించారు. పంచాయతీ కార్యదర్శులు అందరూ గ్రామాలలో పండగ సందర్భంగా త్రాగునీరు, పారిశద్యం పనులు, వీధిలైట్లు పనిచేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమం అనంతరం పాదర్తి గ్రామంలో టీడీపీ నాయకులు ముగా పోలరాజును పరామర్శించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, మండల అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ప్రతిఒక్కరు చేనేత వస్త్రాలు ధరించండి

◆చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత పిలుపు

◆ఆప్కో షోరూమ్‌ను పరిశీలించిన మంత్రి, ఎంపీ

కర్నూలు (చైతన్యరథం): ప్రతిఒక్కరు చేనేత వస్త్రాలు ధరించి, చేనేతలను ఆదుకుందామని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖా మంత్రి ఎస్.సవిత పిలుపునిచ్చారు. కర్నూలు నగరంలో శుక్రవారం ఆప్కో షోరూమ్‌ను కర్నూల్ ఎంపీ నాగరాజుతో కలసి మంత్రి సవిత పరిశీలించారు. ఏయే వస్త్రాలు అందుబాటులో ఉన్నాయని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అమ్మకాలు రోజూ ఏమేర జరుగుతున్నాయని ఆరా తీశారు. ఏ వ్యాపారికైనా కస్టమర్లే దేవుళ్లని, వారితో హుందాగా వ్యవహరించాలని సిబ్బందికి మంత్రి సవిత దిశా నిర్దేశం చేశారు. సంక్రాంతి పండుగకు ప్రతిఒక్కరు చేనేత వస్త్రాలు ధరించాలని మంత్రి తెలిపారు. చేనేత వస్త్రాలు ధరించి చేనేతలను కష్టాల నుండి విముక్తి చేద్దామని ఎంపీ నాగరాజు అన్నారు. ఈ సందర్భంగా షో రూమ్‌లో ఎంపీ నాగరాజు చేనేత వస్త్రాలను కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# బీసీల పక్షపాతి సీఎం చంద్రబాబు

◆టీడీపీతోనే బీసీలకు రాజ్యాధికారం


◆నేడు ఓబన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిద్దాం

◆పుట్టపర్తి ఎమ్మెల్యే సింధూరరెడ్డి స్పష్టీకరణ



పుట్టపర్తి (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బీసీల పక్షపాతి అని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి అభివర్ణించారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపధ్యక్షులు నందమూరి తారక రామారావు పార్టీని ప్రారంభించి బీసీల్లో రాజకీయ చైతన్యం తీసుకొచ్చారని తెలిపారు. అదే బాటలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పయనిస్తున్నారని పేర్కొన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విశ్వకర్మ, వాల్మీకి, కనకదాస జయంతి వేడుకలను ప్రభుత్వం రాష్ట్ర పండుగలు నిర్వహిస్తోందన్నారు. తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల విజయంలో వడ్డెర్ల పాత్ర కృషి ఎనలేనిదనీ మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. వడ్డెర కులస్తులు టీడీపీకి ఆదినుంచి వెన్నుదన్నుగా నిలిచారని కొనియాడారు. ఎన్నికల్లో కూటమి పార్టీల అభ్యర్థుల విజయానికి వడ్డెర్లు తమ వంతు పాత్ర పోషించారని వెల్లడించారు. వడ్డెర్లను గుర్తించిన కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

ఒక అడుగు ముందుకేసి వడ్డెర్ల ఆరాధ్య దైవమైన తొలి తరం సాతంత్య సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతి వేడుకలను శనివారంనాడు రాష్ట్రవ్యాప్తంగా కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో అన్ని జిల్లా కలెక్టరేట్లలో ఘనంగా నిర్వహిస్తోందని తెలిపారు. పుట్టపర్తిలో జరిగే వడ్డే ఓబన్న జయంతి వేడుకలకు వడ్డెర కులస్తులందరూ హాజరై విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పిలుపునిచ్చారు.



రాష్ట్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ కుమార్తె రిసెప్షన్‌కు హాజరై నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేసిన పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

# పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

◆ఎమ్మెల్యే పరిటాల సునీత స్పష్టీకరణ

◆గోకులం షెడ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే

◆మంజూరైన ప్రతి షెడ్డు నిర్మించాల్సిందే



రాప్తాడు (చైతన్యరథం): పాడిపశువుల సంరక్షణ రైతుకు భారం కాకుండా లాభదాయకంగా మారుస్తున్న ప్రభుత్వం ఇది అని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. కనగానపల్లి, రామగిరి మండలాల్లో నిర్మాణం పూర్తి చేసుకున్న గోకులం షెడ్లను శుక్రవారం ఆమె అధికారులు, రైతులు, టీడీపీ నాయకులతో కలసి ప్రారంభించారు. పల్లెపండుగ - పంచాయతీ వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా కనగానపల్లి మండలం ముత్తవకుంట్ల గ్రామంలో ఉపాధి హామీ నిధులతో నిర్మించిన గోకులం షెడ్డును ఆమె ప్రారంభించారు. అలాగే నిర్మాణంలో ఉన్న గోకులం షెడ్లను పరిశీలించారు. లబ్ధిదారులను అడిగి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఆ తర్వాత రామగిరి మండలం పాపిరెడ్డిపల్లి గ్రామంలో పూర్తైన రెండు గోకులం షెడ్లను స్థానిక మండల, పంచాయతీ నాయకులు, అధికారులతో కలసి ప్రారంభించారు. అనంతరం కుళ్లాయప్ప అనే రైతు సాగుచేసిన మొక్కజొన్న పంటను పరిశీలించారు. పంట అనుకున్న మేర దిగుబడి రాలేదని.. నష్టం వాటిల్లినట్టు రైతు వాపోయారు. వ్యవసాయశాఖ అధికారులతో మాట్లాడి పరిహారం వచ్చేలా చూస్తామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ ఒక పండుగ వాతావరణంలో గోకులం షెడ్ల ప్రారంభోత్సవం జరుగుతోందన్నారు. నేటి నుంచి వరుసగా మూడు రోజులపాటు ఈ ప్రారంభోత్సవాలు ఉంటాయన్నారు. కనగానపల్లి మండలంలో మొత్తం 109 షెడ్లు మంజూరు కాగా.. ఇప్పటికే 58 పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. ఒక్క ముత్తవకుంట్లలో 11 మంజూరైనట్టు వివరించారు. రామగిరి మండలంలో 56 మంజూరు కాగా 15 ఇప్పటికే పూర్తయ్యాయని, మిగిలినవి త్వరలోనే పూర్తిచేస్తారన్నారు. పాపిరెడ్డిపల్లిలో 6 షెడ్లు మంజూరు కాగా మూడు పూర్తైనట్టు తెలిపారు. ప్రభుత్వం రైతుల సంక్షేమానికి చొరవ తీసుకుంటోందన్నారు. గత ప్రభుత్వంలో మినీ గోకులం షెడ్లు నిర్మాణం చేపట్టి.. సరైన సమయంలో బిల్లులు చెల్లించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారన్నారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పాడి రైతుల్ని ప్రోత్సహించాలన్న ఉద్దేశ్యంతో గోకులం షెడ్లు పెద్దఎత్తున మంజూరు చేస్తున్నట్టు ఎమ్మెల్యే సునీత తెలిపారు. షెడ్లు మంజూరైనచోట సాంకేతి మంజూరు వచ్చిన వెంటనే జియో ట్యాగింగ్ తప్పనిసరిగా చేసి పనులు ప్రారంభించాలని సూచించారు. వంద శాతం టెక్నికల్ శాంక్షన్, జియో ట్యాగింగ్ చేయించాలన్నారు. భౌతికంగా పనులు పూర్తి అయినచోట అందుకు సంబంధించిన పనులను ఎప్పటికప్పుడు పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన నమూనా ప్రకారం గోకులం షెడ్ల నిర్మాణం జరగాలన్నారు. ఎవరైనా నిర్మాణాలు చేపట్టకపోతే.. అవి రద్దయ్యే అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వం ఎంతో మంచి ఉద్దేశ్యంతో చేపట్టిన ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సునీత సూచించారు.

# చెట్లు నరికే సంస్కృతి తగదు

◆అనంతపురం జిల్లా టీడీపీ వెంకటశివుడు యాదవ్ హితవు

శింగనమల (చైతన్యరథం): చెట్లు నరికివేసి యజమానుల ఆదాయానికి నష్టం కలిగించే సంస్కృతి తగదని అనంతపురం జిల్లా టీడీపీ వెంకటశివుడు యాదవ్ హితవు పలికారు. శింగనమల నియోజకవర్గం పుట్లూరు మండలం కొండుగారికుంట గ్రామానికి చెందిన టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సుదర్శన్ నాయుడు తోటలో వెయ్యికి పైగా అరటి చెట్లను గుర్తుతెలియని వ్యక్తులు నరికివేశారు. ఈ విషయం తెలుసుకున్న అనంతపురం జిల్లా టీడీపీ అధ్యక్షులు వెంకట శివుడు యాదవ్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు శుక్రవారం అరటిచెట్లు నరికివేసిన తోటను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కన్నబిడ్డల్లా పెంచుకున్న అరటి చెట్లను నరికి వేయడం చాలా దారుణం అన్నారు. ఇలాంటి ఘాతుకానికి పాల్పడిన వారిని పోలీసులు కఠినంగా శిక్షించాలాన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు బాలరంగయ్య, శ్రీరామరెడ్డి, శివశంకరరెడ్డి, బాబు తదితరులు పాల్గొన్నారు.





# గోకులం షెడ్‌ను ప్రారంభించిన మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి

మడకశిర (చైతన్యరథం): మడకశిర మండల పరిధిలోని బుళ్ళసముద్రం గ్రామంలో శుక్రవారం గంగరత్నం అనే మహిళా రైతు గోకులం షెడ్‌ను మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ప్రారంభించారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా రూ. 1.85 లక్షలతో గోకులం షెడ్‌ను నిర్మించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ రైతాంగానికి తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం రైతాంగానికి పెద్దపీట వేస్తున్నదని తెలిపారు. నియోజకవర్గంలో ఎన్డీఏ ప్రభుత్వంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ జైపాల్, కల్లుమరి సర్పంచ్ నాగరాజు, కౌన్సిలర్ ఉమాశంకర్, తెలుగు యువత నాయకుడు తిమ్మరాజు, క్లస్టర్ ఇంచార్జ్ నరేష్ కన్నా , రవీంద్రారెడ్డి , మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ రఘురాం, బిజెపి నాయకుడు చంద్రశేఖర్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.



# టీడీపీ సభ్యత్వంతో కార్యకర్తలకు ఆర్థిక భరోసా

◆బద్వేల్ నియోజకవర్గ సమన్వయకర్త రితీష్‌రెడ్డి స్పష్టీకరణ

బద్వేల్ (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ సభ్యత్వం పొందిన వారికి ఆర్థిక, బీమా సౌకర్యాలు ఉంటాయని బద్వేల్ నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త రితీష్‌రెడ్డి తెలిపారు. బద్వేల్ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం బద్వేల్ నియోజకవర్గ సమన్వయకర్త, యువ నాయకుడు రితీష్‌రెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు బోవిల్ల అమర్నాథ్‌రెడ్డి, పొన్నవోలు సాంబశివారెడ్డిల సమక్షంలో లక్ష రూపాయలతో శాశ్వత సభ్యత్వం నమోదు చేసుకున్నట్లు అట్లూరు మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు బోవిల్ల నందగోపాల్‌రెడ్డి, అట్లూరు మండల పార్టీ అధ్యక్షుడు పాపుదిప్పు మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. అట్లూరు మండల క్రియాశీల నాయకులు అరవ శ్రీనివాసులురెడ్డి, మండల ఎంపీపీ ఇంచార్జ్ పోతిరెడ్డి కూడా సాయంత్రం నియోజకవర్గ ఇన్చార్జ్ రితీష్‌రెడ్డి సమక్షంలో సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా రితీష్ రెడ్డి మాట్లాడుతూ శాశ్వత సభ్యత్వం పొందిన సభ్యులు పార్టీలో ఎప్పుడూ సభ్యులుగా ఉంటారని తద్వారా పార్టీకి కూడా బలం అన్నారు. అలాగే సభ్యత్వం పొందిన కుటుంబాలకు ఆర్థిక భరోసా ఉంటుందని చెప్పారు. పార్టీ అభివృద్ధికి కృషి చేయడంతో పాటు కూటమి నాయకులందర్నీ కలుపుకొని ముందుకు సాగాలన్నారు. బద్వేల్ నియోజకవర్గంలో భారీ సంఖ్యలో కార్యకర్తలు సభ్యత నమోదు చేసుకోవాలని రితీష్‌రెడ్డి పిలుపునిచ్చారు.

# ఇక రైలు ప్రమాదాలకు చెక్!

◆ పది వేల లోకోమోటివ్‌ల్లో 'కవచ్' ఏర్పాటుకు చర్యలు

◆ రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ స్పష్టీకరణ



చెన్నై: రైల్వే ప్రమాదాలకు అడ్డుకట్ట వేసేందుకు దేశవ్యాప్తంగా అన్ని రైళ్లల్లో ఆటోమేటిక్ రైలు రక్షణ వ్యవస్థ (ఏటీపీ) 'కవచ్'ను తీసుకువచ్చేందుకు కేంద్రం చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా 10వేల లోకోమోటివ్‌ల్లో ఈ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. 15 వేల కిలోమీటర్ల మేర ట్రాక్ సైడ్ ఫిట్టింగ్‌లు చేయడంతో పాటు ఇంజిన్ల ముందు కెమెరాలు అమర్చుతున్నామన్నారు. కొత్తగా డిజైన్ చేసిన బోల్ట్‌లను బిగిస్తున్నారని, వీటిని బయటకు తీయడం సాధ్యం కాదని వెల్లడించారు. తమిళనాడు రాజధాని చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీని సందర్శించిన సందర్భంగా మంత్రి ఈ విషయాలను వెల్లడించారు. ఇటీవల తరచూ కొందరు దుండగులు పట్టాలపై ఎల్పీజీ సిలిండర్లు, సైకిళ్లు, ఇనుప రాడ్లు, సిమెంట్ ఇటుకలను పెట్టి రైలుకు ప్రమాదం తలపెట్టేలా దుశ్చర్యలకు పాల్పడుతున్న సంఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రైలు ప్రయాణాన్ని సురక్షితంగా మార్చేందుకు కేంద్రం ఈ చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు.

"విస్టాడోమ్ కోచ్‌ల్లో కొన్ని మార్పులు చేశాం.. పర్యాటకులను దృష్టిలో ఉంచుకొని సౌకర్యాలను మెరుగుపరిచాం. పనోరమిక్ వ్యూలను ఆస్వాదిస్తూనే ప్రయాణికులు వాటిలో డిన్నర్ చేయొచ్చు. రాబోయే రోజుల్లో ఈ నూతన కోచ్‌లను జమ్మూకశ్మీర్ సర్వీసుల్లో ప్రవేశపెడతాం. ఇక అమృత్ భారత్ రైలు జనరల్ కోచ్లోను ప్రీమియం కోచ్ ఉన్న సదుపాయాలు ఉంటాయి. వందేభారత్ తో రైళ్లలో నిరంతరం సౌకర్యాలను మెరుగుపరుస్తూనే ఉంటాం" అని మంత్రి తెలిపారు.

ఇదిలావుండగా కవచ్ రక్షణ వ్యవస్థ ప్రధానంగా జీపీఎస్ ఆధారంగా పనిచేస్తుంది. పట్టాలపై వస్తువులు ఉంటే.. రెడ్ సిగ్నల్‌ను పట్టించుకోకుండా లోకో పైలెట్ రైలును ముందుకు నడిపితే కవచ్ వ్యవస్థ అప్రమత్తం చేసి, బ్రేకును తన నియంత్రణలోకి తెచ్చుకొని ప్రమాదాలను నియంత్రిస్తుంది. నిర్ణీత వేగాన్ని మించి రైలు ప్రయాణించడాన్ని కూడా ఇది అనుమతించదు.



## ఉత్తరాదిన కమ్మేసిన పొగ మంచు

◆ పలు వాహనాలు ఒకదానినొకటి ఢీకొని ధ్వంసం

న్యూఢిల్లీ: గత కొద్ది రోజులుగా చలి తీవ్రతకు ఉత్తరభారతం వణుకుతోంది. దేశ రాజధాని ఢిల్లీతోపాటు యూపీ, పంజాబ్, జార్ఖండ్, హర్యానా, కాశ్మీర్, పశ్చిమబెంగాల్ సహా పలు రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు పడిపోవడంతో చలి తీవ్రత పెరిగింది. ఆయా ప్రాంతాలను దట్టమైన పొగ కమ్మేసింది. ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో పొగమంచు కారణంగా ఢిల్లీ - లక్నో జాతీయ రహదారిపై పలు వాహనాలు ఒకదానికొకటి ఢీకొని ధ్వంసమయ్యాయి.

శుక్రవారం ఉదయం ఢిల్లీ - ఎన్సీఆర్ ప్రాంతాన్ని దట్టమైన పొగమంచు కమ్మేసింది. ఫలితంగా దృశ్యమానత దారుణంగా పడిపోయింది. కొన్ని ఏరియాల్లో విజిబిలిటీ జీరోగా నమోదైంది. ఈ కారణంగా ముందు వెళ్తున్న వాహనాలు కనిపించని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. దీంతో ఉదయం ఢిల్లీ - లక్నో జాతీయ రహదారిపై ఆరుకు పైగా కార్లు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆ కార్లు పూర్తిగా దెబ్బతినగా, పలువురు స్వల్ప గాయాలతో బయటపడినట్లు సమాచారం. ఆ రహదారిపై ట్రాఫిక్ కూడా స్తంభించింది. రంగంలోకి దిగిన అధికారులు ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.





## మధ్యప్రదేశ్ మాజీ ఎమ్మెల్యే ఇంట్లో తనిఖీలు.. మొసళ్లు లభ్యం

◆ ఐటీ అధికారుల షాక్!

భోపాల్: మధ్యప్రదేశ్‌కు చెందిన బీజేపీ మాజీ ఎమ్మెల్యే హరివంశ్ సింగ్ రాథోడ్ ఇంట్లో ఆదాయపన్ను శాఖ అధికారులు తనిఖీలు చేస్తుండగా ఓ సంఘటనతో ఉలిక్కిపడ్డారు. బంగారం, కోట్ల నగదు, బినామీ కార్లతో పాటు ఆ ఇంట్లో మూడు మొసళ్లను అధికారులుగుర్తించారు. మాజీ ఎమ్మెల్యే రాథోడ్‌తో పాటు మాజీ కౌన్సిలర్ రాజేశ్ కేశర్వాని నివాసాల్లో గత ఆదివారం నుంచి ఐటీశాఖ సోదాలు చేస్తున్నాయి. సుమారు 155 కోట్ల పన్ను ఎగవేసినట్లు తెలుస్తోంది. ఆ మాజీ ఎమ్మెల్యే ఇంటి నుంచి మూడు కోట్ల నగదుతో పాటు బంగారం, వెండి ఆభరణాలను సీజ్ చేశారు. వాటి విలువ కోట్లల్లో ఉంటుందని భావిస్తున్నారు.

రాథోడ్, కేశర్వాని వీరిద్దరూ బీడీ వ్యాపారం చేసేవారు. అయితే కేశర్వాని సుమారు 140 కోట్ల పన్ను ఎగవేసినట్లు తెలిసింది. దానికి సంబంధించిన డాక్యుమెంట్లను తనిఖీల సమయంలో గుర్తించారు. ఆయన నిర్మాణ రంగ వ్యాపారంలో కూడా ఉన్నారు. అయితే మాజీ ఎమ్మెల్యే రాథోడ్ ఇంటికి వెళ్లిన ఐటీశాఖ అధికారులు ఆశ్చర్యానికి గురయ్యారు. ఆయన ఇంట్లో ఉన్న ఓ చిన్నపాటి కుంటలో మూడు మొసళ్లను గుర్తించారు. దీంతో వారు అటవీ శాఖను అప్రమత్తం చేశారు. అలాగే కేశర్వాని ఇంట్లోనూ పలు బినామీ దిగుమతి కార్లను గుర్తించారు. ఒక్క కారు కూడా కేశర్వాని కుటుంబం పేరిట రిజిస్టర్ కాలేదు. ట్రాన్స్‌పోర్టు శాఖ నుంచి కార్లకు చెందిన సమాచారాన్ని సేకరిస్తున్నారు. ఆ కార్లను ఎలా కొన్నారన్న కోణంలో విచారణ కొనసాగిస్తున్నారు. సాగర్ జిల్లాలో మాజీ ఎమ్మెల్యే రాథోడ్ తౌలత వ్యాపారం చేసేవాడు. 2013 అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. జిల్లా చీఫ్ పోస్టు కోసం కూడా ఆయన పోటీపడ్డారు.

## యూపీలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురి హత్య

మీరట్: ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ జిల్లాలో దారుణ సంఘటన జరిగింది. ఒకే కుటుంబానికి చెందిన అయిదుగురు హత్యకు గురయ్యారు. భర్త, భార్య, ముగ్గురు కుమార్తెలు దారుణంగా హత్యకు గురైనట్లు పోలీసులు వెల్లడించారు. లిసారి గేట్ పోలీసు స్టేషన్ పరిధిలోని సోహెల్ గార్డెన్‌లో ఈ విషాద ఘటన జరిగింది. ఇంట్లోనే అయిదుగురి మృతదేహాలను వెలికితీశారు. భర్త మొయిన్, భార్య అస్మా మృతదేహాలు ఇంటి నేలపై ఉన్నాయి. ఇక ముగ్గురు కుమార్తెల మృతదేహాలు ఓ బెడ్‌లో దాచిపెట్టినట్లు గుర్తించారు. పిల్లల శవాలను మంచంలో దాచి పెట్టి.. వారి ఆచూకీ తెలియకుండా చేసే ప్రయత్నం జరిగినట్లు తెలుస్తోంది.

హత్య సమాచారం తెలుసుకున్న పోలీసులు ఫోరెన్సిక్ బృందాలతో ఆ ఇంటికి చేరుకున్నారు. ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేసి, సాక్ష్యాధారాలను సేకరిస్తున్నారు. ఒకేసారి అయిదుగురు కుటుంబ సభ్యుల్ని చంపడం వెనుక ఉన్న మిస్టరీని ఛేదించేందుకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ విషాద ఘటనతో స్థానిక ప్రజలు షాక్‌కు గురయ్యారు.

## జార్ఖండ్ మాజీ సీఎం రఘుబర్ దాస్ బీజేపీలో చేరిక

రాంచీ: మేము తిరిగి వస్తామనే నినాదంతో జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి రఘువర్ దాస్ బీజేపీలో చేరారు. శుక్రవారం రాంచీలోని బీజేపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రఘువర్ దాస్ రెండోసారి పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. బీజేపీ సభ్యత్వం తీసుకున్న తర్వాత, రఘువర్ దాస్ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. 'ఒడిశా గవర్నర్ పదవికి రాజీనామా చేయడం ద్వారా, ఆయన ఇప్పుడు తన పాత పాత్రకు తిరిగి వస్తున్నట్లు చెప్పారు. గవర్నర్‌గా ఉండటం గౌరవానికి సంబంధించిన విషయమన్నారు.

### కొత్త ఏడాది.. కొత్త ఉత్సాహంతో

2024 సంవత్సరం నుంచి పాఠాలు నేర్చుకుంటూ 2025 కొత్త సంవత్సరంలో కొత్త శక్తి, కొత్త ఉత్సాహం, కొత్త ఉత్సాహంతో, అందరూ బీజేపీ కార్యకర్తలు ప్రజా ప్రయోజనాల కోసం పోరాడి విజయం సాధించాలని మాజీ ముఖ్యమంత్రి అన్నారు. జనవరి 10 తనకు చారిత్రాత్మకమైన రోజు అని రఘువర్ దాస్ అన్నారు. 1980లో ఈ రోజున, ఆయన బీజేపీలో ప్రాథమిక సభ్యుడయ్యారు. తాను గవర్నర్‌గా నియమితుడైనప్పుడు, 2023 అక్టోబర్ 26న న్యూఢిల్లీలో జాతీయ అధ్యక్షుడు జె.పి.నడ్డాను కలిసి తన రాజీనామాను సమర్పించినప్పుడు, అది తన జీవితంలో చాలా భావోద్వేగ క్షణం అని ఆయన అన్నారు.

రాజకీయ జీవితంలో గెలుపోటములు ఉంటాయని రఘువర్ దాస్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. గెలుపు, ఓటమి జీవితంలో ఒక భాగమని అన్నారు. 1984లో బీజేపీకి ఇద్దరు ఎంపీలు ఉన్నప్పుడు ప్రతిపక్షాలు 'హమ్ దో హమారే దో' అని ఎగతాళి చేశాయని, ఆ రోజును ప్రజలు చూశారని పేర్కొన్నారు. కానీ మీ అందరికీ తెలుసు, ఇప్పుడు బీజేపీ దేశాన్ని అంతిమ స్థాయికి తీసుకెళ్లే దిశగా కొనసాగుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రజలకు సేవ చేయడానికి అధికారం మనకు ఒక సాధనమని ఆయన అన్నారు. ఈ కారణంగా ప్రధానమంత్రి నాయకత్వంలో కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం వరుసగా మూడవసారి అధికారంలోకి వచ్చింది. నేడు, భారతీయ జనతా పార్టీ, ఎన్డీఏ ప్రభుత్వాలు దేశంలోని 22 రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నాయని రఘువర్ దాస్ తెలిపారు.



ఈ కార్యక్రమంలో మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బాబులాల్ మరాండి, వర్కింగ్ ప్రెసిడెంట్ రవీంద్ర రాయ్, కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్, ఎంపీ మనీష్ జైస్వాల్, రాజ్యసభ ఎంపీ ఆదిత్య సాహు, మాజీ ప్రతిపక్ష నాయకుడు అమర్ బౌరి, ఎమ్మెల్యే సహా అనేక మంది బీజేపీ నేతలు నీరా యాదవ్, అలోక్ చౌరాసియా సహా పలువురు హాజరయ్యారు.

## జేఏబీ నిర్ణయంలో జోక్యం చేసుకోలేం

◆ సుప్రీంకోర్టు స్పష్టీకరణ

◆ జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష రెండుసార్లకే పరిమితం

న్యూఢిల్లీ: ఐఐటీల్లో బీటెక్, బీఆర్క్ సీట్ల భర్తీకి నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష మూడుసార్లు రాసుకోవచ్చని ప్రకటించి.. ఆ తర్వాత రెండుసార్లకే పరిమితం చేయడంపై పలువురు విద్యార్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యవహారంపై శుక్రవారం విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షను రెండుసార్లు రాసేలా జాయింట్ అడ్మిషన్ బోర్డు (జేఏబీ) తీసుకున్న నిర్ణయంలో జోక్యం చేసుకోలేమని పేర్కొంది. అలాగే ఐఐటీ కాన్పూర్ ప్రకటన నేపథ్యంలో 2024 నవంబర్ 5-18 తేదీల మధ్య కాలంలో తమ కోర్సుల నుంచి డ్రాప్ అవుట్ అయిన విద్యార్థులకు ఉపశమనం కలిగించింది. జేఈఈ అడ్వాన్స్‌డ్-2025 పరీక్షకు వారు రిజిస్టర్ చేసుకొనేందుకు అవకాశం కల్పించింది.

జేఈఈ అడ్వాన్స్‌డ్ మూడుసార్లు రాసే అవకాశం కల్పిస్తున్నట్లు నవంబర్ 5న ఐఐటీ కాన్పూర్ నిర్ణయించింది. ఆ తర్వాత 18వ తేదీన జాయింట్ అడ్మిషన్ బోర్డు (జేఏబీ) యూటర్న్ తీసుకోవడంతో పలువురు అభ్యర్థులు నిరసన వ్యక్తం చేశారు. విద్యార్థుల అర్హత ప్రమాణాల్లో చేసిన ఆకస్మిక మార్పులు పిటిషనర్లతో పాటు ఇలాంటి వేలాది మంది విద్యార్థులు ఐఐటీల్లో ప్రవేశించేందుకు విలువైన అవకాశాన్ని ప్రభావితం చేస్తాయని సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ నిర్ణయం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని తెలిపారు.

ఇదిలావుండగా ఐఐటీల్లో అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశానికి 2013 నుంచి జేఈఈ అడ్వాన్స్‌డ్ పేరిట పరీక్ష నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. దానికి ఇంటర్ పాసైన సంవత్సరంతో పాటు ఆ తర్వాత ఏడాది.. అంటే వరుసగా రెండుసార్లు మాత్రమే హాజరు కావొచ్చు. దాన్ని మూడుసార్లకు పెంచుతూ జేఈఈ అడ్వాన్స్‌డ్ నిర్వహణ బాధ్యత తీసుకున్న ఐఐటీ కాన్పూర్ గతేడాది నవంబర్ 5వ తేదీన ప్రకటించింది. పట్టుమని 15 రోజులు కాకముందే ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకుంది. దీంతో గతంలో మాదిరిగానే రెండుసార్లు మాత్రమే ఈ పరీక్ష రాసుకోవచ్చు.

వచ్చే మే నెలలో జరిగే అడ్వాన్స్‌డ్ పరీక్షకు 2024 మార్చి, 2025 మార్చిలో జరిగే ఇంటర్ లేదా తత్సమానమైన పరీక్షల్లో పాసైనవారు మాత్రమే అర్హులు. అంతకంటే ముందు ఉత్తీర్ణులైన వారికి అవకాశం ఉండదు.

# ఆకాశంలో త్రీగోర్జెస్!

## సౌరశక్తిని ఒడిసిపట్టేందుకు చైనా కొత్త ప్లాన్



ప్రపంచంలోనే మరో అతి పెద్ద డ్యామును నిర్మించడానికి సిద్ధమవుతోన్న చైనా... తాజాగా మరో భారీ ప్రాజెక్ట్ చేపట్టే దిశగా అడుగులేస్తోంది. సౌరశక్తిని సమర్థవంతంగా వినియోగించుకొనేందుకు ప్రయత్నాలు చేస్తోంది. శాస్త్రవేత్తలు దీనిని 'త్రీగోర్జెస్ డ్యామ్ ఆఫ్ స్పేస్'గా అభివర్ణిస్తున్నారు.

త్రీగోర్జెస్ డ్యామ్.. చైనాకు కలికితురాయి. మానవులు సృష్టించిన అతిపెద్ద నీటి నిల్వ చేసే కేంద్రం. ఇప్పుడు అదేరకంగా సౌరశక్తిని ఒడిసిపట్టేలా బీజింగ్ ప్లాన్ చేస్తోంది. ఆ దేశానికి చెందిన ప్రముఖ రాకెట్ సైంటిస్ట్ లాంగ్ లెహావోను ఉటంకిస్తూ సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ దీనిపై ఓ కథనాన్ని రాసుకొచ్చింది. ఈ సరికొత్త సోలార్ ప్రాజెక్టులో భాగంగా భూమికి 32 వేల కిలోమీటర్ల ఎత్తులో భూస్థిర కక్ష్యలో కిలోమీటర్ వెడల్పుతో భారీ సౌరశ్రేణిని ఏర్పాటు చేయనున్నారు. దాంతో భూవాతావరణంలో వచ్చే మార్పులు, రాత్రి పగలుతో సంబంధం లేకుండా నిరంతరం సౌరశక్తిని సేకరించడానికి వీలు కలుగుతుంది.

"ప్రస్తుతం మేం ఈ ప్రాజెక్టుపై పని చేస్తున్నాం. దీనిని భూస్థిరకక్ష్యలోకి తరలించడం అత్యంత కీలకం. ఇదొక అద్భుతమైన ప్రాజెక్ట్. ఈ పద్ధతిలో ఒక ఏడాదిలో ఉత్పత్తయ్యే శక్తి.. భూమిలోపలి నుంచి తవ్వితీసే మొత్తం చమురు నిల్వల నుంచి ఉత్పత్తయ్యే శక్తితో సమానం" అని పేర్కొన్నారు. లాంగ్ లెహావో ఈ భారీ ప్రాజెక్టును త్రీగోర్జెస్ డ్యాంతో పోల్చారు.

చైనాలోని యాంగ్జే నదిపై ఉన్న త్రీగోర్జెస్ డ్యామ్ ప్రపంచంలోనే అతి పెద్ద జలవిద్యుత్కేంద్రం. అంతరిక్షంనుంచి సాధారణ కంటికి కనిపించే అతితక్కువ కట్టడాల్లో ఇది కూడా ఒకటి. ఈ డ్యామ్‌లో ఉత్పత్తి అయ్యే జలవిద్యుత్తు 22,500 మెగావాట్లు.. అంటే ప్రపంచంలోనే అతి పెద్దవైన మూడు అణువిద్యుత్తు కేంద్రాల ఉత్పత్తికి దాదాపు సమానం. ఇందులో నీటినిల్వ బరువుకు భూపరిభ్రమణ వేగం 0.06 మైక్రో సెకెన్లు తగ్గిందని గతంలో నాసా వెల్లడించింది.

టిబెట్‌లో భారత సరిహద్దుకు సమీపంలో యార్లుంగ్ జంగ్బోగా ప్రసిద్ధమైన బ్రహ్మపుత్ర నదిపై ప్రపంచంలోనే అతిపెద్ద డ్యామ్ నిర్మాణానికి చైనా ఇటీవల ఆమోదముద్ర వేసిన సంగతి తెలిసిందే. బ్రహ్మపుత్రనది భారత్‌లోని అరుణాచల్‌ప్రదేశ్‌లోకి ప్రవేశించేందుకు మలుపు తిరిగే ప్రదేశంలో ఈ ప్రాజెక్టు నిర్మించాలని తలపెట్టారు. 137 బిలియన్ డాలర్ల ఈ భారీ ప్రాజెక్టు నిర్మాణ వ్యయం ముందు చైనా అతిభారీ ప్రాజెక్టుగా పేర్కొనే త్రీగోర్జెస్ ప్రాజెక్టు కూడా వెలవెలబోనుంది. ఈ ప్రాజెక్టు సాయంతో చైనా బ్రహ్మపుత్ర నదిలో జల ప్రవాహాన్ని నియంత్రించగలుగుతుంది. అంతేకాక భారీ మోతాదులో వరద నీటిని భారత భూభాగంపైకి వదిలి విధ్వంసం సృష్టించగలుగుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

# ఇంటర్‌పోల్ నోటీసులకు 'సిల్వర్' కలర్ కోడ్!




అంతర్జాతీయ పోలీస్ సహకార సంస్థ మొదటిసారిగా సిల్వర్ నోటీసులు జారీచేసింది. విదేశాల్లో అక్రమంగా కూడబెట్టిన ఆస్తుల వివరాల గుట్టువిప్పేందుకు వీలుగా ఇంటర్‌పోల్ దీన్ని తీసుకువచ్చింది. ఈ క్రమంలో ఓ మాఫియా సభ్యుడి ఆస్తులకు సంబంధించి ఇటలీనుంచి వచ్చిన అభ్యర్థన మేరకు తొలిసారిగా వీటిని జారీ చేసినట్లు ఇంటర్‌పోల్ వెల్లడించింది.

ఫ్రాన్స్‌లోని లియోన్ కేంద్రంగా పనిచేస్తున్న ఇంటర్‌పోల్‌లో ప్రస్తుతం 196 సభ్య దేశాలున్నాయి. విదేశాలకు పారిపోయిన నేరస్థులు, ఆర్థిక నేరగాళ్లకు సంబంధించి కీలక సమాచారం కోసం ఆయా దేశాల నుంచి వచ్చే విజ్ఞప్తుల మేరకు కొన్ని నోటీసులను జారీ చేస్తుంది. ఇందుకోసం పలు కలర్ కోడ్లను (రెడ్, ఎల్లో, బ్లూ, బ్లాక్, గ్రీన్, ఆరెంజ్, పర్పుల్) వాడుతోన్న ఇంటర్పోల్.. తాజాగా సిల్వరు జోడించింది. విదేశాలకు పారిపోయిన వారిని నిర్బంధించాలని కోరేందుకు రెడ్ నోటీసుల జారీ తెలిసిందే.

ఇంటర్‌పోల్‌లో భారత్ కూడా సభ్య దేశమే. దాదాపు 10మంది ఆర్థిక నేరగాళ్లు మన దేశంనుంచి పారిపోయిన వారి జాబితాలో ఉన్నారు. అయితే విదేశాలకు తరలించిన మొత్తం నల్లధనం ఎంతనే విషయంపై కచ్చితమైన అంచనాలు లేవు. ఈ క్రమంలో నేరస్థులు ఇలా అక్రమంగా సరిహద్దులు దాటించిన సంపదను గుర్తించేందుకు సిల్వర్ నోటీసులు భారత్‌కు ఎంతగానో ఉపయోగపడతాయని ఈ వ్యవహారంపై అవగాహన ఉన్న ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు.

నేరస్థుల అక్రమ ఆస్తుల వివరాలకు సంబంధించి సిల్వర్ నోటీసు కోడ్‌తో ఇంటర్‌పోల్ ఇటీవల పైలట్ ప్రాజెక్టు చేపట్టింది. మోసం, అవినీతి, డ్రగ్ అక్రమ రవాణా, ఇతర తీవ్ర నేరాలతో సంబంధమున్న వ్యక్తుల కీలక సమాచారాన్ని గుర్తించి, ఆయా దేశాలకు అందిస్తుంది. ఈ పైలట్ ప్రాజెక్టులో భారత్ కూడా భాగమే. ఇదిలా ఉంటే, దర్యాప్తు సంస్థలకు అంతర్జాతీయ సహకారాన్ని సులభతరం చేసేందుకు వీలుగా కేంద్ర దర్యాప్తు సంస్థ 'భారత్‌తో పోల్ పోర్టల్'ను అందుబాటులోకి తెచ్చిన సంగతి తెలిసిందే.

# మార్చి 9న కెనడాకు కొత్త ప్రధాని



కెనడాలో రాజకీయం వేడెక్కింది. ప్రస్తుత ప్రధాని జస్టిన్ ట్రూడో తన పదవికి రాజీనామా చేయనున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. లిబరల్ పార్టీ నాయకత్వ బాధ్యతల నుంచి వైదొలుగుతున్నట్లు తెలిపారు. దీంతో కెనడా తదుపరి ప్రధాని ఎవరనేది ఆసక్తిగా మారింది. ఈ క్రమంలోనే లిబరల్ పార్టీ ఓ కీలక ప్రకటన చేసింది. మార్చి 9న తమ పార్టీ కొత్త నాయకుడిని ఎన్నుకుంటామని లిబరల్ పార్టీ ప్రకటించింది. దీంతో ఆయనే కొత్త ప్రధాని అయ్యే అవకాశం ఉంది. గురువారం ఈమేరకు ఓ ప్రకటనను విడుదల చేసింది. 'కొత్త నేతను పార్టీ ఎన్నుకున్న తర్వాత పార్టీ అధ్యక్ష పదవికి, ప్రధాని పదవికి కూడా రాజీనామా చేయాలని అనుకుంటున్నా' అని సోమవారం మీడియా సమావేశంలో ట్రూడో తెలిపారు. కొత్త నేతను ఎన్నుకునేవరకు కెనడా పార్లమెంటును సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సస్పెన్షన్ మార్చి 24వరకూ కొనసాగుతుందని వెల్లడించారు.

2015లో ప్రధానిగా పగ్గాలు చేపట్టిన ట్రూడోకు ఇటీవల సొంత పార్టీ ఎంపీల నుంచే వ్యతిరేకత వ్యక్తమైంది. ఈక్రమంలో అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్.. కెనడాపై 25 శాతం సుంకాలు విధిస్తామని హెచ్చరించారు. అంతేకాక.. వలసలు, డ్రగ్స్ అక్రమరవాణాను నిరోధించలేకపోతే కెనడా 51వ రాష్ట్రంగా చేరాలంటూ హెచ్చరించారు. దీంతో ట్రూడోపై ఒత్తిడి మరింత పెరిగింది. సొంత పార్టీ నేతలే రాజీనామా చేయాలంటూ డిమాండ్ చేశారు. ఈక్రమంలోనే ఆయన రాజీనామా చేయనున్నట్లు ప్రకటించారు. ట్రూడో స్థానంలో తదుపరి నాయకుడు ఎవరనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈక్రమంలో తదుపరి ప్రధాని రేసులో లిబరల్ పార్టీ నేతలు క్రిస్టిన ఫ్రీలాండ్, మార్క్ కార్నీ, డొమినిక్ లీ బ్లాంక్, మెలనీ జోలీ, ఫ్రాంకోయిస్ ఫిలిప్పీ, క్రిస్టీ క్లార్క్‌తో పాటు భారత సంతతి ఎంపీలు అనిత ఆనంద్, జార్జ్ చాహల్ పేర్లు వినిపిస్తున్నాయి.

# అంతరిక్షం నుంచి కనిపిస్తున్న అగ్నికీలలు

## పెరుగుతున్న మృతుల సంఖ్య

లాస్‌ఏంజెల్స్‌లో కార్చిచ్చులు రోజురోజుకూ విస్తరిస్తున్నాయి. ఇక్కడి పొగ, మంటలు అంతరిక్షంలోని ఉపగ్రహాలకు కూడా స్పష్టంగా కనిపిస్తున్నాయి. పూర్తిగా కాలిపోయి బూడిదగా మారిన గృహాలతో ఈ ప్రదేశం మరుభూమిని తలపిస్తోంది. తాజాగా మృతుల సంఖ్య పెరిగి 10కి చేరింది. ఈ విషయాన్ని లాస్ ఏంజెలెస్ కౌంటీ మెడికల్ ఎగ్జామినర్ వెల్లడించారు. కాకపోతే మృతులను మాత్రం ఇంకా గుర్తించలేదని పేర్కొన్నారు. తాజాగా మాక్సర్ సంస్థ విడుదల చేసిన శాటిలైట్ చిత్రాలు.. పాలిసాడ్స్ ఫైర్, ఎటన్ ఫైర్ సృష్టించిన బీభత్సాన్ని కళ్లకుకట్టాయి. దహనమైన ప్రదేశాలను ఫొటోల్లో ప్రత్యేకమైన రంగులో కనిపించేట్లు మ్యాక్సర్ సంస్థ ఏర్పాట్లు చేసింది. చెట్లు చేమలు ఈ చిత్రాల్లో ఎరుపు రంగులో కనిపించగా.. నలుపు రంగులో దగ్ధమైన ప్రాంతాలు కనిపిస్తున్నాయి. తుడిచి పెట్టుకుపోయిన నిర్మాణాలను కూడా వీటిల్లో చూడొచ్చు. పాలిసాడ్స్, ఎటన్‌ఫైర్లు కలిపి మొత్తం 34 వేల ఎకరాలను కాల్చి బూడిద చేశాయి.

**కాలిఫోర్నియా గవర్నర్‌పై ట్రంప్, మస్క్ ఫైర్..**

కాలిఫోర్నియా గవర్నర్ గవిన్ న్యూసమ్ కారణంగానే ఈ స్థాయి నష్టం వాటిల్లిందని ట్రంప్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఒక చిన్న చేపను కాపాడేందుకు దక్షిణ కాలిఫోర్నియాకు నీటి సరఫరాను తగ్గించి తీవ్ర నష్టానికి కారణమయ్యారని నిన్న ట్రంప్ ఆరోపించారు. న్యూసమ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తాజాగా ఎలాన్ మస్క్ కూడా ట్రంప్



చేసిన ఆరోపణల్లో వాస్తవం ఉందన్న అర్థం వచ్చేలా.. ఓ చేప కోసం నీటి సరఫరాను ఎలా తగ్గించారో వెల్లడించి కొన్ని పోస్టులను.. రీపోస్టు చేశారు.

2019లో కాలిఫోర్నియాలో అటవీ నిర్వహణ విషయంలో న్యూసమ్‌ను ట్రంప్ తప్పుపట్టారు. ఆయన తనను కలిసినప్పుడు అటవీ భూముల్లో ఎండిపోయిన ఆకులువంటివి తొలగించి శుభ్రం చేయించాలని సూచించాను. ఏటా కాలిఫోర్నియాలో కార్చిచ్చులు వ్యాపించడం.. ఆయన ఫెడరల్ గవర్నమెంట్ దగ్గరకు నిధుల కోసం రావడం మామూలైపోయిందని విమర్శించారు. ఇక అది కుదరదు అని నాడు పేర్కొన్నారు.

ఏటీఎం కార్డు సైజులో ఉండే అరుదైన పప్ ఫిష్ అనే దానిని రక్షించేందుకు కొన్నేళ్ల నుంచి కాలిఫోర్నియాకు నీటి సరఫరాలో కోతవేశారు. దీని సంరక్షణ కారణంగా దాదాపు లక్షల ఎకరాల్లో రైతుల పంటలు కూడా ప్రభావితం అవుతున్నాయి.

# అమ్మ, ఎవరికైనా అమ్మే!



విదేశాల్లో ఉండే చాలామంది వ్యక్తులు ఒక్కోసారి వివిధ కారణాల వల్ల తల్లిదండ్రుల చివరి చూపునకు నోచుకోలేకపోతుంటారు. దీంతో తల్లిదండ్రులు ఆఖరి నిమిషంలో తమ పిల్లలను చూడకుండానే ప్రాణాలు వదిలేస్తారు. అలాంటి పరిస్థితే దాలస్‌కు చెందిన హన్నా వైట్ అనే మహిళకు ఎదురైంది. నార్త్ డకోటాలో నివసిస్తున్న తన తల్లి కాథీన్ నెల్సన్ నిమోనియాతో బాధపడుతోంది. ఆమె ఆరోగ్యం పూర్తిగా క్షీణించడంతో కొన్ని గంటలు మాత్రమే జీవించే అవకాశం ఉందని వైద్యులు చెప్పడంతో హన్నా ఒక్కసారిగా షాక్‌కు గురైంది. ఎన్నో కష్టాలు పడి తనను యోగ్యురాలిని చేసిన తల్లి చివరి చూపైనా చూడాలనే తపనతో వెంటనే ఆమె దాలస్ నుంచి నార్త్ డకోటాకు డెల్టా ఎయిర్‌లైన్స్‌లో టికెట్ బుక్ చేసుకుంది. అయితే.. పలు సాంకేతిక కారణాలవల్ల దాలస్ పోర్ట్ వర్త్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి తాను ప్రయాణించాల్సిన విమానం గంటపాటు ఆలస్యమైంది. దీంతో కనెక్టింగ్ ఫ్లైట్‌ను అందుకోలేకపోతానని ఆమె మరింత కుంగిపోయింది. ఇక తన తల్లిని ప్రాణాలతో చూసే అవకాశం లేదని తల్లడిల్లిపోయింది. తన పరిస్థితిని ఓ ఫ్లైట్ అటెండెంట్‌కు వివరించింది. వెంటనే స్పందించిన ఎయిర్‌లైన్స్ ఆమెకు మరో ప్రత్యేక విమానం ఏర్పాటు చేసింది. అంతేకాకుండా విమాన పైలట్ కెప్టెన్ కీత్ నపోలిటానో హన్నా వెళ్లాల్సిన కనెక్టింగ్ ఫ్లైట్ పైలట్‌ను సంప్రదించి ఆమె పరిస్థితి వివరించి.. కొంత సమయంపాటు విమానాన్ని ఆపాలని కోరారు.

దీంతో ఆ పైలట్ ప్రయాణికుల సహకారంతో విమానాన్ని దాదాపు 30 నిమిషాలపాటు నిలిపి ఉంచారు. హన్నా తన కనెక్టింగ్ ఫ్లైట్‌ను పట్టుకోగలిగింది. తన తల్లి చివరి క్షణాలలో ఆమె వద్ద ఉండేందుకు తనకు సహకరించిన డెల్టా ఎయిర్‌లైన్స్‌కు హన్నా సోషల్ మీడియా వేదికగా కృతజ్ఞతలు తెలిపింది. ఎయిర్ లైన్స్ సిబ్బంది సహాయంవల్లే తన తల్లితో ఎంతో విలువైన 24 గంటలు గడపగలిగానని.. మరుసటి రోజు ఆమె సంతోషంగా ప్రాణాలు విడిచిందని ఎమోషనల్ పోస్ట్ పెట్టింది.

ఇది తన జీవితంలో ఎంతో ముఖ్యమైన రోజని ఆమె అన్నారు. హన్నాకు డెల్టా ఎయిర్‌లైన్స్ అందించిన సహకారాన్ని నెటిజన్లు ప్రశంసిస్తున్నారు. ఓ నెటిజన్ స్పందిస్తూ.. ఒకరు తీసుకునే చిన్న నిర్ణయం మరొకరి జీవితాన్నే మార్చే క్షణం కావచ్చు అని పేర్కొన్నారు. ఆమెకు సహకరించిన సిబ్బందికి కచ్చితంగా తగిన ప్రోత్సాహకం ఇవ్వాలని మరో నెటిజన్ డెల్టా ఎయిర్‌లైన్స్‌ను కోరారు.

# ఐర్లాండ్‌పై భారత్ ఘన విజయం



- స్మృతి మంధాన ఆల్‌టైమ్ రికార్డ్, ప్రతీకా విధ్వంసం..
- 6 వికెట్ల తేడాతో విజయం
- మూడు వన్డేల సిరీస్‌లో 1-0తో భారత్ ఆధిక్యం

భారత మహిళ జట్టు ఓపెనర్ స్మృతి మంధాన చరిత్ర సృష్టించింది. వన్డే క్రికెట్‌లో అత్యంత వేగంగా 4 వేల పరుగుల మైలురాయి అందుకున్న తొలి భారత ప్లేయర్‌గా చరిత్రకెక్కింది. సొంతగడ్డపై ఐర్లాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా శుక్రవారం జరిగిన తొలి వన్డేలో స్మృతి మంధాన ఈ ఫీట్ సాధించింది. ఈ మ్యాచ్‌లో టీమిండియా 6 వికెట్ల తేడాతో ఐర్లాండ్‌ను ఓడించింది. ఈ గెలుపుతో మూడు వన్డేల సిరీస్ 1-0తో ఆధిక్యంలో నిలిచింది. ఈ సిరీస్ నుంచి రెగ్యులర్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌కు విశ్రాంతి ఇవ్వడంతో స్మృతి మంధాన తాత్కలిక సారథిగా వ్యవహరిస్తోంది.

**ప్రతీకా విధ్వంసం..**

ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఐర్లాండ్ మహిళల జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్లకు 238 పరుగులు చేసింది. ఆ జట్టు కెప్టెన్ గబీ లూయిస్(129 బంతుల్లో 15 ఫోర్లతో 92) తృటిలో సెంచరీ చేసే అవకాశాన్ని చేజార్చుకుంది. లీహ్ పాల్(73 బంతుల్లో 7 ఫోర్లతో 59) హాఫ్ సెంచరీతో రాణించాడు. భారత బౌలర్లలో ప్రియా మిశ్రా(2/56) రెండు వికెట్లు తీయగా.. టిటస్ సధు, సయలి, దీప్తి శర్మ తలో వికెట్ తీసారు.

అనంతరం భారత మహిళల జట్టు 34.3 ఓవర్లలోనే 4 వికెట్లకు 241 పరుగులు చేసి సునాయస విజయాన్నందుకుంది. ఓపెనర్ ప్రతీకా రావల్(96 బంతుల్లో 10 ఫోర్లు, సిక్స్‌తో 83), తేజల్ హసబ్నిస్(46 బంతుల్లో 9 ఫోర్లతో 53 నాటౌట్) హాఫ్ సెంచరీలతో భారత విజయంలో కీలక పాత్ర పోషించారు. కెప్టెన్ స్మృతి మంధాన(29 బంతుల్లో 6 ఫోర్లు, సిక్స్‌తో 41) శుభారంభం అందించింది. ఐర్లాండ్ బౌలర్లలో అర్లెనే కెల్లీ ఓ వికెట్ తీయగా.. మాగ్యూరీ మూడు వికెట్లు పడగొట్టింది. ఇరు జట్ల మధ్య రెండో వన్డే ఆదివారం జరగనుంది.

**మిథాలీ రాజ్ తర్వాత..**

ఈ మ్యాచ్‌లో దూకుడుగా ఆడిన స్మృతి మంధాన తొలి వికెట్‌కు 70 పరుగులు జోడించింది. ఈ క్రమంలోనే వన్డే క్రికెట్‌లో 4 వేల పరుగులు పూర్తి చేసుకుంది. అంతర్జాతీయ మహిళా క్రికెట్‌లో ఈ ఫీట్ సాధించిన 15వ ప్లేయర్‌గా, రెండో భారత క్రీడాకారిణిగా మంధాన నిలిచింది. స్మృతి మంధాన కంటే ముందు భారత్ తరఫున మిథాలీ రాజ్ ఈ ఫీట్ సాధించింది. 95 ఇన్నింగ్స్‌ల్లోనే మంధాన ఈ ఫీట్ సాధించడం విశేషం. ఓవరాల్‌గా అత్యంత వేగంగా ఈ ఫీట్ సాధించిన మూడో ప్లేయర్‌గా.. తొలి భారత బ్యాటర్‌గా చరిత్రకెక్కింది.

మహిళల అంతర్జాతీయ క్రికెట్‌లో ఆస్ట్రేలియా ప్లేయర్ బెలిండా క్లార్క్ 86 ఇన్నింగ్స్‌ల్లోనే 4 వేల పరుగులు అందుకొని ఈ జాబితాలో అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఆమె తర్వాత మెగ్ లానింగ్(87 ఇన్నింగ్స్‌లు), స్మృతి మంధాన(95), లారా వోల్వార్డ్(96), కరేన్ రోల్టన్(103), సుజీ బీట్స్(105), స్టెఫనీ టేలర్(107), తమ్సిన్ బ్యూమాంట్(110), మిథాలీ రాజ్(112), డెబ్బీ హాకీలీ(112) కొనసాగుతున్నారు.

# 'క్రికెట్‌లోనే అత్యధిక సూసైడ్ కేసులు'

- మాజీ క్రికెటర్ సంచలన కామెంట్స్



గ్లోబల్ స్పోర్ట్స్ లో అత్యధిక సూసైడ్ రేట్ క్రికెట్ లోనే ఉందని సంచలన కామెంట్స్ చేశాడు టీమిండియా మాజీ బ్యాటర్ రాబిన్ ఉతప్ప. తాను కూడా గతంలో టీమ్‌లో ఉన్న పోటీతత్వం వల్ల మానసిక ఒత్తిడిని తీవ్రంగా ఎదుర్కొన్నట్లు తెలిపాడు. క్రికెట్ లో కేవలం ప్లేయర్స్ మాత్రమే కాదని, అంపైర్స్, బ్రాడ్ కాస్టర్స్ సహా పలు విభాగాలకు చెందిన సభ్యులు చాలా మంది ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు వెల్లడించాడు.

"నాకు తెలిసింది ఈ నిజం చాలా తక్కువ మందికి తెలుసు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రీడల్లో క్రికెట్ లోనే అత్యధిక మరణాలు నమోదయ్యాయి. ఇది చాలా తక్కువ మందికి తెలిసిన నిజం. క్రికెట్ ఆడే ప్లేయర్స్ మాత్రమే కాదు ఈ క్రీడలో భాగమైన ఇతర సభ్యులు కూడా చాలా మంది ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనలు ఉన్నాయి. క్రికెట్ అనేది టీమ్ స్పోర్ట్ కన్నా ఇండివిడ్యువల్ స్పోర్ట్. ఎందుకంటే మ్యాచ్ లో మీరు, మీ ఓపెనర్ పార్ట్నర్‌తో పోటీ పడుతున్నట్లే, జట్టు బయట ఉన్న మూడో ఓపెనర్ తోనూ పోటీపడాల్సి ఉంటుంది. అలా 10-15ఏళ్ల పాటు పోటీ పడాలనే మైండ్ సెట్ తో కెరీర్ ను కంటిన్యూస్ గా కొనసాగిస్తే, అది చివరికి మిమ్మల్ని అత్యంత చీకటి ప్రాంతంలోకి నెట్టేస్తుంది." అని పేర్కొన్నాడు.

తాను 2009 - 2011 మధ్య మానసిక సమస్యలను ఎదుర్కొన్నట్లు గుర్తుచేసుకున్నాడు రాబిన్ ఉతప్ప. ఆ సమస్య నుంచి తాను ఎలా బయటపడ్డాడో వివరించాడు. ఇంగ్లాండ్ మాజీ బ్యాటర్ గ్రహమ్ థోర్ప్, టీమిండియా మాజీ పేసర్ డేవిడ్ జాన్సన్ బలవన్మరణానికి పాల్పడిన సంఘటనలను గుర్తుచేశాడు. జీవితం అలా ముగిసిపోకూడదని అన్నాడు. "2011లో నేనెందుకు మనిషిగా పుట్టానా అని సిగ్గుపడ్డాను. ఒకానొక దశలో నెక్స్ట్ ఏం చేయాలో తెలీక సతమతమవుతాం. నేను కూడా అంతే. కానీ ఆ తర్వాత దాని నుంచి బయటపడ్డాను." అని చెప్పుకొచ్చాడు.

కాగా, రాబిన్ ఉతప్ప తన తొమ్మిదేళ్ల కెరీర్ లో 59 వన్డే, టీ20 అంతర్జాతీయ మ్యాచులు ఆడాడు. అలానే సౌతాఫ్రికాలో 2007 టీ 20 ప్రపంచకప్ గెలిచిన జట్టులో సభ్యుడిగా ఉన్నాడు.

# రిషభ్ పంత్ డిఫెన్స్ అద్భుతం: అశ్విన్



టీమిండియా వికెట్ కీపర్ రిషభ్ పంత్‌పై మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ ప్రశంసల జల్లు కురిపించాడు. రిషభ్ పంత్ డిఫెన్స్ అద్భుతంగా ఉంటుందని కొనియాడాడు. ప్రపంచంలోనే అత్యుత్తమ డిఫెన్సివ్ టెక్నిక్ కలిగిన ప్లేయర్ రిషభ్ పంత్ అని అభిప్రాయపడ్డాడు.

ఆస్ట్రేలియాతో ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో రిషభ్ పంత్ పర్వాలేదనిపించాడు. సిడ్నీ వేదికగా జరిగిన ఆఖరి టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో తన శైలికి భిన్నంగా నిదానంగా ఆడిన పంత్.. రెండో ఇన్నింగ్స్‌లో మాత్రం టీ20 తరహా బ్యాటింగ్‌తో హాఫ్ సెంచరీ సాధించాడు. తొలి ఇన్నింగ్స్‌లో నిర్లక్ష్యపు షాట్‌తో ఔటైన పంత్‌పై విమర్శలు రాగా.. రెండో ఇన్నింగ్స్‌పై ప్రశంసల జల్లు కురిసింది. తాజాగా రిషభ్ పంత్ బ్యాటింగ్ గురించి మాట్లాడిన అశ్విన్ అతనిపై ప్రశంసల జల్లు కురిపించాడు.

'రిషభ్ పంత్‌కు ఏం చేయాలనేది సరైన పద్దతిలో చెప్పాలి. ఆస్ట్రేలియా పర్యటనలో మరిన్ని పరుగులు చేయలేకపోయాడు. కానీ అందరికంటే మెరుగైన ఇన్నింగ్స్‌తో ఆసీస్ పర్యటనను ముగించాడు. ఇప్పటికీ రిషభ్ పంత్ అసలు సామర్థ్యం బయటకు రాలేదు. అతను అన్ని రకాల షాట్లను ఆడగలడు. స్వీప్, రివర్స్ స్వీప్, స్లాగ్ స్వీప్, అప్పర్ కట్.. ఇలా ప్రతీ షాట్ ఆడగలడు. అయితే ఇవన్నీ హై రిస్క్ షాట్లు. అయినా అలవోకగా ఆడేస్తాడు. రిషభ్ పంత్ డిఫెన్సివ్ మోడ్‌లో 200 బంతులు ఎదుర్కొంటే ప్రతీ మ్యాచ్‌లోనూ సెంచరీ చేయగలడు. అందుకే ఎప్పుడు దూకుడుగా ఆడాలి. ఎక్కడ డిఫెన్స్ ఆడాలనేది అతనికి తెలుసు. కానీ, ఆ రెండింటిని సరిగ్గా సమన్వయం చేస్తేనే ఫలితం సానుకూలంగా ఉంటుంది.

సిడ్నీ టెస్ట్‌లో పంత్ రెండు రకాల ఇన్నింగ్స్ ఆడాడు. తొలి ఇన్నింగ్స్‌లో నిదానంగా ఆడుతూ 40 పరుగులు చేశాడు. కానీ, ఫీల్డర్‌ను చూసుకోకుండా తనదైన షాట్ ఆడి ఔటయ్యాడు. రెండో ఇన్నింగ్స్‌లో వేగవంతమైన హాఫ్ సెంచరీ నమోదు చేశాడు. దాంతో అందరూ అతన్ని కొనియాడారు. తొలి ఇన్నింగ్స్ గురించి మరిచిపోయారు.

అదే సమయంలో పంత్ దూకుడును అర్థం చేసుకోవాలి. చాలా తక్కువ సందర్భాల్లోనే పంత్ డిఫెన్స్ ఆడుతూ ఔటవుతాడు. ఎంతటి ఫాస్టెస్ట్ బౌలర్ బౌలింగ్ చేస్తున్నా పంత్.. చాలా నింపాదిగా బ్యాటింగ్ చేస్తాడు. అది అతని ప్రత్యేకం. పంత్ 10 బంతులను ఆడుతూ ఔటైనట్లు చూపిస్తే నా పేరు మార్చుకుంటా'అని అశ్విన్ చెప్పుకొచ్చాడు.

జడేజా ఔట్.. షమీ రీఎంట్రీ!

# ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్‌కు రెండు రోజుల్లో భారత జట్టు ప్రకటన?

తీవ్ర బాధను మిగిల్చిన బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ పరాభవం నుంచి ఇప్పుడిప్పుడే తేరుకుంటున్న టీమిండియా మరో సవాల్‌కు సిద్ధమైంది. సొంతగడ్డపై ఇంగ్లండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌తో పాటు మూడు వన్డేల సిరీస్ ఆడనుంది. ముందుగా ఇంగ్లండ్‌తో ఐదు టీ20ల సిరీస్ జనవరి 22 నుంచి ప్రారంభం కానుంది. ఫిబ్రవరి 6 నుంచి మూడు వన్డేల సిరీస్ జరగనుంది.

ఈ సిరీస్ ముగిసిన వెంటనే టీమిండియా ఛాంపియన్స్ ట్రోఫీ 2025 బరిలోకి దిగనుంది. ఈ మెగా టోర్నీకి ముందు ఇంగ్లండ్‌తో జరిగే వన్డే సిరీస్‌ను టీమిండియా సన్నాహకంగా వాడుకోనుంది.ఈ మూడు వన్డేల సిరీస్‌తో పాటు ఛాంపియన్స్ ట్రోఫీకీ మరో రెండు రోజుల్లో సెలెక్టర్లు జట్టును ప్రకటించే అవకాశముంది.

ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్ ఆడిన జట్టునే దాదాపుగా ఛాంపియన్స్ ట్రోఫీకి కొనసాగించే అవకాశం ఉంది. అయితే ఈ టోర్నీలో ఎవరిని ఆడించాలి? ఎవరిని పక్కనపెట్టాలనేది సెలెక్టర్లకు తలనొప్పిగా మారింది. పేలవ ఫామ్‌తో తీవ్ర విమర్శల పాలవుతున్న సారథి రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లిని కొనసాగించాలా..కుర్రాళ్లకు అవకాశం ఇవ్వాలా? వన్డే వరల్డ్ కప్ తర్వాత జట్టుకు దూరమైన షమీ పూర్తి ఫిట్‌నెస్ అందుకున్నాడా? కేఎల్ రాహుల్, రిషభ్ పంత్‌లో వికెట్ కీపర్‌గా ఎవరికి అవకాశం దక్కనుంది? సీనియర్ స్పిన్నర్ రవీంద్ర జడేజా తుది జట్టులో ఉంటాడా? అనేవి మిలియన్ డాలర్ల ప్రశ్నలుగా మారాయి.

**రోకోకు ఆఖరి ఛాన్స్!**

టీ20 ప్రపంచకప్ 2024 విజయం తర్వాత పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్న రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలను ఆఖరి ఛాన్స్‌గా ఛాంపియన్స్



ట్రోఫీలో కొనసాగించే అవకాశం ఉంది. వన్డే ఫార్మాట్‌లో వారికి ఉన్న రికార్డులు, అనుభవం దృష్ట్యా ఇద్దరిపై ఎలాంటి చర్యలు ఉండవని, ఛాంపియన్స్ ట్రోఫీలో కొనసాగుతారని ఇప్పటికే బోర్డు వర్గాలు తెలిపాయి. రోహిత్ శర్మనే కెప్టెన్‌గా కొనసాగనుండగా.. అతనికి జతగా జైస్వాల్ ఓపెనర్‌గా బరిలోకి దిగే అవకాశం ఉంది.

**షమీ రీఎంట్రీ..**

ఫిట్‌నెస్ సమస్యలతో బాధపడుతున్న స్టార్ పేసర్ షమీ.. ఈ వన్డే సిరీస్‌తో రీఎంట్రీ ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం విజయ్ హజారే ట్రోఫీలో ఆడుతున్న షమీ ఫిట్‌నెస్‌ను దగ్గరుండి సమీక్షిస్తున్న బీసీసీఐ మెడికల్ టీమ్.. షమీకి క్లీన్‌చిట్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. అదే జరిగితే షమీ భారత జట్టులోకి రానున్నాడు.

వికెట్ కీపర్‌గా రిషభ్ పంత్‌ను కొనసాగిస్తారా? కేఎల్ రాహుల్‌ను తీసుకుంటారా? అనేది మిలియన్ డాలర్ల పశ్నగా మారింది. రాహుల్ ఆట గొప్పగా లేకున్నా.. మరి చెత్త ప్రదర్శనైతే చేయలేదు. పంత్ కూడా వన్డేల్లో గొప్పగా రాణించింది లేదు. బీజీటీ ప్రదర్శన నేపథ్యంలో రిషభ్ పంత్‌కే ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. ఇక సీనియర్ స్పిన్ ఆల్‌రౌండర్ జడేజా బ్యాటింగ్ వన్డేల్లో అంత గొప్పగా ఏం లేదు. అతని స్థానంలో అక్షర్ పటేల్‌ను జట్టులోకి తీసుకునే ఛాన్స్ ఉంది. కుల్దీప్ యాదవ్ ఫిట్‌గా లేకుంటే వాషింగ్టన్ సుందర్‌కు అవకాశం దక్కుతుంది. మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి పేరును కూడా పరిశీలించవచ్చు.

**తెలుగోడికి ఛాన్స్**

ఆసీస్ పర్యటనలో అదరగొట్టిన తెలుగు తేజం నితీశ్‌కుమార్‌రెడ్డికి కూడా వన్డే సిరీస్‌లో చోటు దక్కే ఛాన్స్ ఉంది. సీమ్ బౌలింగ్ ఆల్‌రౌండర్ల కోటాలో హార్దిక్ పాండ్యాకు బ్యాకప్‌గా అతని తీసుకోవచ్చు. జస్‌ప్రీత్ బుమ్రాకు ఈ సిరీస్ నుంచి రెస్ట్ ఇవ్వనున్నారు. సిరాజ్, ప్రసిధ్ కృష్ణలను కొనసాగించే అవకాశం ఉంది.

**ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్ ఆడే భారత జట్టు(అంచనా)**

రోహిత్ శర్మ(కెప్టెన్), యశస్వి జైస్వాల్, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, శుభ్‌మన్ గిల్, రిషభ్ పంత్/కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్యా, నితీష్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, రవి బిష్ణోయ్/వరుణ్ చక్రవర్తి, వాషింగ్టన్ సుందర్/కుల్దీప్ యాదవ్, మహమ్మద్ షమీ, మహమ్మద్ సిరాజ్, ప్రసిధ్ కృష్ణ, అర్ష్‌దీప్ సింగ్.

# గ్యాప్ తీసుకోలేదు.. వచ్చింది



'హరిహర వీరమల్లు', 'ది రాజాసాబ్'లతో ఈ ఏడాది ప్రేక్షకులకు వినోదాన్ని అందించనున్నారు నటి నిధి అగర్వాల్. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆమె తన కెరీర్ గురించి మాట్లాడారు. 2022లో విడుదలైన 'హీరో' తర్వాత దాదాపు మూడేళ్లపాటు గ్యాప్ రావడంపై స్పందించారు. తాను కావాలని గ్యాప్ తీసుకోలేదని.. కొన్ని కారణాల వల్ల వచ్చిందని చెప్పారు. ఈ ఏడాది రానున్న రెండు సినిమాలపై తాను పూర్తి నమ్మకంతో ఉన్నట్లు తెలిపారు.

"మొదటి లాక్డౌన్‌కు ముందే 'హరిహర వీరమల్లు' ప్రాజెక్ట్ కోసం సంతకం చేశా. ఆ సమయంలో కెరీర్‌పరంగా ఎలాంటి గ్యాప్ లేదు. కొంతకాలానికి లాక్డౌన్ వచ్చింది. తర్వాత షూట్ మొదలుపెట్టి కొన్ని సన్నివేశాలు చిత్రీకరించాం. రెండోసారి కరోనా కారణంగా షూట్ నిలిపివేశాం. చిత్రీకరణ సమయంలో దాదాపు మూడున్నరేళ్లు గడిచిపోయింది. వేరే చిత్రాలకు సంతకం చేయొద్దని టీమ్ నాతో కాంట్రాక్ట్ కుదుర్చుకుంది. 'ది రాజాసాబ్'లో అవకాశం వచ్చినప్పుడు 'హరిహర వీరమల్లు' టీమును సంప్రదించా. అందులో భాగం కావాలనుకుంటున్నానని చెప్పా. వాళ్లు దానికి అంగీకరించారు. అలా రెండు ప్రాజెక్ట్‌లో భాగమయ్యా. ఈ రెండింటిపై పూర్తి నమ్మకంతో ఉన్నా" అని నిధి అగర్వాల్ తెలిపారు. కెరీర్ గురించి ఆలోచించి తాను కొన్నిసార్లు బాధపడ్డానని అన్నారు. ఆర్థిక ఇబ్బందులు రాకూడదనే ఉద్దేశంతోనే తాను బ్రాండ్ ప్రమోషన్స్ చేస్తున్నానని తెలిపారు.

"చిన్నతనం నుంచి నేను సన్నగానే ఉండేదాన్ని. చుట్టూ ఉన్న వాళ్లు లావుగా మారాలని సలహా ఇచ్చేవారు. కరోనా సమయంలో పలు కారణాల వల్ల కాస్త బొద్దుగా అయ్యా. దానిని చూసి నువ్వెందుకు ఇలా అయ్యావు? అని వాళ్లే కామెంట్ చేశారు" అని ఆమె చెప్పారు. పీరియాడిక్ యాక్షన్ అడ్వెంచర్ మూవీగా 'హరిహర వీరమల్లు' సిద్ధమవుతోంది. క్రిష్, జ్యోతికృష్ణ దర్శకత్వంలో ఇది రూపుదిద్దుకుంటోంది. రెండు భాగాల్లో సినిమా విడుదల కానుంది. తొలి భాగం మార్చి 28న విడుదల కానుంది. ఇందులో పవన్ సామ్రాజ్య వాదులకు వ్యతిరేకంగా.. స్వాతంత్య్రం కోసం ఓ యోధుడుగా కనిపించనున్నారు. మరోవైపు, ప్రభాస్ కథానాయకుడిగా మారుతీ దర్శకత్వంలో రూపొందుతున్న రొమాంటిక్ కామెడీ హారర్ ఫిల్మ్ 'ది రాజా సాబ్'. మాళవికా మోహనన్, నిధి అగర్వాల్ కథానాయికలుగా కనిపించనున్నారు.



## రష్మికకు గాయం.. ఇప్పుడెలా ఉందంటే..

ప్రముఖ నటి రష్మికకు గాయమైంది. ఇటీవల ఆమె జిమ్‌లో వ్యాయామం చేస్తుండగా గాయమైందని సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. వైద్యులు కొన్ని రోజులు విశ్రాంతి సూచించారని పేర్కొన్నాయి. ప్రస్తుతం ఆమె కోలుకుంటున్నారని, త్వరలోనే షూటింగ్స్‌లో పాల్గొంటారని తెలిపాయి. 'పుష్ప 2'తో భారీ విజయాన్ని ఖాతాలో వేసుకున్న రష్మిక వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. ప్రస్తుతం 'సికందర్'లో నటిస్తున్నారు. గాయం కావడంవల్ల షూటింగుకు కొన్ని రోజులు బ్రేక్ ఇచ్చారు. సల్మాన్ ఖాన్ హీరోగా దర్శకుడు ఏఆర్ మురుగదాస్ తెరకెక్కిస్తున్న చిత్రమిది. కాజల్ అగర్వాల్ కీలక పాత్ర పోషిస్తున్న ఈ యాక్షన్ మూవీ ఈదుకు విడుదల కానుంది. మరో బాలీవుడ్ చిత్రం 'థామా'లోనూ ఆమె నటిస్తున్నారు. మరోవైపు, ఆమె హీరోయిన్‌గా నటించిన 'ఛావా' ఫిబ్రవరి 14న ప్రేక్షకుల ముందుకురానుంది. విక్కీ కౌశల్ హీరోగా లక్ష్మణ్ ఉటేకర్ తెరకెక్కించిన హిస్టారికల్ యాక్షన్ ఫిల్మ్ ఇది. తెలుగులో 'కుబేర', 'ది గర్ల్ ఫ్రెండ్', 'రెయిన్ బో' చిత్రాలతో అలరించనున్నారు.

## 'చంపడంలో మాస్టర్స్ చేశా'



'డాకు మహారాజ్'గా సందడి చేయనున్నారు బాలకృష్ణ. ఆయన హీరోగా దర్శకుడు బాబీ తెరకెక్కించిన సినిమా సంక్రాంతి కానుకగా ఆదివారం ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఓ ట్రైలర్‌ను విడుదల చేసిన చిత్ర బృందం తాజాగా 'రిలీజ్ ట్రైలర్ విడుదల చేసింది. "ఎవరైనా చదవడంలో మాస్టర్స్ చేస్తారేమో.. నేను చంపడంలో చేశా" అంటూ బాలకృష్ణ పేల్చిన డైలాగ్స్, నేపథ్య సంగీతం ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. చిత్రంలో ప్రగ్యా జైస్వాల్ హీరోయిన్‌గా, అలాగే శ్రద్ధా శ్రీనాథ్, చాందిని చౌదరి కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి అప్‌డేట్ ట్రైలర్ వచ్చి అలరించిన సంగతి తెలిసిందే. కానీ ఏపీలో భారీ లెవెల్లో ప్లాన్ చేసిన ప్రీరిలీజ్ ఈవెంట్ అనూహ్యంగా రద్దయ్యింది. కానీ లేటెస్ట్‌గా ఫ్యాన్స్‌కి మరింత కిక్ ఇచ్చేవిధంగా రెండో ట్రైలర్‌ని మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ చిత్రానికి థమన్ సంగీతం అందించగా సితార ఎంటర్టైన్మెంట్స్ అలాగే ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ వారు నిర్మాణం వహించారు. జనవరి 12న సినిమా రిలీజ్‌కి వస్తుంది.

## అందుకే మెగాఫోన్ పట్టా..

చిత్ర పరిశ్రమలో రాణిస్తోన్న దర్శకులను ఉద్దేశించి బాలీవుడ్ నటి కంగనా రనౌత్ అగ్ర దర్శకుల తీరును ఆమె తప్పుపట్టారు. చిత్ర పరిశ్రమలో ప్రస్తుతం మంచి దర్శకులు లేరని ఆమె ఆరోపించారు. అందుకే తాను మెగా ఫోన్ పట్టాల్సి వచ్చిందన్నారు. దక్షిణాది చిత్రాల్లోనూ కథానాయికల పాత్రలు రూపొందిస్తున్న తీరుపై ఆమె అసహనం వ్యక్తంచేశారు.

"మన చుట్టూ ఉన్న దర్శకుల తీరు నాకు నచ్చడం లేదు. నిజం చెప్పాలంటే మనకు గొప్ప దర్శకులు ఎవరూ లేరు. ఒకవేళ మనకే కనుక మంచి దర్శకులు ఉండి ఉంటే నేను దర్శకత్వం వైపు మొగ్గు చూపేదాన్ని కాదు. ఎవరినో తక్కువ చేయాలని ఇలా చెప్పడం లేదు. మనస్ఫూర్తిగా చెబుతున్నా. మీరు ఎవరితో వర్క్ చేయాలనుకుంటున్నారు? డ్రీమ్ డైరెక్టర్ ఎవరు? అని నన్ను ప్రశ్నిస్తే.. వారికి నేనిచ్చే సమాధానం ఒక్కటే. అలాంటి వారెవరూ ఇప్పుడు భూమ్మీద లేరు. భారీ చిత్రాలను తెరకెక్కించే దర్శకులు సైతం వారి సినిమాల్లో కథానాయికల పాత్రను అతి దారుణంగా చిత్రీకరిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న దర్శకుల్లో నేను ఎవరితోనూ వర్క్ చేయాలనుకోవడం లేదు" అని తెలిపారు.

"కెరీర్ ఆరంభంలో తాను ఎంతోమంది నూతన దర్శకులతో కలిసి వర్క్ చేశానని అన్నారు. ప్రస్తుతం బాలీవుడ్లో మంచి చిత్రాలు తెరకెక్కించే దర్శకులు తగ్గిపోయారు. దర్శకత్వంలో రాణించాలనుకునేవారిని ప్రతిఒక్కరూ ప్రోత్సహించాలి. ముఖ్యంగా ఇండస్ట్రీకి చెందిన చాలామంది తమ రక్తంలోనే యాక్టింగ్ ఉందని వ్యాఖ్యలు చేస్తారు. అలాంటి వాళ్లందరూ ఇప్పుడు దర్శకత్వంవైపు ఎందుకు అడుగులు వేయకూడదు. విలాసవంతమైన జీవితానికి వాళ్లు అలవాటు పడ్డారు. అందుకే ఇటువైపు చూడటం లేదు" అని కంగన అన్నారు. కంగన స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఎమర్జెన్సీ'. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ రాజకీయ జీవితాన్ని ఆధారంగా చేసుకొని దీనిని రూపొందించారు. కంగనా రనౌత్ కథానాయిక. అనుపమ్ ఖేర్, మహిమా చౌదరి కీలక పాత్రలు పోషించారు. జనవరి 17న విడుదల కానుంది.

## ఆరోగ్యం కోసమే బ్రేక్ తీసుకున్నా..

'యే రిష్తా క్యా కెహలాతా హై' అనే హిందీ సీరియల్‌తో గుర్తింపు తెచ్చుకున్నారు బాలీవుడ్ నటి హీనా ఖాన్. తాను రొమ్ము క్యాన్సర్‌తో పోరాటం చేస్తున్నానని గతేడాది ప్రకటించారు ఈ భామ. ఈ క్రమంలోనే వర్క్ లైఫ్ నుంచి బ్రేక్ కూడా తీసుకున్నారు. తన తదుపరి ప్రాజెక్ట్ 'గృహలక్ష్మి' ప్రమోషన్స్‌లో భాగంగా తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు.



"నాకు వేరే అవకాశం లేదు. అప్పటి వరకూ నేను చేస్తోన్న ప్రాజెక్టు నుంచి విరామం తీసుకోవాల్సిన సమయం అది. తరచూ మనం స్క్రీన్‌పై కనిపించకపోతే ప్రేక్షకులు మనల్ని మర్చిపోతారు. ఈ పరిశ్రమలో ఉన్న కఠిన నిజమది. క్యాన్సర్‌తో పోరాడుతున్న సమయంలో కెరీర్‌కంటే ఆరోగ్యం పైనే ఎక్కువ ఫోకస్ పెట్టాలని అర్థమైంది. ప్రతి ఒక్కరికీ ఆరోగ్యమే మొదటి ప్రాధాన్యత కావాలి. ఆ సమయంలో చాలా ప్రాజెక్టులు చేజారిపోయాయి"అని తెలిపారు. ప్రస్తుతం తాను తిరిగి వర్క్ లైఫ్‌లో బిజీ కావాలనుకుంటున్నానని తెలిపారు. స్టేజ్ 3 బ్రెస్ట్ క్యాన్సర్‌తో తాను బాధపడుతున్నట్లు గతేడాది జూన్‌లో ప్రకటించారు నటి హీనా ఖాన్. తన కుటుంబసభ్యులు, స్నేహితుల సహకారంతో క్యాన్సర్ మహమ్మారితో పోరాటం చేస్తున్నానని తెలిపారు. ప్రస్తుతం చికిత్స కొనసాగుతోందని, దీనినుంచి కచ్చితంగా బయటపడగలననే నమ్మకం ఉందని ఆమె సోషల్ మీడియా వేదికగా రాసుకొచ్చారు. చికిత్స వివరాలు తెలియజేస్తూ తరచూ ఆమె సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెట్టారు.

## ఏడుద్దామన్నా.. ఏడ్వలేకపోయా



'యానిమల్ షూట్ రోజులు గుర్తు చేసుకున్నారు నటి త్రిప్తి దిమ్రి. సినిమాలో కీలకంగా ఉండే ఓ సన్నివేశంలో యాక్ట్ చేయడానికి తాను ఎంతో ఇబ్బందిపడ్డానని అన్నారు. ఆ సమయంలో రణబీర్ కపూర్ తనకెంతో సపోర్ట్ చేశారని చెప్పారు. "యానిమల్‌తోపాటు మరో సినిమా కోసం కూడా ఆ సమయంలోనే వర్క్ చేశా. డైలీ రెండు షిఫ్ట్స్ ఉండటం వల్ల బాగా అలసిపోయేదాన్ని. సరిగ్గా నిద్ర ఉండేది కాదు. 'యానిమల్'లో రణ్బీర్‌తో మాట్లాడే ఒక సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్నప్పుడు నేను ఎంతో ఇబ్బందిపడ్డాను. అది చాలా పెద్ద డైలాగ్ కావడంతో పూర్తిగా మర్చిపోయా. సీన్లో భాగంగా కన్నీళ్లు పెట్టుకోవాల్సిఉండగా.. నాకు ఏమాత్రం ఏడుపు రాలేదు. ఆ సమయంలో ఎంతో ఒత్తిడికి లోనయ్యా. నా పరిస్థితి అర్థం చేసుకున్న రణ్బీర్ ఎంతగానో సపోర్ట్ చేశాడు. వాళ్ల సమయాన్ని నేను వృథా చేస్తున్నాననే భావన నాకు కలిగించకుండా ఉండేందుకు తోడ్పడ్డాడు. కంగారు పడవద్దని.. రిలాక్స్‌గా ఉండమని చెప్పాడు' అని త్రిప్తి దిమ్రి తెలిపారు.

### అందుకే అంగీకరించా..!

ఇందులో జోయా పాత్ర అంగీకరించడంపై ఇటీవల త్రిప్తి దిమ్రి స్పందించారు. "అప్పటివరకూ కేవలం సున్నితమైన, పాజిటివ్ రోల్స్ మాత్రమే పోషించా. 'యానిమల్లో నా పాత్ర ఇందుకు భిన్నమైంది. మనసులో మోసం చేయాలనే ఆలోచన ఉన్నప్పటికీ.. పైకి మాత్రం దయ, సానుభూతి కనిపించాలని దర్శకుడు చెప్పారు. అది నాకు సవాలుగా అనిపించింది. వెంటనే సినిమాకు ఓకే చెప్పాను" అని అన్నారు.

### ఆ ఆఫర్ చేజారినట్టేనా..!

'యానిమల్ తర్వాత త్రిప్తికి యూత్‌లో క్రేజ్ పెరిగిన మాట వాస్తవమే. దీనితర్వాత ఆమె వరుస చిత్రాలు ఓకే చేశారు. అనురాగ్ బసు దర్శకత్వంలో తెరకెక్కనున్న 'ఆషికీ 3'లో కథానాయికగా ఆమెను ఎంచుకున్నట్లు గతంలో వార్తలు వచ్చాయి. తాజా సమాచారం ప్రకారం ఆ ప్రాజెక్ట్ త్రిప్తి వర్క్ చేయడం లేదని బీటౌన్‌లో టాక్. 'యానిమల్ కారణంగా ఆమెకు బోల్డ్ ఇమేజ్ వచ్చిందని.. అందుకే త్వరలో పట్టాలెక్కనున్న ఈ ప్రేమకథా చిత్రానికి ఆమెను ఎంపిక చేసుకోవడంపై మేకర్స్ ఆలోచనలో పడ్డారని సమాచారం. త్రిప్తి స్థానంలో మరో నూతన కథానాయికను ఎంచుకోవాలనుకుంటున్నారని వార్తలు వస్తున్నాయి. కార్తీక్ ఆర్యన్ ఈ సినిమాలో హీరోగా కనిపించనున్నారు.